ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

17-3-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 45 పేజీలు: 10+4 వెల: 6.50




అంగరంగ వైభవంగా 'ఆస్కార్' వేడుక
ఉత్తమ చిత్రం: వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్
7

# 30 దాకా అసెంబ్లీ
## 20న బడ్జెట్

**30న ద్రవ్య వినిమయ బిల్లు ఆమోదం**
**స్పీకర్, చైర్మన్ అధ్యక్షతన వేర్వేరుగా బిఎసి సమావేశం**
**ఆరు గ్యారెంటీలపై ప్రైవేటు బిల్లు పెడతాం: హరీష్ రావు**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి16:** తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఈనెల 30 వరకు సాగనున్నాయి. ఈ నెల 20న రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. 17,18 తేదీలలో గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై >>2



అసెంబ్లీ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన గవర్నర్ శుక్లా. చిత్రంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి చైర్మన్ గుత్తా, సిఎం రేవంత్, మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి తదితరులు

## అసెంబ్లీలో తెలంగాణ తల్లి

**విగ్రహాన్ని ఆవిష్కరించిన గవర్నర్ శివప్రతాప్ శుక్లా, సిఎం రేవంత్‌రెడ్డి**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి16:** సోమవారం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభానికి ముందు అసెంబ్లీ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులుహాజరయ్యారు. ముందుగా అసెంబ్లీ ఆవరణలో గాంధీ విగ్రహానికి, అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. తర్వాత తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు.



సోమవారం ఇరాన్‌లోని చాబహార్ పోర్టుసిటీపై ఇజ్రాయెల్, యుఎస్ బాంబుదాడి దృశ్యం

# పోరు ఉద్ధృతం

**ప్రత్యర్థులపై ఇరాన్ 'డాన్సింగ్ మిసైల్ ప్రయోగం'**
**హార్ముజ్ జలసంధిపై నాటో దేశాల వైఫల్యం: ట్రంప్**
**దుబాయ్, అబూదాబి ఎయిర్‌పోర్టులపై ఇరాన్ క్షిపణి దాడులు**
**ఇరాన్ ఛాబహార్ ఎయిర్‌పోర్టుపై ఇజ్రాయెల్, అమెరికా జెట్ దాడులు**

**టెహ్రాన్ /జెరూసలెం / వాషింగ్టన్, మార్చి 16:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలురోజురోజుకూ ఉద్ధృతం అవుతున్నాయి. ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయెల్‌లు బాంబులు, క్షిపణుల వర్షం కురిపిస్తుంటే ఇరాన్‌కూడా తానేమీ తగ్గేదిలేదంటూ గల్ఫ్‌దేశాల్లోని అమెరికా స్థావరాలతోపాటు ఆదేశాల ఎయిర్‌పోర్టులనూ టార్గెట్‌చేస్తూ దాడులుచేస్తోంది. దుబాయ్, యుఎఇల్లోని ఎయిర్‌పోర్టులపైమళ్లీ దాడులుచేయడంతో తాత్కాలికంగా సేవలు నిలిచిపోయాయి. విదేశీ ఎయిర్‌లైన్స్ అన్నింఇనినిరవధికంగా నిలిపివేసింది. అలాగే ఇరాన్‌కు ఆయువుపట్టులాంటి ఖర్గ్ ద్వీపంలోని మొత్తం చమురు స్థావరాలు, ఆస్తులన్నింటినీ >>2



సోమవారం అసెంబ్లీలో ఉభయసభలనుద్దేశించి ప్రసంగిస్తున్న గవర్నర్ శివప్రతాప్ శుక్లా

# అభివృద్ధి బాటలో.

**స్థిరమైన వృద్ధి దిశగా బడ్జెట్ రూపకల్పన**
**క్యూర్, ప్యూర్, రేర్ విధానంతో వికేంద్రీకరణ**
**హైడ్రా ద్వారా 1,045 ఎకరాల భూ సంరక్షణ**
**పారిశ్రామిక ప్రాంతంగా కొడంగల్ అభివృద్ధి**
**ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ శుక్లా ప్రసంగం**

**హైదరాబాద్,మార్చి16,ప్రభాతవార్త:** ప్రజాపాలన స్ఫూర్తితో మార్గదర్శకం పొందుతూ ప్రతిపౌరుడు అభివృద్ధిలో భాగస్వామిగా ఉండేలా, ప్రతి వర్గానికి అభివృద్ధి ఫలాలు అందేలా రాష్ట్రప్రభుత్వం బడ్జెట్ ఉండబోతుందని తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రకటించారు. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా సోమవారం అసెంబ్లీలో ఉభయసభలలో ప్రాతినిధ్యం వహించే శాసనసభ్యులు,శాసనమండలి సభ్యులను ఉద్దేశించి గవర్నర్ ఎస్‌పిశుక్లా తెలుగు,హిందీ,ఆంగ్లంలో ప్రసంగించారు. "2047-తెలంగాణరైజింగ్" దిశగా మనం >>2

# వంటగ్యాస్‌కు ఢోకా లేదు

**పెట్రోల్, డీజెల్ కొరత లేదు, కేంద్ర ప్రభుత్వం ప్రకటన**
**45 మెట్రిక్ టన్నుల ఎల్‌పిజితో ముంద్రా పోర్టు చేరిన శివాలిక్ నౌక**

**న్యూఢిల్లీ, మార్చి 16:** వంట గ్యాస్ కొరత ప్రచారంపై కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. గృహ వినియోగదారులకు 100 శాతం ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్లు అందుబాటులో ఉన్నాయని వెల్లడించింది. అన్ని రాష్ట్రాల్లోనూ ఎల్‌పిజి స్టాక్ గృహావసరాలకు సరిపోయేంత ఉందని >>2



## నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు

**హైదరాబాద్, మార్చి 16, ప్రభాతవార్త:** ప్రజాకవి, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడవీ పురస్కారాన్ని కేంద్రం ప్రకటించింది. కోవిడ్19 సమయంలో సమాజంలోని వేదన, భయం, మానవీయ కోణాలను వ్యక్తపరుస్తూ సిధారెడ్డి రచించిన అనిమేష గ్రంథానికి గాను ఈ అవార్డు ప్రకటించినట్లు అకాడమీ తెలిపింది.ఈ నెల 31న ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో అవార్డును అందజేస్తున్నట్లు తెలిపారు. సిధారెడ్డి మెదక్ జిల్లా కేంద్రంగా మంజీరా రచయితల సంఘం ఏర్పాటుచేసి, అన్ని వర్గాల ప్రజా సమస్యలు, సామాజిక సమానత్వం కోసం రచనలు చేస్తూ తమ కలాన్ని, గళాన్ని విప్పారరు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం >>2

**ప్రత్యూష కేసు: కోర్టులో లొంగిపోయిన సిద్ధార్థ రెడ్డి** 7

# కాంట్రవర్సీలు వద్దు



**మీడియాతో చిట్ చాట్ చేసేటప్పుడు జాగ్రత్త**
**గవర్నర్ ప్రసంగం మన ప్రభుత్వానికి రోడ్‌మ్యాప్**
**ఈసారి బడ్జెట్‌లో కొత్త స్కీమ్‌లు**
**అసెంబ్లీలో 3సార్లు అటెండెన్స్ తీసుకుంటాం**
**సిఎల్పీ సమావేశంలో ఎమ్మెల్యేలకు కీలక ఆదేశాలు**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి16:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎల్పీ సమావేశంలో ఎమ్మెల్యేలకు క్లాస్ తీసుకున్నారు. పలువురి తీరుపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. సోమవారం బీఏసీ సమావేశం అనంతరం కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశం జరిగింది. శాసనమండలి ఆవరణలోని కమిటీ హాల్‌లో జరిగిన సీఎల్పీ సమావేశం సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అసెంబ్లీలో, బయట అనవసర విషయాలు మాట్లాడవద్దని సూచించారు. సభకు అన్ని విధాలుగా ప్రిపేర్ అయి రావాలని అన్నారు. బయట చిట్‌చాట్‌లు మానివేయాలని అన్నారు. ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాలలోని సమస్యలను చెప్పుకోవడానికి మంత్రులు వారికి సమయం ఇవ్వాలని కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యేలు చెప్పే సమస్యలకు స్పందించాలని అన్నారు. ఇక నుంచి తాను కూడా ఎమ్మెల్యేలకు సమయం ఇస్తానని ముఖ్యమంత్రి అన్నారు. దీని కోసం ప్రభుత్వ విప్‌లు సమన్వయం చేయాలని, అసెంబ్లీ సమావేశాల సమయంలో రోజుకు కొందరు ఎమ్మెల్యేలు చొప్పున కలుస్తానని పేర్కొన్నారు. కాగా, సభలో ప్రతిపక్షాల ప్రతి అంశానికి కౌంటర్ ఇవ్వాలని ఎమ్మెల్యేలకు సూచించారు.ఇప్పటి సీఎల్పీ సమావేశానికి ఆరుగురు సభ్యులు రాలేదని ముఖ్యమంత్రి సీరియస్ అయ్యారు. సీఎల్పీకి రాలేనంత బిజీగా ఉన్నారా అని అసహనం వ్యక్తం చేశారు. ఆరోగ్య సమస్యలు ఉంటే మాత్రం మినహాయించవచ్చని పేర్కొన్నారు. అసెంబ్లీకి ప్రతి ఒక్కరు హాజరు కావాల్సిందే అని స్పష్టం చేశారు. తాము ప్రవేశపెట్టనున్న ఈ బడ్జెట్ ఇన్నోవేటివ్‌గా ఉంటుందని, విద్య, వైద్యంకు ప్రాధాన్యత ఉంటుందని వెల్లడించారు. సభలో మాట్లాడే సమయంలో విప్‌ల మధ్య సమన్వయం ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. బీఆర్ఎస్ హయాంలో జానారెడ్డి, మల్లు భట్టివిక్రమార్కలకు కూడా మైక్ ఇవ్వని సందర్భాలు ఉన్నాయని, సెషన్ మొత్తం సస్పెండ్ చేసి ఎమ్మెల్యేగా ఉన్నన్ని రోజులు నన్ను సభకు రాకుండా చేశారని, కానీ తాము ప్రతిపక్షాలకు మాట్లాడే సమయం ఇస్తున్నామని అన్నారు. రాజకీయాల్లో మాట్లాడే మాటల వల్ల వ్యక్తిగత డ్యామేజీ ఏమో కానీ, వ్యవస్థపై ప్రభావం పడుతుందని హెచ్చరించారు. ప్రతిఒక్కరు పార్టీ, ప్రభుత్వం లైన్‌లోనే స్పందించాలని సూచించారు. కాంగ్రెస్ సభ్యులు >>2

వందేమాతర గీతాలాపన సమయంలో
# ఎంఐఎం వాకౌట్
**నల్ల బ్యాడ్జీలతో అసెంబ్లీలో బిఆర్ఎస్ నిరసన** 2



# వడగళ్ల బీభత్సం

**పలు జిల్లాల్లో అకాల వర్షం**
**హైదరాబాద్‌లో పలుచోట్ల వాన**
**పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ**

**హైదరాబాద్, మార్చి 16, ప్రభాతవార్త:** తెలంగాణ వ్యాప్తంగ పలు జిల్లాల్లో అకాల వర్షాలు కురిశాయి. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వడగండ్లవాన కురిసింది.సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలో ఉరుములు మెరుపులతో వడగండ్ల వర్షం కురిసింది. అదే విధంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఈదురు గాలులతో కూడిన రాళ్ల వర్షం పడింది. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం, మెదక్ జిల్లా నర్సాపూర్, శివ్వంపేటలో గాలి దుమారంతో కూడిన వర్షం కురిసింది. సంగారెడ్డి జిల్లాలోనూ అక్కడక్కడా ఉరుములు,మెరుపులతో కూడిన వర్షం >>2


## ఉత్తర హైదరాబాద్‌లోని విల్లాల జోరుకు కాసాగ్రాండ్ బెలైర్ ఒక అద్భుత ప్రదర్శనగా నిలుస్తోంది

ఉత్తర హైదరాబాద్ నగరం యొక్క అత్యంత నిశితంగా పరిశీలించబడే నివాస కారిడార్లలో ఒకటిగా క్రమంగా అభివృద్ధి చెందుతోంది, మౌలిక సదుపాయాల విస్తరణ, కనెక్టివిటీని మెరుగుపరచడం మరియు స్థిరపడిన లగ్జరీ పొరుగు ప్రాంతాలతో పోలిస్తే తక్కువ ఆస్తి ధరలు దీనికి మద్దతు ఇస్తున్నాయి. హైదరాబాద్ పట్టణ పాదముద్ర దాని సాంప్రదాయ కేంద్రానికి మించి విస్తరిస్తూనే ఉన్నందున, ఉత్తర బెల్ట్ పెరుగుతున్న నివాస ఆసక్తిని చూస్తోంది. ఈ అభివృద్ధి చెందుతున్న ప్రకృతి దృశ్యంలో, గేటెడ్ కమ్యూనిటీలలో స్వతంత్ర విల్లాలకు పెరుగుతున్న డిమాండ్ గణనీయమైన ఊపును పొందుతోంది, ఇది పెద్ద నివాస స్థలాలు, గోప్యత మరియు తక్కువ సాంద్రత కలిగిన పొరుగు ప్రాంతాల వైపు గృహ కొనుగోలుదారుల ప్రాధాన్యతలలో మార్పును ప్రతిబింబిస్తుంది.

గౌడవెల్లిలోని కాసాగ్రాండ్ ద్వారా ప్రీమియం విల్లా కమ్యూనిటీ అయిన కాసాగ్రాండ్ బెలైర్ వంటి ప్రాజెక్టులు, డెవలపర్లు ఈ మారుతున్న డిమాండ్‌కు ఎలా స్పందిస్తున్నారో హైలైట్ చేస్తాయి. 9.35 ఎకరాలలో విస్తరించి ఉన్న ఈ అభివృద్ధిలో విస్తారమైన మరియు ప్రైవేట్ జీవన వాతావరణాలను అందించడానికి రూపొందించబడిన 79 అల్ట్రా-విలాసవంతమైన 5 BHK బంగ్లాలు ఉన్నాయి. ప్రతి ఇల్లు ప్రైవేట్ గార్డెన్‌లు, ప్రైవేట్ లిఫ్టులు మరియు అంకితమైన హోమ్ థియేటర్‌లతో వస్తుంది, ఇది లగ్జరీ హౌసింగ్‌లో వ్యక్తిగతీకరించిన స్థలాలపై పెరుగుతున్న ప్రాధాన్యతను ప్రతిబింబిస్తుంది.

ఈ ప్రాజెక్టును నిర్మాహమాటంగా మరియు పచ్చదనంపై బలమైన దృష్టితో రూపొందించారు, 75% కంటే ఎక్కువ అభివృద్ధి ల్యాండ్‌స్కేప్డ్ ఓపెన్ స్పేస్‌లకు అంకితం చేయబడింది. దీని వలన నివాసితులు సహజ కాంతి, వెంటిలేషన్ మరియు ప్రశాంతమైన పరిసరాల నుండి ప్రయోజనం పొందగలుగుతారు, ఇవి దట్టమైన అపార్ట్‌మెంట్ నివాసం నుండి దూరంగా వెళ్లాలనుకునే కొనుగోలుదారులు ఎక్కువగా కోరుకునే లక్షణాలు. ఇళ్లకు మించి, ఆధునిక విల్లా అభివృద్ధిలో నిర్వచించే లక్షణంగా మారుతున్న జీవనశైలి మౌలిక సదుపాయాలను కమ్యూనిటీ ఏకీకృతం చేస్తుంది. దాదాపు 20,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న రెండు గ్రాండ్ క్లబ్‌హౌస్‌లు మరియు 85 కంటే ఎక్కువ క్యూరేటెడ్ సౌకర్యాలు విస్తృత శ్రేణి వినోద మరియు వెల్నెస్ అనుభవాలను అందిస్తాయి. వీటిలో రూఫ్‌టాప్ స్విమ్మింగ్ పూల్స్, ఫ్లోటింగ్ మెడిటేషన్ డెక్స్, ల్యాండ్‌స్కేప్డ్ గార్డెన్స్, ఫిట్‌నెస్ జోన్‌లు మరియు విశ్రాంతి మరియు కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ రెండింటికీ మద్దతు ఇవ్వడానికి రూపొందించబడిన విశ్రాంతి స్థలాలు ఉన్నాయి.



ఇటువంటి విల్లా కమ్యూనిటీల పెరుగుదల ఉత్తర హైదరాబాద్‌లో జరుగుతున్న విస్తృత పరివర్తనతో దగ్గరి సంబంధం కలిగి ఉంది. భూమి కొరత ఎత్తైన అభివృద్ధికి దారితీసిన నగరంలోని పరిపక్వ ప్రాంతాల మాదిరిగా కాకుండా, **గౌడవెల్లి, మేడ్చల్ మరియు కొంపల్లి** వంటి ప్రాంతాలు ఇప్పటికీ మాస్టర్-ప్లాన్డ్, తక్కువ-సాంద్రత అభివృద్ధిని సాధ్యం చేసే పెద్ద భూభాగాలను అందిస్తున్నాయి.

ఈ ప్రాంతం యొక్క నివాస ఆకర్షణను బలోపేతం చేయడంలో కనెక్టివిటీ కూడా కీలక పాత్ర పోషించింది. ఉత్తర హైదరాబాద్ భారతదేశంలోని అతి పొడవైన జాతీయ రహదారులలో ఒకటైన NH-44 నుండి ప్రయోజనాలు, ఔటర్ రింగ్ రోడ్ (ORR) హైదరాబాద్ అంతటా సిగ్నల్-రహిత కనెక్టివిటీని అనుమతిస్తుంది. ఈ రవాణా కారిడార్లు ఈ ప్రాంతాన్ని **గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ మరియు హైటెక్ సిటీ** వంటి ప్రధాన ఉపాధి కేంద్రాలకు సమర్థవంతంగా అనుసంధానిస్తాయి, అదే సమయంలో **రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి** సౌకర్యవంతమైన యాక్సెస్‌ను కూడా అందిస్తాయి.

కాసాగ్రాండ్ బెలైర్ ఈ కనెక్టివిటీ ప్రయోజనం నుండి నేరుగా ప్రయోజనం పొందుతుంది. ఈ అభివృద్ధి **ఔటర్ రింగ్ రోడ్ ఎగ్జిట్ నంబర్ 5** నుండి కేవలం ఐదు నిమిషాల దూరంలో, మేడ్చల్ చెక్‌పోస్ట్ నుండి 10 నిమిషాల దూరంలో మరియు **భారతదేశంలో అతిపెద్ద ఫార్మా హబ్** అయిన **కొంపల్లి, బాచుపల్లి, బౌరంపేట మరియు గండిమైసమ్మ క్రాస్ రోడ్ల** నుండి సుమారు 15 నిమిషాల దూరంలో ఉంది.

ఈ ప్రాంతం యొక్క ఆర్థిక పర్యావరణ వ్యవస్థ కూడా బలపడుతోంది. **200 కంటే ఎక్కువ బయోటెక్నాలజీ మరియు ఫార్మాస్యూటికల్ కంపెనీలకు నిలయంగా ఉన్న 2,000 ఎకరాల లైఫ్ సైన్సెస్ క్లస్టర్** అయిన **జీనోమ్ వ్యాలీ**, ఉత్తర బెల్ట్‌ను బయోటెక్నాలజీ మరియు పరిశోధన కోసం భారతదేశంలోని కీలక కేంద్రాలలో ఒకటిగా ఉంచింది. ఇంతలో, **NH-44 మరియు ORR** కారిడార్ వెంట లాజిస్టిక్స్ మరియు గిడ్డంగుల కార్యకలాపాలు విస్తరిస్తూనే ఉన్నాయి.

మార్కెట్ సూచికలు ఈ పెరుగుతున్న ఊపును ప్రతిబింబిస్తాయి. 2025లో, ఉత్తర హైదరాబాద్ అంతటా అనేక సూక్ష్మ మార్కెట్లు **బలమైన వార్షిక ధరల** వృద్ధిని నమోదు చేశాయి, సగటు నివాస ధరలు **జూబ్లీ హిల్స్** వంటి స్థిరపడిన లగ్జరీ పొరుగు ప్రాంతాల కంటే గణనీయంగా తక్కువగా ఉన్నాయి.

హైదరాబాద్ బాహ్యంగా విస్తరిస్తూనే ఉన్నందున, విల్లా కమ్యూనిటీలు ఉత్తర హైదరాబాద్ నివాస ప్రకృతి దృశ్యాన్ని రూపొందించడంలో మరింత ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని భావిస్తున్నారు. **కాసాగ్రాండ్ బెలైర్** వంటి పరిణామాలు ఈ ప్రాంతం యొక్క తదుపరి దశ ప్రీమియం హౌసింగ్‌లో విశాలమైన, సౌకర్యాలతో కూడిన బంగ్లా జీవనం ఎంత నిర్వచించే లక్షణంగా ఉద్భవిస్తున్నదో వివరిస్తాయి.

ఈ కమ్యూనిటీ TG RERA (నం.P02200009521) కింద నమోదు చేయబడింది.

సంప్రదించండి : 6384002073



సోమవారం ముంబయి పోర్టు చేరుకున్న ఐఎన్ఎస్ శివాలిక్ నౌక

# వంటగ్యాస్‌కు ఢోకా లేదు

>> తెలిపింది. అలాగే పెట్రోల్, డీజెల్ కూడా తగినంత అందుబాటులో ఉందని కేంద్రం తెలిపింది. అన్ని చమురు శుద్ధి కర్మాగారాలు (రిఫైనరీలు) పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నట్లు వెల్లడించింది. పెట్రోల్, డీజెల్ కొరత లేదని స్పష్టం చేసింది. పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ సోమవారం ఢిల్లీలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ, "దేశంలో తగినంత పరిమాణంలో ముడిచమురు అందుబాటులో ఉంది. అన్ని శుద్ధి కర్మాగారాలు అత్యధిక సామర్థ్యంలో పనిచేస్తున్నాయి. దేశంలో పెట్రోల్ పంపులు సాధారణంగా పనిచేస్తున్నాయి. ఎక్కడా పెట్రోల్, డీజెల్ కొరత ఉన్నట్లు నివేదిక రాలేదు" అని పేర్కొన్నారు. పెట్రోలియం సరఫరా గొలుసు సజావుగా పనిచేస్తోందని పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ మంత్రిత్వ శాఖ అధికారులు స్పష్టం చేశారు. పెట్రోల్, డీజెల్ పంపిణీలో ఎటువంటి అంతరాయం లేదని పేర్కొన్నారు. రిటైల్ అవుట్‌లెట్‌లో ఇంధనం నిరంతరాయంగా అందుబాటులో ఉండేలా చమురు మార్కెటింగ్ కంపెనీలు సరఫరా పరిస్థితిని నిశితంగా పర్యవేక్షి స్తున్నాయని వెల్లడించారు. అలాగే పర్షియన్ గల్ఫ్ నుంచి బయలుదేరిన 45 వేల మెట్రిక్ టన్నుల ఎల్‌పిజి క్యారియర్ 'శివాలిక్' నౌక సోమవారం గుజరాత్‌లోని ముంద్రా తీరం చేరుకుంది. పశ్చిమాసియా ప్రాంతంలోని అన్ని భారత నౌకలు సురక్షితంగా ఉన్నాయని కేంద్రం పేర్కొంది. పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నామని ప్రభుత్వం తెలిపింది. ప్రతి నౌకలోని సిబ్బందితో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నామని వెల్లడించింది. పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో 611 మందితో కూడిన 22 భారతీయ జెండా కలిగిన నౌకలు ఉన్నాయని వివరించారు.

# నందిని సిధారెడ్డికి కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు

>> జరిగిన ఉద్యమంలో తన పాట, సాహిత్యం ద్వారా ప్రజలను ఆలోచింపజేస్తూ, ఉద్యమ కవిగా తెలంగాణ ప్రజల అభిమానాన్ని సిధారెడ్డి చూరగొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి యేటా అందించే, అత్యున్నత కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు 2025 ఈసారి ప్రముఖ తెలంగాణ కవి, రచయిత, నందిని సిద్ధారెడ్డి కి దక్కడం పట్ల, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ హర్షం వ్యక్తం చేశారు. కరోనా సందర్భంగా ప్రపంచం ఎదుర్కొన్న సంక్షోభాన్ని, ముఖ్యంగా మానవ సంబంధాల విచ్ఛిన్నతలను కవిత్వం ద్వారా హృద్యంగా చిత్రీకరించిన, దీర్ఘ కవితా సంపుటి అనిమేష కు ఈ అవార్డు రావడం గొప్ప విషయమని అన్నారు. తెలంగాణ మట్టివాసన తెలిసిన కవిగా, తన సాహిత్యం ద్వారా తెలంగాణ జీవితాన్ని అక్షరబద్ధం చేసిన తెలంగాణ గర్వించదగ్గ కవి, నందిని సిధారెడ్డి అని కెసిఆర్ కొనియాడారు. ప్రముఖ కవి, రచయిత, తెలంగాణ ఉద్యమకారుడు, తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మన్ నందిని సిధారెడ్డి కి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు దక్కడం యావత్ తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణమని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ అత్యున్నత పురస్కారం లభించడం ఈ సందర్భంగా సిధారెడ్డికి తన తరఫున , పార్టీ తరఫున మనస్ఫూర్తిగా అభినందనలు అంటు కెటిఆర్ తెలిపారు .నందిని సిధారెడ్డి ఆధునిక తెలుగు కవిత్వంలో ఎన్నో పరిశోధనలు చేసి, తన అమూల్యమైన రచనలతో తెలుగు సాహితీ రంగానికి విశిష్ట సేవలు అందించారని పేర్కొన్నారు. మంజీరా రచయితల సంఘం స్థాపించి తెలుగు సాహిత్యానికే వన్నె తెచ్చిన ఆయన కృషి మరువలేనిదన్నారు. ముఖ్యంగా తెలంగాణ స్వరాష్ట్ర ఆకాంక్షను, ఆవశ్యకతను తన శక్తివంతమైన పాటలతో చాటుతూ, తెలంగాణ ఉద్యమానికి ఒక గొప్ప ఊపునిచ్చిన ప్రజా కవిగా ఆయనను అభివర్ణించారు. సాహిత్య రంగంలో అత్యున్నత పురస్కారమైన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును సిధారెడ్డి గెలుచుకోవడం వారి సాహిత్య ప్రస్థానానికి దక్కిన గొప్ప గౌరవమని పేర్కొన్నారు. తెలంగాణ అస్తిత్వాన్ని, సంస్కృతిని తన కలం ద్వారా ప్రపంచానికి చాటిచెప్పిన ఆయనకు ఈ పురస్కారం దక్కడం సముచితమని అన్నారు. నందిని సిద్దారెడ్డిని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అభినందించారు.

# పోరు ఉధృతం

>> ధ్వంసంచేస్తామనిప్రకటించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్‌ఇపుడు భూతల దాడులతో హోరెత్తిస్తున్నారు. ఇప్పటివరకూ 2300 మందికిపైగా చనిపోయిన ఈ పశ్చిమాసియా దేశాల్లో హర్ముజ్‌జలసంధిని తెరిపించేందుకు ఇపుడు నాటోపై ట్రంప్ అస్త్రంప్రయోగించారు. ఈ జలసందిగుండా నాటో దేశాల నౌకలు కూడా వెళుతున్నందున తక్షణమే స్పందించాలని లేనిపక్షంలో నాటో వైఫల్యం స్పష్టం అవుతోందంటూ నాటోపై విమర్శలతో ధ్వజమెత్తారు. మొత్తంగా తాము ఏడు వేల టార్గెట్లు నాశనంచేసామని, ఇరాన్‌ను పూర్తిగా ధ్వంసంచేసామని ప్రకటించుకున్న ట్రంప్ వందకుపైగా ఇరాన్ నౌకలను ముంచివేయడం లేదా ధ్వంసంచేయడమో చేయడం జరిగిందన్నారు. ఇప్పటికీ ఇరాన్ అమెరికా మిత్రదేశాలైన సౌదీ అరేబియా, యుఎఇ, ఖతార్; ఒమన్,కువైట్ వంటి దేశాలపై డ్రోన్లు, బాలిస్టిక్ క్షిపణులతో దాడులుచేస్తోంది. ఇదిలా ఉంటే అమెరికా యుద్ధవిమానాలు ఇరాన్‌లోని ఛాబహార్ పోర్టువద్ద ఉన్న వాణిజ్య కేంద్రంపై దాడులుచేసాయి. ఇదిలా ఉంటే తాము హర్ముజ్ జలసంధిని రక్షించుకోవడంలో సహకరిస్తామని, అయితే ముందు ఇరాన్‌పైయుద్ధం విరమించి ఆపై తమతో కలిసి రావాలని చైనా అమెరికాకు షరతుపెట్టింది. అయితే ట్రంప్ వైపునుంచి మాత్రం ఎలాంటి స్పందన కనిపించలేదు. ఇరాన్ సుప్రీం లీడర్‌మొజ్తబా ఖమైనీ కదలలేని స్థితిలోఉన్నారని, రహస్యస్థావరంలో చికిత్స పొందుతున్నట్లువచ్చిన వార్తలను ఇరాన్ ఉప విదేశాంగమంత్రి ఇస్మాయిల్ బాఘేయి ఖండించారు. తమ నాయకత్వం పటిష్టంగా ఉందని, ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారంటూ ఇదంతా విషప్రచారమేనని కొట్టివేసారు. అయితే ఆయన ఎక్కడ న్నారు. చికిత్సలో ఉన్నారా అన్న అంశాలను ఆయన బహిర్గతంచేయలేదు. భద్రత దృష్ట్యా ప్రస్తుతపరిస్థితుల్లో ఆయన ఆచూకీ గోప్యంగానే ఉంటుందని చెప్పారు. ఇరాన్ ఇపుడు కొత్తగా ప్రయోగిస్తున్న డాన్సింగ్‌మిసైల్ ఇజ్రాయెల్‌ను కలవరపెడుతోంది. గింగిరాలు తిరుగుతూ ఇరాన్ ఐర్‌డోమ్‌కు సైతం చిక్కకుండా దాడులుచేసే సామర్థ్యం ఉండటంతో ఈ క్షిపణిని నేలకూల్చడం ఎలా అనే అంశంపై అటు ఇజ్రాయెల్, ఇటు అమెరికాలు తలలు పట్టుకుంటున్నాయి. ఇప్పటికే అబూదాబి, దుబాయిలపై ప్రయోగించిన ఇదే మిసైల్‌ను ఇరాక్‌లోని యుఎస్ రాయబార కార్యాలయం, కువైట్‌లోని ఎంబసీలపైనా ప్రయోగించడంతో ఇపుడు ఈ రెండుదేశాలు వీటికి విరుగుడుపై తర్జనభర్జనలు పడుతున్నాయి.

# వందేమాతర గీతాలాపన సమయంలో ఎంఐఎం వాకౌట్

## నల్ల బ్యాడ్జీలతో అసెంబ్లీలో బిఆర్ఎస్ నిరసన

**హైదరాబాద్, మార్చి 16,ప్రభాతవార్త:** తెలంగాణ అసెంబ్లీ ఎంఐఎం వాకౌట్‌తో సోమవారం ప్రారంభమైంది. వందేమాతరగీతం అసెంబ్లీలో ఆలపించినందుకు వాకౌట్‌తో తమనిరసన తెలిపారు. జయజయహే తెలంగాణ రాష్ట్రగీతం, వందేమాతరం, జనగణమణ జాతీయ గీతాలను ప్రారంభంలో ముగింపులో వరుసక్రమంగా ఆలపించారు. ఎంఐఎం ఫ్లోర్‌లీడర్ అక్బరోద్దీన్ ఒవైసి నిరసన వ్యక్తం చేస్తూ తన పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి వాకౌట్ చేసినారు. గీతాలాపన ముగిసిన తరువాత వారు సభలోకి అడుగుపెట్టారు. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా గంటపాటు అసెంబ్లీ సమావేశ మందిరంలో ఉభయ సభలకు చెందిన శాసనసభ్యులను శాసనమండలి సభ్యులనుద్దేశించి ప్రసంగించారు. గవర్నర్ ప్రసంగించినంత సేపు శాసనసభలో నల్ల బ్యాడ్జీలు ధరించి, నిల్చొని బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు నిరసన తెలిపారు. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పించడంపై కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ ఆందోళన చేపట్టారు. తెలుగు హిందీ, ఇంగ్లీషులో తన ప్రసంగం కొనసాగించారు. గవర్నర్ ప్రసంగం ముగియగానే మంగళవారంకు సభను వాయిదా వేశారు.

### అధికార పక్షంవైపు కూర్చున్న

# ఫిరాయింపు ఎమ్మెల్యేలు

## అసెంబ్లీ సమావేశాలు నేటికి వాయిదా

**హైదరాబాద్, మార్చి 16,ప్రభాతవార్త:** అసెంబ్లీలో అధికార పక్షంవైపు ఫిరాయింపు ఎమ్మెల్యేలు కూర్చొన్నారు. హుజురాబాద్‌కు చెందిన బిఆర్ఎస్ ఎమ్మెల్యే పాడికౌశిక్ రెడ్డి బిఆర్ఎస్ వైపు కూర్చోవాలని ఎమ్మెల్యే కాలే యాదయ్యను కోరారు. తాను కాంగ్రెస్‌వైపు కూర్చొంటానని కాలెయాదయ్య తిరస్కరించారు. కాంగ్రెస్‌పార్టీ నుంచి లోక్‌సభ అభ్యర్థిగా పోటీచేసిన దానం నాగేందర్, కాంగ్రెస్ ఎంపిగా కడియం కావ్యను గెలిపించుకొన్న బిఆర్ఎస్ స్టేషన్ ఘనపురం ఎమ్మెల్యేలతో పాటు మిగితా ఎనిమిది మందిని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పార్టీఫిరాయింపులకు పాల్పడలేదని తీర్పునిచ్చారు.

## వారం - వర్జ్యం

17-03-2026, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఫాల్గుణమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, కృష్ణపక్షం, పూర్వాభాద్ర కార్తె
త్రయోదశి ఉ.9.21
ధనిష్ఠ ఉ.6.12
వర్జ్యం : మ.12.36-మ.2.13
దు.ఉ.8.40-9.28, 2)రా.11.08-11.56
శుభసమయం: ఉ.6.30-7.30
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం:** ప్రజా సంబంధాలు వృద్ధి చేసుకోవటానికి విశేషంగా కృషి చేస్తారు. అనుకోని అవకాశాలు లభిస్తాయి.

**వృషభం:** సన్నిహితులు, నిపుణులతో సంప్రదించకుండా ఏ ముఖ్య కార్యక్రమాన్నీ అమలుచేయకండి. గృహం కొనుగోలు యత్నాలు.

**మిథునం:** వివాహాది శుభకార్యాలలో మీ అభిప్రాయాలను, మీ సన్నిహితులు సమర్థించరు. కుటుంబ సభ్యులతో భేదాభిప్రాయాలు వస్తాయి.

**కర్కాటకం:** సంగీత, సాహిత్య కళారంగాలలో ప్రత్యేక అభిరుచి కనబరుస్తారు. ఉద్యోగంలో ప్రమోషన్లు వచ్చే సూచనలు. వాహన సౌఖ్యం.

**సింహం:** కనుమరుగైన కొన్ని సెంటిమెంట్ వస్తువులు దరికిచేరతాయి. చెప్పదగిన సూచన. కాంట్రాక్టులు దక్కుతాయి.

**కన్య :** ఎవ్వరినీ తక్కువగా అంచనా వేయకండి. మితిమీరిన ఆత్మవిశ్వాసం మంచిదికాదు. ప్రముఖుల కలయిక.

**తుల :** దూరప్రాంతాల నుండి శుభవార్తలు అందుకుంటారు. వృత్తి, వ్యాపారంలో మీ స్థాయి పెరుగుతుంది. వస్త్రలాభం కలదు.

**వృశ్చికం:** సోదరులతో ఏర్పడిన అభిప్రాయ భేదాలు ఆదిలోనే తృంచివేయండి. ఆర్థిక లావాదేవీలు లాభిస్తాయి. వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**ధనుస్సు:** విలాస వస్తువులు, వాహనాలు కొనుగోలు చేస్తారు. చాకచక్యంగా కొన్ని వ్యవహారాలను చక్కదిద్దుకుంటారు.

**మకరం:** ముఖ్యమైన విషయాలలో నిర్ణయాలు తీసుకునేటప్పుడు పెద్దల సలహాలు పాటించడం అన్ని విధాలా మంచిది. శుభవార్తలు అందుకుంటారు.

**కుంభం:** ప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం ఎంతైన కలదు.

**మీనం:** సులువుగా అవుతుందనుకున్న ఒక పని వాయిదా పడుతుంది. జీవిత భాగస్వామి సలహాలు పాటిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# అభివృద్ధి బాటలో.

>> వేస్తున్న అడుగులు సమగ్ర అభివృద్ధి, కొత్తకొత్త సాంకేతిక ఆవిష్కరణలతో ప్రపంచంకు దిక్సూచిగా నిలపబోయే విజన్ మన బడ్జెట్‌లో ఉంటుందని తెలిపారు. గత సంవత్సర కాలంలో సాహసోపేతమైన సంస్కరణలు, సంక్షేమ పథకాలు అందరికి అందేలా మనం పటిష్టమైన పునాదులను వేశామని "శమించేతత్వం గల తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు" తెలుపుతూ గవర్నర్ చెప్పారు. తెలంగాణ ప్రస్తుత ఆర్థికపరిస్థితి స్థిరమైన పునాదిపై ఉందనీ 2034కు ఒక ట్రిలియన్ లక్ష్యంతో విజన్ 2047 ద్వారా మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు రోడ్ మ్యాప్ రూపొందించామని తెలిపారు. రాష్ట్ర తలసరి ఆదాయం 4లక్షల 18వేల 931కి చేరిందని తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర జిఎస్‌డిపి రూ.17.82లక్షలకోట్లతో 10.7శాతం వృద్ధిరేటును కలిగింది. భారత జిడిపికి 4.99శాతం తోడ్పాటును తెలంగాణ అందిస్తోందని చెప్పారు. ధరలస్థిరత్వం కొనసాగిస్తూ ద్రవ్యోల్బణం 0.2శాతంకు కట్టడి చేసిందని భారత ఆర్థిక వ్యవస్థ స్థిరమైన వృద్ధిని కొనసాగిస్తూ, 8.0శాతం అంచనా వేసిన జాతీయ వృద్ధిరేటులో 1.72శాతం ద్రవ్యోల్బణ, స్థిరమైన వృద్ధితో తలసరి ఆదాయం కొనసాగుతోన్నదని గణాంకాలతో వివరిస్తూ గవర్నర్ సంతృప్తిని వ్యక్తం చేశారు. వికేంద్రీకృత అభివృద్ధి కోసం క్యూర్, ప్యూర్, రేర్ విధాన రూపకల్పన చేశామని దీనితో హైదరాబాద్‌లో మాత్రమే అభివృద్ధిని కేంద్రీకరించే విధానంకు భిన్నంగా రాష్ట్రమంతటా సమతుల్యమైన సమగ్ర అభివృద్ధి చేకూర్చడానికి వైరుధ్యభరితమైన వ్యూహాలను అనుసరిస్తామని గవర్నర్ తన ప్రభుత్వ విధానంను వివరించారు. రాష్ట్రంలో పట్టణాభివృద్ధికి క్యూర్ మోడల్ అనుసరిస్తున్నామనీ అన్నారు. 2031నాటికి తెలంగాణలో పట్టణ జనాభా 53.8శాతంకు చేరుతోందని జిహెచ్ఎంసిని ఇటీవలే మూడు కార్పొరేషన్లుగా హైదరాబాద్‌ను నాలుగు కమీషనరేట్లుగా విభజించామని చెప్పారు. హైడ్రా ద్వారా 1,045 ఎకరాల ప్రభుత్వ భూమిని సంరక్షించామని దీని విలువ 60వేల కోట్ల రూపాయల ఉంటుందని చెప్పారు. 23వ బయో ఆసియా సదస్సు ద్వారా రూ.17వందల కోట్ల పెట్టుబడులను ఆకర్షించామని జిసిసిలలో 20శాతం ఆతిథ్యం ఇస్తూ హైదరాబాద్‌ను గ్లోబల్ టెక్ హబ్ కావడంతో ప్రపంచ పెట్టుబడులకు గమ్యస్థానం తెలంగాణ మారిందని అన్నారు. గ్లోబల్ సమ్మిట్ ద్వారా 5 లక్షల 72 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని గవర్నర్ పేర్కొన్నారు. ఆర్ఆర్ఆర్, ఓఆర్ఆర్‌కు అనుబంధంగా రేడియల్ రోడ్లు నిర్మిస్తామని తెలిపారు. ఫ్యూచర్ సిటీ నుంచి బందర్ పోర్టు వరకు గ్రీన్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం చేపడతామని వివరించారు. బుల్లెట్ రైళ్లకు శంషాబాద్ కేంద్రంగా మారబోతోందన్నారు. వరంగల్, ఆదిలాబాద్‌లో కొత్త ఎయిర్‌పోర్టులు రాబోతున్నాయని గవర్నర్ వెల్లడించారు. ఐటి రంగంలో 9.39 లక్షల మందికి ఉద్యోగాలు లభించాయని, 3.13కోట్ల రూపాయల విలువగల ఎగుమతులు చేశామని తెలిపారు. కొండగల్ ప్రాంతం పారిశ్రామికవాడగా మారబోతోంది. హిల్ట్ పాలసీ ద్వారా పరిశ్రమల భూముల బదలాయింపు చేపట్టామని గవర్నర్ తెలిపారు. పరిశ్రమలను ఓఆర్ఆర్ అవతలకు తరలించాలని నిర్ణయించామని గవర్నర్ తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్ తరహాలో రీజినల్ రింగ్ రోడ్ నిర్మిస్తున్నామని ఆయన సభకు వివరించారు. ఆర్ఆర్ఆర్ చుట్టూ ఎమ్ఎస్ఎమ్ఇ పార్కులు ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. ఇల్లులేని పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని గవర్నర్ తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా 4లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టినట్లు వెల్లడించారు. వానాకాలం రైతు భరోసా కింద 9 రోజుల్లో 8744కోట్లు వేల కోట్లు అందించామని ఎస్‌పి శుక్లా చెప్పారు. రైతుల రుణభారం రూ.20616కోట్లు తగ్గించడానికి రుణమాఫీ చేశామని తెలిపారు. కొత్తగా 15.12లక్షల రేషన్‌కార్డులు ఇచ్చామని 3.38 కోట్ల మందికి సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు. మహాలక్ష్మీ పథకం కింద రూ.9222కోట్లు ఉచిత ప్రయాణంతో మహిళలు ఆదా చేశారని తెలిపారు. ఎస్‌హెచ్‌జీలకు రూ.లక్ష కోట్ల రుణాలు అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. అన్ని నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా స్కూల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. మూసీ నది ప్రక్షాళనకు ప్రణాళికలు రచిస్తున్నామని, తొలి దశలో హిమాయత్‌సాగర్ నుంచి గాంధీసరోవర్ వరకు అభివృద్ధి చేపడతామని ఆయన చెప్పారు. మూసీలో మురుగు నీరు చేరకుండా 39 ఎస్‌టిపిలను నిర్మిస్తున్నట్లు ఉభయసభ సభ్యులకు తెలిపారు . వ్యవసాయరంగ అభివృద్ధికి రేర్ నమూనా రూపొందించామని తెలిపారు. ప్రజాపాలనప్రగతి ప్రణాళిక అమలుకు 99 రోజుల కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. ప్రజావాణికి వచ్చిన 64,697 పిటిషన్లలో 47,670 పరిష్కరించామని తెలిపారు. డ్రగ్స్ నిర్మూలనకు ఈగల్ కృషిచేస్తోందనీ టిజిపిఎస్‌సి ఇతర నియామకబోర్డులలో సంస్కరణలు చేపట్టి 67,763 మందిని కొత్తగా ఉద్యోగాలలో నియమించామని ఆయన వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించామని తెలిపారు.

# వడగళ్ల బీభత్సం

>> కురిసింది. గంటకు 41 నుంచి 61 కి.మీ వేగంతో గాలులు వీచాయి. భారీ ఈదురుగాలులతో కురిసిన వడగళ్ల వర్షానికి ఆయా జిల్లాల్లో పంటలు దెబ్బతిన్నాయి. పొట్టదశలో ఉని వరి పై వడగళ్లు పడడంతో చేలు ధ్వంసమయ్యాయి. మామిడి కాయలు నేలరాలాయి. పలుచోట్ల మొక్కజొన్న పంట నేల వాలింది. ఇక హైదరాబాద్ మహా నగరంలోనూ సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వాన ధాటికి నగరంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. అకస్మాత్తుగా కురిసిన ఈ వర్షంతో కార్యాలయాల నుండి ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నగరంలోని కీలక ప్రాంతాలైన ఐటి కారిడార్ (మాదాపూర్, గచ్చిబౌలి), జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఖైరతాబాద్, అమీర్‌పేట్, కూకట్‌పల్లి మరియు పాతబస్తీ, సికింద్రాబాద్ ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. డ్రైనేజీలు పొంగిపొర్లడంతో ప్రధాన రహదారులు చెరువులను తలపించాయి. మోకాళ్ల లోతు నీరు చేరడంతో ద్విచక్ర వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. వర్షం కారణంగా రోడ్లపైన నీరు నిలవడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. ముఖ్యంగా పంజాగుట్ట, హైటెక్ సిటీ ఫ్లైఓవర్ల వద్ద వాహనాలు నెమ్మదిగా కదలడంతో భారీగా ట్రాఫిక్ జాం అయింది.

రానున్న నాలుగు రోజులపాటు రాష్ట్రంలో పలు జిల్లాల్లో అకాల వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. 17న తెలంగాణలోని పలు జిల్లాలలో ఉరుములు మెరుపులతోపాటు గంటకు 30 నుండి 40 కి.మీ వేగంతో కూడిన ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని పేర్కొంది. అదిలాబాద్, కొమరంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం ,రంగారెడ్డి ,హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్ ,సంగారెడ్డి ,మెదక్, కామారెడ్డి జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ అయింది.



సోమవారం బిఎసి సమావేశంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, డి.సిఎం భట్టి, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు హరీష్‌రావు, అక్బరుద్దీన్ ఒవైసీ తదితరులు

# 30 దాకా అసెంబ్లీ

>> చర్చించనున్నారు. 19వ తేదీన ఉగాది పండుగ కారణంగా అసెంబ్లీ సమావేశాలకు సెలవు ప్రకటించనున్నారు. 21న రంజాన్ పండుగ, 22న ఆదివారం కావడంతో అసెంబ్లీ సమావేశాలకు సెలవు ఇచ్చేందుకు నిర్ణయించారు. సోమవారం స్పీకర్ ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన ఆయన ఛాంబర్‌లో బీఏసీ సమావేశం జరిగింది. ఈ బీఏసీ సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, అసెంబ్లీ వ్యవహారాలు, ఐటీ, పరిశ్రమాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, బీసీ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్, అసెంబ్లీ కార్యదర్శి రెండ్ల తిరుపతి, బిఆరెసెల్పీ ఉపనేత హరీశ్‌రావు, బిఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానందగౌడ్, బిజెఎల్పీ పక్షనేత మహేశ్వర్‌రెడ్డి, ఎంఐఎం ఎల్పీ పక్ష నేత అక్బరుద్దీన్, సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పాల్గొన్నారు. ఈ సమావేశంలో అసెంబ్లీ ఎన్ని రోజులు నిర్వహించాలనే విషయంపై చర్చించారు. ఈ నెల 20న అసెంబ్లీలో ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. ఈ నెల 23,24 తేదీల్లో బడ్జెట్‌పై సాధారణ చర్చ జరుగనుంది. 25,26 తేదీల్లో, 28,29 తేదీల్లో పద్దులపై చర్చ జరగనుంది. 27వ శ్రీరామనవి పండుగ ఉండటంతో అసెంబ్లీ సమావేశాలకు సెలవు ఉండనుంది. 17,18 గవర్నర్ ప్రసంగంపై 18వ తేదీన సిఎం రేవంత్‌రెడ్డి సమాధానం ఇవ్వనున్నారు. ఈ నెల 30న ద్రవ్య వినమయ బిల్లును ఆమోదించి అదే రోజు అసెంబ్లీ సమావేశాలు ముగించాలని ప్రభుత్వం యోచిస్తుంది. ఆదివారాలు కూడా సమావేశాలు కొనసాగించాలని ఇతర పార్టీల అభిప్రాయం వ్యక్తం చేశాయి. ఉగాది, రంజాన్, శ్రీరామనవమి మినహా అన్ని రోజులు నడపాలని బిఏసి సమావేశంలో సభ్యులు విజ్ఞప్తి చేశారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అధ్యక్షతన శాసనమండలి భవనంలో బిఏసీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అసెంబ్లీ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు, డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, ఎమ్మెల్సీలు మహేశ్‌కుమార్‌గౌడ్(కాంగ్రెస్) ఏవిఎన్‌రెడ్డి(బిజెపి), నెల్లికుంటి సత్యం(సిపిఐ) శ్రీపాల్‌రెడ్డి, ఎఫ్ఎండి(ఎంఐఎం), శాసనమండలి కార్యదర్శి డాక్టర్ వి.నరసింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు. మండలి సమావేశాలు కూడా ఈనెల 30వ తేదీ వరకు సాగనున్నాయి. పద్దులపై మండలిలో చర్చ లేనందున ఈనెల 25 నుంచి 29వ తేదీ వరకు మండలి సమావేశాలకు సెలవులు ఉండనున్నాయి. కాగా,. బీఏసీ సమావేశం అనంతరం విపక్ష నేతలు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ తల్లి విగ్రహ ప్రారంభోత్సవానికి తమని ఆహ్వానించలేదని హరీష్ రావు తెలిపారు. అసెంబ్లీ సమావేశాలు 30 వరకు నిర్వహిస్తామని అన్నారని, అందులో ఐదు సెలవులు ఉన్నాయని, ఆరు, ఏడు పని దినాలు కూడా ఉండవని, సమావేశాలు పొడిగించాలని అడిగామని అన్నారు. 31 వరకు నిర్వహించాలని, అవసరమైతే ఆదివారాలు కూడా పెట్టాలని అడిగామని, సీఎంతో మాట్లాడి చెబుతామని అన్నారని చెప్పారు. బీఆర్ఎస్ సభ్యులు మాట్లాడుతుంటే మంత్రులు పదేపదే అడ్డుపడుతున్నారని చెప్పామని, సీఎం, సంబంధిత మంత్రి, శాసనసభా వ్యవహారాల మంత్రి తప్ప ఇతరులు జోక్యం చేసుకోకుండా చూడాలని కోరామని, చేస్తానని స్పీకర్ చెప్పారని, పాయింట్ ఆఫ్ ఆర్డర్, నిరసనకు కూడా అవకాశం ఇవ్వాలని అడిగామని, ఇస్తామని స్పీకర్ చెప్పారని అన్నారు.

ఆరు గ్యారెంటీలపై ప్రైవేట్ బిల్లు పెడతామని, అనుమతించాలని కోరామని, బీఆర్ఎస్‌కు తక్కువ సమయం ఇస్తున్నారని, బీఏసీలో తీసుకున్న నిర్ణయాలు కాకుండా మినిట్స్‌లో వేరే పెడుతున్నారని వాటిని కనీసం పట్టించుకోవడం లేదని గుర్తు చేశామని అన్నారు. బీఏసీ నిర్ణయాలు అమలు చేయకపోతే తర్వాత సమావేశాన్ని బాయ్ కాట్ చేస్తామని చెప్పామని అన్నారు. సభా హక్కుల కమిటీ ఏర్పాటు చేయాలని గట్టిగా అడిగామని, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక చేపట్టకపోతే సభా హక్కుల ఉల్లంఘన కమిటీ బాధ్యతలు స్పీకర్ చేపట్టాలని కోరామని, స్వల్పకాలిక చర్చ కోసం బీఆర్ఎస్ తరఫున 19 అంశాలను ఇచ్చామని, కనీసం సగమైనా చర్చకు తీసుకోవాలని కోరామని, బిల్లులు ముందు ప్రవేశపెడితే చదువుకునేందుకు అవకాశం ఉంటుందని, కనీసం రెండు రోజులైనా సమయం ఇవ్వాలని కోరామని పేర్కొన్నారు. తొమ్మిది గంటలకే సమావేశాలు పెట్టాలని కోరామని, నియోజకవర్గ అభివృద్ధి నిధులు కూడా ఇవ్వాలని కోరామని వెల్లడించారు. బీఏసీ సమావేశంలో ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం స్పష్టమైందని బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. సమస్యల నుంచి తప్పించుకునేందుకే ప్రభుత్వం సమావేశాల రోజులు తగ్గిస్తుందని విమర్శించారు. కనీసం 30 రోజులు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని కోరామని, ఐదారు రోజులు బడ్జెట్ పైన చర్చ పెట్టి ఆమోదం తెలుపుకోవాలని చూస్తుందని, ప్రభుత్వం సమస్యలపైన చర్చించకుండా తప్పించుకుంటుందని తెలిపారు. గవర్నర్ ప్రసంగం చూస్తే పేదవాడికి భరోసా ఇచ్చేలా లేదని, ఇచ్చిన హామీల అమలుపై గవర్నర్ ప్రసంగంలో లేదని అన్నారు. లెక్కకు మించిన లక్షలాది అప్పు ప్రభుత్వం చేస్తోందని ఆరోపించారు. అప్పుల విషయం గవర్నర్ ప్రసంగంలో ప్రస్తావించలేదని, గవర్నర్ ప్రసంగంలో పస లేదని, బీఏసీ సమావేశంలో సభ ఎన్ని రోజులు నడుపుతారనే స్పష్టత లేదని పేర్కొన్నారు.

## నేడు ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మార్చి16:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం ఢిల్లీ వెళ్లనున్నారు. మధ్యాహ్నం 1:30 గంటలకు ఢిల్లీకి ఆయన బయలుదేరనున్నారు. ఢిల్లీలో పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. సాయంత్రం ఢిల్లీలో సల్మాన్ కుర్షిద్ పుస్తకావిష్కరణ కార్యక్రమానికి సీఎం హాజరుకానున్నారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటన షెడ్యూల్ ఖరారైంది.

# కాంట్రవర్సీలు వద్దు

>> అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రతిపక్షాలు లేవనెత్తే అంశాలపై సమాధానం ఇచ్చే సమాచారం కలిగి ఉండాలని సూచించారు. ప్రజా ప్రభుత్వంలో మూడవ బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నామని, ప్రభుత్వ ప్రాధాన్యతలు, భవిష్యత్ ప్రణాళికలకు సంబంధించి గవర్నర్ ప్రసంగంలో వివరించారని, గవర్నర్ ప్రసంగం మన ప్రభుత్వానికి రోడ్ మ్యాప్ లాంటిదని రేవంత్ రెడ్డి తెలిపారు. ఈసారి బడ్జెట్‌లో కొత్త స్కీమ్‌లు పెడుతున్నామని తెలిపినట్లు సమాచారం. ఇక గత ప్రభుత్వ వైఫల్యాలపై చర్చించాల్సిన సమయం అయిపోయిందని, మన భవిష్యత్ ప్రణాళికలు, ప్రజలకు ఏం చేయబోతున్నామనే దానిపై దృష్టిసారించాలని సూచించారు. సభలో మాట్లాడే అంశాలపై విప్‌ల మధ్య సమన్వయం ఉండాలని, సభలో చర్చ పక్కదారి పట్టకుండా, సభా సమయం వృధా కాకుండా సమర్థవంతంగా నడిపేలా చూడాలని ఆదేశించారు. అసెంబ్లీ సమావేశాల సమయంలో హాజరు విషయంలో ఎమ్మెల్యేలు నిరక్ష ్యం వహించొద్దని సీఎం ఆదేశించారు. మహిళా శాసన సభ్యులు హాజరుతో పాటు చర్చల్లో పాల్గొనాలని, సభా చర్చల్లో మహిళా సభ్యుల భాగస్వామ్యం అవసరమని తెలిపారు. అసెంబ్లీ కమిటీలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర రాష్ట్రాలు పర్యటించి సమస్యలు, ఆయా ప్రభుత్వ విధానాలను అధ్యయనం చేయాలని ఆదేశించారు. పార్టీ, ప్రభుత్వ పరమైన లైన్‌లోనే అందరూ స్పందించాలని, ఇది మన ప్రభుత్వమని, ఇప్పుడు మనం వేసుకునే రోడ్ మ్యాప్‌నే వచ్చే ఎన్నికలకు ఎజెండా అవుతుందని స్పష్టం చేశారు. వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్యపై ఫోకస్ పెట్టాలని, 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికను క్షేత్ర స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిందేనని ఆదేశించారు. మీడియాతో చిట్ చాట్ చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని ఆదేశించారు. మీ నియోజకవర్గం వరకు మాట్లాడితే బాగుంటుందని సూచించారు. రాష్ట్రస్థాయి విషయాలు మాట్లాడవద్దని మార్గనిర్దేశం చేశారు. అనవసరపు కాంట్రవర్సీలు వద్దని సూచించారు. మీరే ప్రతిపక్షంలాగా ఇరుక్కోవద్దని అన్నారు. అసెంబ్లీకి సభ్యులు అందరూ తప్పనిసరిగా హాజరు కావాలని.. సభకు వచ్చి అటెండెన్స్ వేసుకొని వెళ్తామంటే కుదరదని హెచ్చరించారు. మూడుసార్లు అటెండెన్స్ తీసుకుంటాం.. అటెండెన్స్‌ను ఖచ్చితంగా మూడుసార్లు తీసుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం అటెండెన్స్ ఉంటుందని సూచించారు. నియోజకవర్గాల్లోని ప్రజా సమస్యలపై ఎమ్మెల్యేలు కూడా ప్రిపేర్ కావాలని దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్ నేతల నెగిటివ్ మాత్రమే కాదని.. మనం చేస్తున్న పాజిటివ్‌ను కూడా ప్రజలకు చెప్పాలని సూచించారు. బీఆర్ఎస్ చేయలేదు కాబట్టే.. మనకు ప్రజలు అధికారం ఇచ్చారని... ఎంతసేపు వాళ్ల నెగిటివ్ చెప్పడం కాదని అన్నారు. ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలు తమ ప్రభుత్వంపై కసి మీద ఉన్నారని... మున్సిపల్ ఎన్నికల్లో, స్థానిక సంస్థల ఎన్నికలు, ఉప ఎన్నికల్లో ఓడిపోయారని.. మనం సీరియస్‌గా ఉండాలని మార్గనిర్దేశం చేశారు. అసెంబ్లీ కమిటీలను ఫుల్‌ఫిల్ చేయాలని.. ఎమ్మెల్యేలు స్టడీ టూర్‌కు వెళ్లాలని ఆదేశించారు.

**మూడోసారి బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నాం..**

ప్రజా ప్రభుత్వంలో మూడోసారి బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రభుత్వ ప్రాధాన్యం, భవిష్యత్ ప్రణాళికలకు సంబంధించి గవర్నర్ శివప్రతాప్ తన ప్రసంగంలో వివరించారని తెలిపారు. గవర్నర్ ప్రసంగం రాష్ట్ర ప్రభుత్వానికి రోడ్ మ్యాప్ లాంటిదని చెప్పుకొచ్చారు. కేసీఆర్ ప్రభుత్వ వైఫల్యాలపై చర్చించాల్సిన సమయం అయిపోయిందని అన్నారు. ఈరోజు(సోమవారం) సీఎల్పీ సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరై, మాట్లాడారు. ప్రభుత్వ భవిష్యత్ ప్రణాళికలు, ప్రజలకు ఏం చేయబోతున్నామనే విషయంపై దృష్టి సారించాలని సూచించారు. సభలో మాట్లాడే అంశాలపై ప్రభుత్వ విప్‌ల మధ్య సమన్వయం ఉండాలని ఆదేశించారు. సభలో చర్చ పక్కదారి పట్టకుండా, సభా సమయం వృథా కాకుండా సమర్థవంతంగా నడిపేలా చూడాలని దిశానిర్దేశం చేశారు.

**రాజకీయాల్లో వ్యక్తిగత డ్యామేజీ ఉండదు..**

ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర రాష్ట్రాల్లో పర్యటించి పలు సమస్యలు, ఆయా ప్రభుత్వ విధానాలను అధ్యయనం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. రాజకీయాల్లో వ్యక్తిగత డ్యామేజీ ఉండదని.. ఆది వ్యవస్థ మొత్తాన్ని డ్యామేజ్ చేస్తోందని అన్నారు. వ్యవస్థను నిలబెట్టుకుంటేనే రాజకీయాల్లో మనుగడ ఉంటుందని స్పష్టం చేశారు. పార్టీ, ప్రభుత్వ పరమైన లైన్‌లోనే అందరూ స్పందించాలని సూచించారు.



అఖిలభారత పోలీస్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ వివరాలను వెల్లడిస్తున్న డిజిపి శివధర్‌రెడ్డి. చిత్రంలో పోలీసు అకాడమి డైరక్టర్ అబిలాష్ బిస్త్. శాంతిభద్రతల అదనపు డిజి మహేష్ భగవత్ తదితరులు

## 25 నుంచి అఖిల భారత పోలీస్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్

### టోర్నమెంట్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

### డిజిపి శివధర్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి 16, ప్రభాతవార్త:** హైదరాబాద్ నగరంలో మరో జాతీయస్థాయి క్రీడా సంబరం జరగనుంది. ఈ నెల 25వ తేదీ నుంచి వచ్చే నెల ఐదవ తేదీ వరకు 74వ బిఎన్ మల్లిక్ అఖిల భారత పోలీసు ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డిజిపి శివ ధర్ రెడ్డి తెలిపారు. ఈ టోర్నమెంట్ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై ఆయన సోమవారం నాడు డిజిపి కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌కు తెలంగాణ పోలీసు శాఖ ఆతిథ్యం ఇస్తుందని తెలిపారు. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల పోలీసు జట్లతో పాటు పారా మిలటరీ జట్లు పాల్గొంటున్నాయని ఆయన తెలిపారు.

పురుషుల విభాగంలో 37 జట్లు, మహిళల వి భాగంలో తొమ్మిది జట్లు పాల్గొంటున్నాయని ఆయన వెల్లడించారు. మొదటి మ్యాచ్ గచ్చిబౌలిలోని బాలయోగి స్టేడియంలో జరిగే తొలి మ్యాచ్‌లో తెలంగాణ పోలీసు జట్టు పాల్గొనునుందని ఆయన తెలిపారు. మ్యాచ్‌ల కోసం బాలయోగి స్టేడియంతో పాటు మొయినాబాద్‌లోని శ్రీనిధి ఫుట్‌బాల్ క్లబ్ గ్రౌండ్, శివరాంపల్లిలోని జాతీయ పోలీసు అకాడమిలో గల మైదానం, గోల్కొండ ఆర్టిలరీ సెంటర్ మైదానం, తెలంగాణ పోలీసు అకాడమి ఫు ట్‌బాల్ మైదానం, అజీజ్‌నగర్‌లోని హెచ్‌ఎఫ్‌సి గ్రౌండ్‌లను సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. ఇందులో బాలయోగి స్టేడియం, అజీజ్‌నగర్‌లోని హె చ్‌ఎఫ్ సి గ్రౌండ్‌లలో ఫ్లడ్ లైట్ల సౌకర్యం వుండడంతో రాత్రి వేళలో మ్యాచ్‌లను నిర్వహించనున్నట్లు డిజిపి తెలిపారు. మార్చి 24వ తేదీన అన్ని జ ట్ల మేనేజర్లతో సమావేశం నిర్వహిస్తున్నామని, ఈ సమయంలోనే డ్రా ఆఫ్ లాట్స్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. 25వ తేదీన మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభ వేడుకలతో పాటు మొదటి మ్యాచ్ వుంటుందని ఆయన తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో ఎక్కడా లోటుపాట్లు లేకుండా వుండేందుకు ఒక ఐపిఎస్ అధికారి నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేశామని, ఇందులో 13 మంది డిఎస్‌పిలతో పాటు 23 మంది ఇన్‌స్పెక్టర్లు 35 మంది టీం మేనేజర్లు వుంటాయని డిజిపి తెలిపారు. మ్యాచ్‌ల కోసం లోగోలను ఖరారు చేసినట్లు డిజిపి తెలిపారు. ఏప్రిల్ ఐదవ తేదీన ముగింపు వేడుకలు వుంటాయని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో అకాడమి డైరక్టర్ అబిలాష్ బిస్త్, శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్, గ్రే హౌండ్స్ అదనపు డిజి అనిల్ కుమార్, టిఎస్‌ఎస్‌పి అదనపు డిజి సంజయ్ కుమార్ జైన్, సైబరాబాద్ కొత్వాల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# రోహిత్‌రెడ్డి చుట్టూ బిగుస్తున్న ఉచ్చు

### మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ పార్టీ వ్యవహారం..

### రోహిత్‌రెడ్డి ఆదేశాల మేరకు నమిత్‌శర్మ తమపై కాల్పులు జరిపినట్లు రిమాండ్ రిపోర్టులో పోలీసుల వెల్లడి

### అడ్మిషన్ బ్యారక్‌లో మాజీ ఎమ్మెల్యే సహా ఇద్దరు నిందితులు

**హైదరాబాద్, మార్చి 16, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన మొయినాబాద్‌లోని బిఆర్‌ఎస్ మాజీ ఎంఎల్‌ఎ పైలట్ రోహిత్ రెడ్డి ఫాం హౌస్ డ్రగ్స్ పార్టీ కేసుకు సంబంధించి రిమాండు రిపోర్టులో సంచలన విషయాలు వెలుగు చూశాయి. ఈ కేసులో రోహిత్ రెడ్డి ఆదేశాల మేరకు ఢిల్లీకి చెందిన రియల్టర్ నమిత్ శర్మ తమను భయపెట్టేందుకు నాలుగు రౌండ్లు కాల్పులు జరిపాడని పోలీసులు రిమాండు రిపోర్టులో తెలిపారు. మ రోవైపు ఈ కేసులో ఆదివారం రాత్రి రిమాండుకు తరలించిన రోహిత్ రెడ్డి, రితేష్ రెడ్డి, నమిత్ శర్మలను డ్రగ్స్ పార్టీకి సంబంధించి మరిన్ని విషయాలు రాబట్టేందుకు కస్టడీ కోసం కోరాలని పోలీసులు నిర్ణయించారు. కాగా ఆదివారం రాత్రి చంచల్‌గూడ జైలుకు రిమాండు ఖైదీగా తరలించిన రోహిత్ రెడ్డి అతని సోదరుడు రితేష్ రెడ్డి, నమిత్ శర్మలను అడ్మిషన్ బ్యారక్‌లో వుంచారు. రిమాండులో వున్న ఇతర ఖైదీలకు ఇచ్చిన సౌకర్యాలనే వీరికి సమకూర్చామని జైలు అధికారులు తెలిపారు. మొయినాబాద్‌లోని పైలట్ రోహిత్ రెడ్డి ఫాం హౌస్‌లో డ్రగ్స్ పార్టీ వ్యవహారంపై పోలీసుల విచారణ వేగం పుంజుకుంది. ఈ పార్టీలో 11 మంది పాల్గొన్నట్లు తేలగా ఇందులో ఆరుగురు డ్రగ్స్ సేవించినట్లు నిర్ధారణ అవడం తెలిసిందే. డ్రగ్స్ సేవించిన వారిలో రోహిత్ రెడ్డితో పాటు ఆయన సోదరుడు రితేష్ రెడ్డి, ఏలూరు ఎంపి పుట్టా మహేష్ యాదవ్, నమిత్ శర్మ, కౌషిక్ రవి, అర్జున్ రెడ్డిలు వున్నారు. వీరిలో ఎంపి మహేష్ యాదవ్, అర్జున్ రెడ్డి, కౌషిక్ రవిలకు స్టేషన్ బెయిల్ మంజూరు చేయగా రోహిత్ రెడ్డి, రితేష్ రెడ్డి, నమిత్ శర్మలను రివాల్వర్‌తో కాల్పులు జరపడం, ఫాం హౌస్‌లో అసాంఘీక చర్యలకు పాల్పడడం వంటి కారణాలతో ఆదివారం అర్థరాత్రి సమయంలో రిమాండుకు తరలించారు.

కాగా ఈ ఘటనపై మొయినాబాద్ పోలీసులు సోమవారం నాడు ఉప్పర్‌పల్లి కోర్టుకు రిమాండు రిపోర్టు అందించారు. రోహిత్ రెడ్డి ఫాం హౌస్‌లో జరిగిన పార్టీలో ప్ర ముఖులు పాల్గొంటున్నట్లు, ఇందులో కొందరు డ్రగ్స్ తీసుకుంటున్నట్లు అందిన సమాచారం మేరకు ఈగల్ పోలీసులతో కలిసి దాడులు చేసినట్లు రిమాండు రిపోర్టులో తెలిపారు. పోలీసులు ఫాం హౌస్‌లో వెళ్లిన సమయంలో పార్టీ జరుగుతున్న స్విమ్మింగ్ పూల్ వద్ద ఒక వ్యక్తి తమను బెదిరి స్తూ గాలిలో వరుసగా నాలుగు రౌండ్లు కాల్పులు జరిపాడని, మరో వ్యక్తి ఏం జరిగినా నేను చూసుకుంటా కాల్పులు ఆపవద్దని అరిచాడని పోలీసులు తెలిపారు. కాల్పులను ఎదుర్కొంటూనే తాము ఫాం హౌస్‌లో వున్న వారిని లౌడ్ స్పీకర్లలో హెచ్చరించి బలవంతంగా వెళ్లామని, ఈ సమయం లో చేతిలో రివాల్వర్‌తో నమిత్ శర్మ వుండగా అతన్ని బలవంతంగా అదుపులోకి తీసుకున్నామని, అతన్ని విచారిస్తే రోహిత్ రెడ్డి ఆదేశాల మేరకే తాను తమను భయభ్రాంతులకు గురిచేసేందుకు కాల్పులు జరిపినట్లు చెప్పాడని పోలీసులు రిమాండు రిపోర్టులో తెలిపారు. పోలీసులపై కాల్పులు జరిపిన నేరంపై నమిత్ శర్మను, కాల్పులకు ఆదేశించినందుకు రోహిత్ రెడ్డిని, రివాల్వర్ యజమాని రితేష్ రెడ్డిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యల కోసం రిమాండుకు తరలించామని పోలీసులు తెలిపారు. దాడి సమయంలో అక్కడ వున్న 11 మందిని విచారించగా తాము ఎవరు కూడా డ్రగ్స్ తీసుకోలేదని చెప్పారని, పలుమార్లు ప్రశ్నించిన తరువాత సిల్వేరి శరత్‌కుమార్ ఆరుగురు డ్రగ్స్ సేవించినట్లు అంగీకరించాడని పోలీసులు రిమాండు రిపోర్టులో తెలిపారు. నమిత్ శర్మ కొకైన్‌తో పాటు మరో రెండు రకాల డ్రగ్‌ను వాడినట్లు తేలిందని పోలీసులు కోర్టుకు తెలిపారు. ఈ కేసులో మరిన్ని విషయాలను రాబట్టేందుకు రిమాండుకు తరలించిన రోహిత్ రెడ్డి, రితేష్‌రెడ్డి, నమిత్‌శర్మలను కస్టడీ కోసం కోరాలని పోలీసులు నిర్ణయించారు. కాగా చంచల్‌గూడ జైలులో రిమాండులో వున్న రోహిత్ రెడ్డి సహా మిగతా నిందితులను అడ్మిషన్ బ్యారక్‌లో ఉంచామని జైలు అధికారులు వెల్లడించారు.

# మాజీ సర్పంచ్‌ల అసెంబ్లీ ముట్టడి యత్నం భగ్నం

### ముందస్తు అరెస్టులు చేసిన పోలీసులు




**హైదరాబాద్, మార్చి 16, ప్రభాతవార్త:** పెండింగ్ బిల్లులు చెల్లించాలన్న డిమాండ్‌తో మాజీ సర్పంచ్‌లు అసెంబ్లీ ముట్టడికి యత్నించారు. అయితే అప్రమత్తమైన పోలీసులు అసెంబ్లీ పరిసరాలకు దూరంగానే అడ్డుకుని అరెస్టు చేశారు. మానవహక్కుల కమిషనర్ కార్యాలయ సమీపంలోనే తెలంఆణ సర్పంచ్‌ల సంఘం జెఎసి నేతలు సుర్వి యాదయ్యగౌడ్ తదితరులను అడ్డుకుని అరెస్టు చేసి ఆబిడ్స్ పిఎస్‌కు తరలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాజీ సర్పంచులకు పెండింగ్ బిల్లులను చెల్లించడం లేదని మండిపడ్డఆరు. కేంద్ర ప్రభుత్వం నుంచి 15 ఆర్థిక సంఘం నిధులు వచ్చినా పెండింగ్ చెల్లించడం లేదని విమర్శఇంచారు. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా సిఎం రేవంత్‌రెడ్డి, పంచాయతీరాజ్ మంత్రి సీతక్క చొరవ తీసుకుని మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున వివిధ రూపాల్లో నిరసనలు తెలుపుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్, ఉపాధ్యక్షుడు గుంటి మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య, కార్యదర్శి కేశబోయిన మల్లయ్య, రాష్ట్ర నాయకులు మోడెం విద్యాసాగర్, బొడ్డు నరసింహ యాదవ్, మంగ నరసింహులు, రజిత సుధాకర్, అనసూయ మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైలు కార్యకలాపాల నిర్వహణలో భద్రతకు అత్యధిక ప్రాధాన్యత

### దక్షిణ మధ్య రైల్వే జిఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ



సమావేశంలో అధికారులకు సూచనలిస్తున్న జిఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ

**హైదరాబాద్ (తార్నాక), మార్చి 16, ప్రభాతవార్త :** రైలు కార్యకలాపాల నిర్వ హణలో భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. సోమవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో ఆయన అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్, ప్రధాన విభాగాధిపతులతో కలిసి జోన్ వ్యాప్తంగా రైలు కార్యకలాపాల భద్రతపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్లకు చెందిన డివిజనల్ రైల్వే మేనేజర్లు (డీఆర్‌ఎంలు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంజయ్ కుమార్ శ్రీవాస్తవ మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా రైలు భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. ట్రాక్ పటిష్టతపై ప్రత్యేక దృష్టి సారించాలని, వేసవి ఉష్ణోగ్రతల ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ట్రాక్‌లపై అవసరానికి అనుగుణంగా బ్యాలస్ట్ వినియోగాన్ని పెంచాలని డివిజనల్ రైల్వే మేనేజర్లను ఆదేశించారు. అదే విధంగా రైళ్లలో మండే స్వభావం గల వస్తువులను అనధికారికంగా తీసుకెళ్లకుండా తనిఖీలను ముమ్మరం చేయాలని సూచించారు. స్టేబ్లింగ్ యార్డులు, గూడ్స్ షెడ్ల వద్ద అదనపు సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసి నిఘాను బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు. రైళ్ల రాక పోకల్లో భద్రతను మెరుగు పరచడానికి జోన్‌లో జరుగుతున్న రైల్వే అండర్ బ్రిడ్జ్ (ఆర్‌యూబీ) పనులను వేగవంతం చేయాలని సూచించారు. అలాగే మలుపులు మరియు బహుళ ట్రాక్ ప్రాంతాల్లో సిగ్నల్స్ స్పష్టంగా కనిపించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆర్‌యూబీ ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడం వంటి సమస్యలను ప్రాధాన్యతగా పరిష్కరించాలని డీఆర్‌ఎంలకు ఆదేశించారు. శాస్త్రీయ పద్ధతులు మరియు నీటి పంపింగ్ యంత్రాంగాలను వినియోగించి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. రైలు కార్యకలాపాల భద్రత విషయంలో అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన స్పష్టం చేశారు.

# ఉగాది, రంజాన్ పండుగలకు స్పెషల్ బస్సులు

### ప్రయాణికుల సౌకర్యం కోసం అదనపు సర్వీసులు: టిజిఎస్ఆర్‌టిసి

**హైదరాబాద్, మార్చి 16, ప్రభాతవార్త:** రానున్న ఉగాది, రంజాన్ పండుగలకు ఊర్లకు వెళ్లాలను కునే ప్రయాణికుల ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్టు టిజిఎస్ఆర్‌టిసి ప్రకటించిందఇ. ఉగాది, రంజాన్ పండుగల నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లే వారిని క్షేమంగా గమ్య స్థానాలకు చేరవేసేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ పూర్తి స్థాయిలో సన్నద్ధమైంది. ఈ పండుగ సెలవులకు ప్రత్యేక బస్సులను నడ పాలని యాజమాన్యం నిర్ణయించింది. ఈ నెల 17, 18 తేదీల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుందని భావించిన ఆర్‌టిసి. ఆయా రోజుల్లో రద్దీ మేరకు ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లు చేసింది. అలాగే ఈ నెల 23వ తేదీ తిరుగు ప్రయాణ రద్దీకి సంబంధించి తగిన ఏర్పాట్లు చేసింది. పండుగులు, ప్రత్యేక సందర్భాల్లో ప్రజలకు రవాణా పరంగా ఇబ్బందులు తలెత్తకుండా వారిని క్షేమంగా గమ్య స్థానాలకు చేరవేసేందుకు స్పెషల్ సర్వీసులను ఆర్‌టిసి యాజమాన్యం నడుపుతున్న సంగతి తెలిసిందే. తిరుగు ప్రయాణంలో స్పెషల్ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ ఏమాత్రం లేనప్పటికీ రద్దీ ఉన్న రూట్లలో ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఖాళీ బస్సులను త్వరతగతిన సంస్థ వెనక్కి తెప్పిస్తుంది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా వాటిని ఆయా రూట్లలో నడిపిస్తుంది. ఆ స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చులు, నిర్వహణ మేరకు టికెట్ ధరను సవరించుకోవాలని 2003లో జీవో నంబర్ 16ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో నడిచే స్పెషల్ బస్సుల్లో మాత్రమే 1.5 శాతం వరకు టికెట్ ధరలను సవరించుకునే వెసులుబాటును సంస్థకు ఇచ్చింది. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు తిరిగే స్పెషల్ బస్సులకు మాత్రమే సవరించిన చార్జీలు వర్తిస్తాయని సంస్థ ప్రకటించింది. స్పెషల్ బస్సుల్లో ఈ నెల 17, 18 తేదీలతో పాటు తిరుగు ప్రయాణ రద్దీ ఎక్కువగా ఉండే 23 తేదీలో మాత్రమే సవరించిన చార్జీలు అమల్లో ఉంటాయని ఆర్‌టిసి స్పష్టం చేసింది. స్పెషల్ బస్సులు మినహా రెగ్యులర్ బస్సుల్లో సాధారణ చార్జీలే అమల్లో ఉంటాయని ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వ మహాలక్ష్మి పథకంలో భాగంగా ఉగాది, రంజాన్ పండుగ రోజుల్లో నడిపే పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్, సిటీ ఆర్డినరి, మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు రవాణా సదుపాయం రాష్ట్రంలో యథావిధిగా అమల్లో ఉంటుందని తెలిపింది. ఆర్‌టిసి బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్‌ను ఆర్‌టిసి అధికారిక వెబ్ సైట్‌లో బుక్ చేసుకోవాలని యాజమాన్యం తెలిపింది. ఉగాది, రంజాన్ పండుగల ప్రత్యేక బస్సులకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం ఆర్‌టిసి కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033 లలో సంప్రదించాలని సంస్థ సూచించింది.

## బాలికను గొంతు నులిమి హతమార్చాడు

### చాక్లెట్ ఆశ చూపి వెంట తీసుకెళ్లిన నిందితుడు

**హైదరాబాద్ (నార్సింగి), మార్చి 16, ప్రభాతవార్త :** తోటి పిల్లలతో ఆడు కుంటున్న నాలుగేళ్ల చిన్నారికి చాక్లెట్ ఆశ చూపించి తనగదికి తీసుకెళ్లిన కామాంధుడు అత్యాచారం చేసి, గొంతు నులిమి దారుణంగా హతమార్చాడు.



నాలుగేళ్ల బాలికను హత్య చేసిన కామాంధుడు ఇతడే

హృదయ విదారకరమైన ఈ దుర్ఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. నార్సింగి ఏసీపీ రమణాగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... పశ్చిమ బెంగాల్ రాష్ట్రం నుంచి బతుకుదెరువు కోసం వచ్చి పుప్పాల గూడలోని ఓ లేబర్ క్యాంపులో ఉంటూ దిన సరి కూలీలుగా పని చేసు కుంటున్నారు. తల్లిదండ్రులు ఇద్దరూ పనికి వెళ్లగా పాప తోటి పిల్లలతో కలిసి గుడిసె వద్ద ఆడుకుంటూ ఉంటుంది. ఆదివారం సైతం ఉదయం గుడిసె వద్ద పాపను వదిలిపెట్టి తల్లిదండ్రులు ఇద్దరూ పనిలోకి వెళ్లారు. పాప తల్లిదండ్రులు ఇంట్లో లేరని తెలుసుకున్న కామాంధుడు బిశ్వఒరా(25) చాక్లెట్ ఇప్పిస్తానని ఆ పాపను తనతో పాటు గుడిసెలోకి తీసుకెళ్లాడు. అత్యాచారం చేసిన తరువాత పాపను గొంతు నులిమి దారుణంగా హతమార్చాడు. పాప మృతదేహాంను కిలోమీటరు దూరం లోని డంపింగ్‌యార్డులో మూసిపెట్టి వచ్చాడు. మధ్యాహ్నం 2.గంటల ప్రాంతంలో పాప తల్లిదండ్రులు వచ్చి ఎంత వెతికినా ఆచూకి లభించలేదు. మృతురాలితో పాటు ఆడుకుంటున్న మరో పాప కామాం ధుడు ఉంటున్న ఇంటిని చూపించి, ఇందులోకి తీసుకెళ్లాడని తెలిపింది. పాప తల్లిదండ్రులు ఆ కామాంధుడిని ఎంత బతిమాలినా నాకు తెలియ దంటూ దబాయించాడు. దీంతో చేసేది లేక వారు నార్సింగి పోలీసులకు రాత్రి పదిన్నర గంటలకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి ఆ కామాంధుడిని అడిగినా తనకు తెలియదంటూ బుకాయించాడు. పోలీసులు సీసీ పుటేజీని పరిశీలించగా, ఈ కామాంధుడే ఆ పాపను తీసుకెళ్లినట్లు బయటపడింది. దీంతో స్టేషన్‌కు తీసుకెళ్లి తమదైన శైలిలో విచారిస్తే నేరాన్ని అంగీకరించాడు. అత్యాచారం చేసి, హతమార్చినట్లు పోలీసులకు వివరించాడు. బాలిక మృతదేహాన్ని పోలీసులకు చూపించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి, కామాంధుడిని రిమాండ్ చేసి, కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ రమణాగౌడ్ తెలిపారు. 9 గంటలలోనే కామాంధుడిని పట్టుకొని, 24 గంటల్లోనే రిమాండ్‌కు తరలించామని ఎసిపి వివరించారు.

## జూన్ నెల దర్శన కోటా రేపు ఆన్‌లైన్‌లో విడుదల

**తిరుమల,మార్చి 16ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవారి ఆర్జితసేవల దర్శనాల ఆన్‌లైన్ కోటా 18వతేదీ బుధవారం ఉదయం టిటిడి విడుదల చేయనుంది. ఇందుకు అన్ని ఏర్పాట్లు చేసింది. రానున్న జూన్ నెలకు సంబంధించి వివిధ దర్శనాల, గదుల కోటా వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరచనుంది. శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవ కు సంబంధించిన జూన్ నెల కోటాను రేపు ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.. ఈ సేవా టికెట్లు ఎలక్ట్రానిక్ డిప్ కోసం మార్చి 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ టికెట్లు పొందిన భక్తులు మార్చి 20 నుండి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించిన వారికి టికెట్లు మంజూరవు తాయి. ఇక ఆర్జిత సేవా టికెట్ల విడుదల కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ, జ్యేష్ఠాభిషేకం టికెట్లను 21న ఉదయం 10 గంటలకు టిటిడి ఆన్ లైన్ లో విడుదల చేయనుంది. వర్చువల్ సేవల కోటా విడుదల వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను 21న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. అంగ ప్రదక్షిణ టోకెన్ల కోటాను 23న ఉదయం 10 గంటలకు విడుదల చేయనుంది.శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్ల కోటాను 23న ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నారు. వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను 23న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. 24న ఉదయం 10 గంటలకుప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటా (300రూపాయలవి)విడుదల చేయనుంది. తిరుమల, తిరుపతిలలో గదుల కోటాను 24న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు.భక్తులు "టిటిదేవస్థానమ్స్. ఎపి.జిఒవి.ఇన్" వెబ్‌సైట్ ద్వారానే ఆర్జితసేవలు, దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని టిటిడి విజ్ఞప్తి చేసింది.

## ఈ జన్మలో ఇదో గొప్పమహాద్భాగ్యం

### తిరుమలేశునికి పరదాలు వితరణ చేస్తున్న శంకర్



**తిరుమల,మార్చి 16ప్రభాతవార్తప్రతి నిధి:** సాక్షాత్తు కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి తనకు ఇచ్చిన అపూర్వ అవకాశం. మహాద్భాగ్యం స్వామివారికి పరదాలు వితరణ చేయడమని దాత శంకర్ విశ్వాసం వ్యక్తం చేశారు. తిరుపతికి చెందిన శంకర్ టైలర్.స్వయంగా ఆయనే స్వామివారికి పరదాలు కుట్టి సిద్ధం చేస్తారు. ప్రతి ఏటా ఆలయంలో నాలుగు సార్లు జరిగే కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం తరువాత ఈ పరదాలను అందజేస్తారు. ఈ పరదాలను ఆనంద నిలయంలోని బంగారువాకిలిలో, కులశేఖరపడి ద్వారంకు, రాములవారిమేడకు, శయనమండపం ఇలా పరదాలు ఆధ్యాత్మిక భావంతో కూడుకున్నట్లు తయారుచేస్తాడు. ఆలయంలో నాలుగుసార్లు జరిగే కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం రోజు వాటిని తిరుమల ఆలయ అధికారులకు అందజేస్తాడు. గత 28సంవత్సరాలుగా ఆ దేవదేవుడు తనకు ఇచ్చిన ఒక గొప్ప అవకాశంగా భావిస్తున్నాడు. నేడు జరిగే కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం సందర్భంగా సోమవారం తిరుమలకు తీసుకువచ్చాడు.

### డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసు..

## సిట్ విచారణకు హాజరైన అనంతబాబు భార్య

**విజయవాడ మార్చి 16 ప్రభాతవార్త ప్రతినిధి:** డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబు భార్య లక్ష్మీదుర్గ సిట్ విచారణకు హాజరయ్యారు. ఈ కేసు విచారణాధికారిగా వ్యవహరిస్తున్న ఎస్‌డీపీవో మనీశ్ పాటిల్ దేవరాజ్ కార్యాలయంలో ఆమెను విచారిస్తున్నారు. తమ దగ్గర డ్రైవర్‌గా పనిచేసి, మానేసిన సుబ్రహ్మణ్యాన్ని చంపి డోర్ డెలివరీ చేసిన కేసులో అనంతబాబుతో పాటు లక్ష్మీదుర్గ పాత్ర కూడా ఉన్నట్లు పోలీసులు ఇటీవలి విచారణలో గుర్తించారు. ఆమెను ఏ2గా చేర్చి రాజమహేంద్రవరం ఎస్సీ, ఎస్టీ కోర్టులో అనుబంధ ఛార్జిషీట్ వేశారు. కోర్టు ఆమెపై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీచేసింది. దీనిని కొట్టేయాలని లక్ష్మీదుర్గ హైకోర్టును ఆశ్రయించగా ఈ నెల 16 నుంచి 30 వరకు సిట్ ఎదుట, 30న రాజమహేంద్రవరం కోర్టులో విచారణకు హాజరవ్వాలని తీర్పునిచ్చింది. దీంతో ఇన్నాళ్లూ అజ్ఞాతంలో ఉన్న ఎమ్మెల్సీ భార్య సోమవారం ప్రత్యేక దర్యాప్తు బృందం ముందుకు వచ్చారు. 2022 మే 19న రాత్రి సుబ్రహ్మణ్యం హత్య జరిగిన సమయంలో లక్ష్మీదుర్గ అక్కడే ఉన్నట్లు, తర్వాత భర్తతో కలిసి కారులో తమ నివాసానికి వచ్చినట్లు సీసీటీవీ ఫుటేజీల్లో నిక్షిప్తమైంది. ఫోరెన్సిక్ నివేదికల్లోనూ ఆమె పాత్రను స్పష్టంగా పేర్కొన్నారు. హత్య జరిగిన రోజున తాను లేనని ఆసుపత్రిలో బంధువుల పరామర్శకు వెళ్లాలని గతంలో పోలీసులకు ఆమె వాంగ్మూలమిచ్చారు.అవన్నీ అబద్ధాలేనని సాంకేతిక ఆధారాలతో తేల్చారు. వీటిపైనే తొలిరోజు విచారణ కొనసాగే అవకాశముంది.

# ఆరు గంటల్లోనే కానిస్టేబుల్ హత్య కేసు నిందితుల అరెస్ట్



కానిస్టేబుల్ హత్య కేసు నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఉప్పల్ జోన్ డిసిపి కె.సురేష్‌కుమార్ తదితరులు

### స్నేహితుడే సూత్రధారి : క్షణికావేశంలో దారుణహత్య

**హైదరాబాద్ (ఉప్పల్), మార్చి 16, ప్రభాతవార్త :** ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చిలుకానగర్‌లో ఆదివారం రాత్రి దారుణ హత్యకు గురైన ఎఆర్ కానిస్టేబుల్ హత్య కేసు మిస్టరీని మల్కాజిగిరి కమిషనరేట్ పోలీసులు ఆరు గంటల్లోనే చేధించారు. ఫోన్‌కాల్‌ను స్వీకరించ లేదనే కారణంతో ఇద్దరి మధ్య మొదలైన గొడవ హత్యకు దారి తీసిందని పోలీసులు పేర్కొన్నారు. ఉప్పల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివ రాలను ఉప్పల్ జోన్ డిసిపి కె.సురేష్ కుమార్ వెల్లడించారు. చెంగిచెర్ల ఆర్‌టిసి కాలనీకి చెందిన పరువుల సుధీర్‌కుమార్ (30), చిలుకానగర్‌కు చెం దిన బానోతు సంతోష్ నాయక్ అలియాస్ సంతు (28), పొడిశెట్టి తరుణ్ (22) స్నేహితులు. సుధీర్ కుమార్ సిటీ కమిషనరేట్ వింగ్‌లో ఎఆర్ కాని స్టేబుల్‌గా పని చేస్తున్నా డు. సంతోష్ నాయక్ రాపిడో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అయితే కొద్దిరోజుల క్రితం సంతోష్ కుమార్ బావ ఇంటి గృహప్రవేశానికి సుధీర్ కుమార్‌ను ఆహ్వానించారు. అతను ఫోన్‌కాల్ స్వీకరిం చలేదు. దీంతో తిరిగి కాల్ చేయగా సుధీర్ కూడా స్వీకరించలేదు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వివాదం జరిగి ఫోన్ లోనే పరస్ప రం దూషించుకుంటూ చాటింగ్ చేసుకున్నారు. దాన్ని మనసులో పెట్టు కుని ఆదివారం నింది తుడు సంతోష్‌నాయక్ తన స్నేహితుడు పొడిశెట్టి తరుణ్‌తో కలిసి, సుధీర్‌కుమార్‌ను చిలుకానగర్ మైదానానికి రమ్మని పిలిచారు. సుధీర్‌కుమార్ తన స్నేహితుడు ఇమ్రాన్‌ఖాన్‌తో కలిసి, ఇమ్రాన్ మోటార్‌సైకిల్‌పై ఆ ప్రదేశానికి వెళ్లారు. తనను ఎందుకు దూషిస్తున్నావని సుధీర్.. సంతోష్‌ను ప్రశ్నించగా, అతను కత్తిని బయటకు తీసి సుధీర్‌కుమార్‌ను పొడిచాడు. దాంతో సుధీర్ ఆ ప్రదేశం నుండి తప్పించు కోవడానికి ప్రయత్నిస్తుండగా అతన్ని వెంబడించి, కత్తితో దాడిచేసి పలుమార్లు పొడవగా సుధీర్ కుమార్ ఘటనా స్థలంలోనే మరణించారు. అనంతరం నింది తులు అక్కడి నుండి పారిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. నాగారంలో బంధువుల ఇంటిలో ఉన్న సంతోష్‌ను, అతని స్నేహితుడిని తెల్లవారుజామున 4 గంటలకు అదుపులోకి తీసుకున్నట్లు డిసిపి తెలిపారు. కేసు మిస్టరీ చేధిం చిన ఎస్‌ఒటి సిఐ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్ఐ మాధవరెడ్డి, చిరం జీవి, మల్లేష్‌కు డిసిపి రివార్డులు అందజేశారు. నిందితుడు సంతోష్‌నాయక్, తరుణ్‌ను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలిం చారు.

తెలంగాణ ప్రభుత్వం
మునిసిపల్ కౌన్సిల్ కార్యాలయం :: నాగర్‌కర్నూలు
నాగర్‌కర్నూలు జిల్లా
టెండర్ ప్రకటన నం: E2/67/2025-26, ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన తేదీ: 16.03.2026
నాగర్‌కర్నూలు మునిసిపాలిటీలో 2025-26 సంక్షేమ మరియు అభివృద్ధి కార్యకలాపాల కొరకు సాధారణ నిధుల ద్వారా (1) పని కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంపై పనికి టెండర్ పిలవబడుతోంది. అంచనా విలువ: రూ.5,00,000/- పని పేరు: నాగర్ కర్నూలు మునిసిపాలిటీలో సాధారణ నిధుల ద్వారా ఈద్గా వద్ద రంజాన్ పండుగ 2026 కొరకు ఏర్పాట్లు. బిడ్ దాఖలు ప్రారంభ తేదీ మరియు సమయం: 16.03.2026 మ.12.30 గం. వద్ద. బిడ్ దాఖలు ముగింపు తేదీ మరియు సమయం: 18.03.2026 మ.03.00 గం. వద్ద. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ www..eprocurement.gov.in వద్ద చూడవచ్చును. బిడ్స్ ఆహ్వానించు అధికారి, కమిషనర్, నాగర్ కర్నూలు మునిసిపాలిటీ, నాగర్ కర్నూలు జిల్లా, తెలంగాణ రాష్ట్రం. సెల్ నం.9100972045, 7330690590.
సం/- కమిషనర్, నాగర్ కర్నూలు మునిసిపాలిటీ
DIPR.No.17064 -PP/CL/Advt/1/2025-26, తేది: 16.03.2026

వార్త

మనిషికి నిలబడటం తేలిక. పరుగెత్తడం కష్టం. కాని మనస్సుకి నిలబడటం కష్టం, పరుగెత్తడం తేలిక.

-ప్లేటో

# విషాద వీచిక!

అనివార్య పరిస్థితుల్లో జరిగే ప్రమాదాలను తప్పించలేం. అజాగ్రత్త, నిర్లక్ష్యం, వలనజరిగే ప్రమాదాలకు బాధ్యులెవరు? అనే ప్రశ్నించే స్థాయిలో జరుగుతున్న ప్రమాదాలను ఏ విధంగానూ సమర్థించలేం. అలాంటి ప్రమాదం ఒరిస్సాలోని కటక్ ఆసుపత్రిలో సోమవారం తెల్లవారుజామున ఇంటెన్సివ్‌కేర్ యూనిట్‌లో జరిగింది. ఉన్నట్టుండి మంటలు చెలరేగడంతో రోగులు ఎటూ లేవలేని పరిస్థితి. వారిని రక్షించలేని పరిస్థితుల్లో సిబ్బంది కాలిన గాయాలతో బయటపడ్డారు. అలా తప్పించుకోలేని వారు కనీసం పంది మంది మృత్యువాత పడ్డారు. రోగులను బయటకు తీసుకెళ్తుండగా కొంత మందికి గాయలయ్యాయి. కటక్‌లోని ఎస్.సి.బి ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రి ట్రామాకేర్ విభాగం ఐసియులో హఠాత్తుగా మంటలు చెలరేగి పొగకమ్ముకొంది. ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు ప్రమాదకారణాలను అన్వేషించడం కన్నా అతి వేగంతో ప్రభుత్వాలు మృతులకు, క్షతగాత్రులకు ఆగమేఘాలమీద నష్టపరిహారాలు ప్రకటించడంతో సమస్యను ఓ కొలిక్కి తీసుకొచ్చినట్లు, బాధిత కుటుంబాలకు ఊరట చేకూరినట్లు భావించడమే చింతించదగిన విషయం. ఐసియులో 23 మంది రోగులు ఒడగా వారిని తరలిస్తుండగా ఏడుగురు రోగులు ప్రాణాలు కోల్పోయారు. ఆ తదుపరి తరలిస్తుండగా ముగ్గురు. ప్రాణాలు కొడిగట్టాయి. ఒడిశాలోనే ఈ ఆసుపత్రి బాగా పెద్దది. ఎస్‌సిబి మెడికల్ కళాశాలకు అనుబంధంగా నిర్వహిస్తోన్న పెద్ద ఆసుపత్రి ఇది. కానీ సరైన జాగ్రత్తలు తీసుకోవడంలో విఫలమైంది. పాతిక మంది బాధితులు చికిత్స పొందుతున్న మొదటి అంతస్తులోనే ఈ అగ్నిప్రమాదం జరిగింది. చనిపోయిన వారందరూ పెద్దలే. పిల్లలెవరూ లేరు. రోగులను సురక్షిత ప్రాంతాలకు తరలించినప్పుడు డాక్టర్లు కానీ నర్సులు కానీ విధి నిర్వహణలో లేరు. రెండు, రోజుల నాడు ఒడిశా మయూర్‌భంజ్ జిల్లాలో వాయవ్య పవనాల సుడిగాలికి ఇద్దరు మృతి చెందగా, ఇళ్లు విధ్వంసమయ్యాయి. ఇలా ప్రకృతి బీభత్సాలకు ఎన్నో చావులు నమోదవడం సహజం. కానీ తాజాగా ఐసియులో జరిగిన అగ్నిప్రమాదం ఆ రోగులకు మృత్యుముహూర్తం పెట్టేసింది. ఎంతో జాగ్రత్తగా నిర్వహించాల్సిన ఆసుపత్రులలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉంటుంది. ఎప్పటికప్పుడు నిపుణులచే నిర్వహించబడే యాజమాన్య వ్యవస్థ ఉండి తీరాలి. రోడ్డుమీద జరిగే బస్సు ప్రమాదాలలో అగ్నికి ఆహుతై చనిపోయేవారి గాథలు తెలుసుకున్నప్పుడు హృదయం ద్రవించిపోతుంది. అంతకన్నా తీవ్ర పరిస్థితులు ఆసుపత్రులలో ప్రమాదాలు జరిగినప్పుడు కన్పిస్తాయి. అన్నీ అగ్ని విషాద వీచికలే. ఉత్తర భారతదేశంలో ఝాన్సీ పట్టణంలో 2024 నవంబరులో నియోనేటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో సంభవించిన ప్రమాదంలో పంది మంది నవజాత శిశువులు అగ్నికి ఆహుతైన సంఘటన ఇప్పటికీ ఎవరూ మర్చిపోలేదు. మొన్నామధ్య విజయవాడలో కోవిడ్ రోగులు చికిత్స పొందుతున్న పేషంట్స్ హాల్‌లో గ్యాస్ లీకయి రోగులు ఎటూ పారిపోలేని పరిస్థితి. రెండో దారిలేదు. వెంటిలేటరు బద్దలు కొట్టి పారిపోవడమే శరణ్యమైంది. ఆ ప్రమాదంలో 11 మంది సజీవ దహనంకాగా మరి కొందరు కిటికిల్లోంచి దూకి ప్రాణం నిలబెట్టుకున్నవారున్నారు. ప్రాణం పోగొట్టు కొన్నవారి సంఖ్య తక్కువేమీ కాదు. ఎక్కడ ఈ విధమైన అగ్ని ప్రమాదాలు జరిగినా వారిని రక్షించడం ఎంతో కష్టతరం. ఝాన్సీ ఆసుపత్రిలో 55 మంది శిశువులున్న వార్డులో పెద్ద అగ్నిప్రమాదం జరిగితే 45 మందిని ఆసుపత్రి సిబ్బంది రక్షించగలిగారు. ప్రత్యేకించి ఇంటెన్సివ్‌కేర్ యూనిట్‌లో జాగ్రత్తల విషయంలో నిర్లక్ష్యవైఖరిని క్షమించజాలము. గడువుముగిసిన అగ్నిమాపక యంత్రాలు, పనిచేయని అగ్నిమాపక ఆలారం వంటి భద్రతా ప్రోటోకాల్ తప్పనిసరిగా అమలు చేయాల్సి ఉంటుంది. అవి లేనప్పుడు మాత్రమే అగ్ని ప్రమాదాలు జరిగి ప్రాణనష్టానికి దారితీయవచ్చు. 2019లో హైదరాబాద్ ఎల్‌బినగర్‌లోని ఒక ప్రయివేటు ఆసుపత్రిలో జరిగిన అగ్నిప్రమాదంలో ఇంక్యుబేటర్‌లోమూడు నెలల పసికందు మృతిచెందింది. మరో నలుగురు గాయపడ్డారు. ఆ ఆసుపత్రి అగ్నిమాపక భద్రతా లైసెన్స్ గడువు ముగిసింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన ప్రమాదం సంభవించింది. అమీర్‌పేటలోని ఒక కోచింగ్ సెంటర్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో 100 మంది విద్యార్థులు చిక్కుకున్నా సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో వారు క్షేమంగా బయటపడ్డారు. ఐసియూలో అగ్నిప్రమాదాల నివారణకు ఎన్నో జాగ్రత్తలు నిర్దేశించబడి ఉన్నా వాటిని పాటించకపోవడం వల్లనే ప్రమాదాలను తప్పించలేని పరిస్థితి ఉంది. అగ్ని నిరోధక పదార్థాలను అందుబాటులో ఉంచడం, రేడియేషన్ కలిగించే పరికరాలు సమీపంలో లేకుండా చూసుకోవడం, ఆక్సిజన్ సిలిండర్లను అందుబాటులో ఉంచుకోవడం ప్రధానం. అందుబాటులో అలారం వ్యవస్థను ఉంచుకోవాలి. అవి ఎక్కడైతే లేవో అక్కడే ప్రమాదం పొంచి ఉంటుంది. పొగవల్ల ఊపిరాడకపోవడం, విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌ల కారణంగా ముంబై బాండవ్‌వెస్ట్‌లోని ఒక మాల్ తొలి అంతస్తులోని ఆసుపత్రిలో 11 మంది మృతిచెందారు. 9 మంది మంటలు కారణంగానే చనిపోయారు. నిర్లక్ష్యం ప్రమాదాలకు ఆస్కామౌతున్న ఆసుపత్రి యాజమాన్యం ఖర్చుకుదడిసి వాటిని పట్టించుకోకపోవడంతో రోగులు మూల్యం చెల్లించుకుంటున్నారు.

ఏ విషయమైనా కొత్తగా ఉన్నప్పుడే బాగుంటుంది. కాని స్నేహం మాత్రం పాతబడిన కొద్దీ బాగుంటుంది.

మోక్షగుండం విశ్వేశ్వరయ్య

జీవితంలో సంతృప్తిపడడం నేర్చుకున్న వ్యక్తి ఎప్పుడూ ఆనందంగానే ఉంటాడు. అది చేతకాని వ్యక్తి ఎప్పుడూ దుఃఖానికి గురవుతూనే ఉంటాడు.

జార్జ్ ఇలియట్

# ఇంకెన్నాళ్లీ రక్తపాతం భరించాలి?

**యుద్ధంతో సంబంధం లేకపోయినా, భారతీయులకు ప్రాణనష్టం ఇజ్రాయెల్, గల్ఫ్, ఇరాన్ దేశాలలో సంభవిస్తుండటం దురదృష్టకరం. ప్రభుత్వం చేతనైన సహాయం అందిస్తున్నా సరిపోని పరిస్థితి. ట్రంప్ చేస్తున్న నిర్వాకం అమెరికన్ ప్రజలు స్వాగతించారో లేదో తెలియదుకానీ, ప్రశాంతంగా చాలా వరకు ప్రవహిస్తున్న నీటిపై తన ప్రతిభను గుర్తింప చేయడానికి చేతిలో ఉన్న రాళ్లు విసిరాడు. ఫలితం ప్రపంచ ప్రజలు అనుభవిస్తున్నారు. అన్ని విధాలుగా విజ్ఞాన వీచికలు ఈ అధునాతన ప్రపంచంలో వీస్తున్నవేళ, కాలం చెల్లిన ఈ యుద్ధ ప్రవృత్తి కొందరి పాలకుల్లో ఎందుకు పదే పదే వస్తుందో అంతుపట్టడం లేదు. ప్రతి సమస్యకూ పరిష్కారం ఉంటుంది. మొదలైన ప్రతి యుద్ధం ముగియక మానదు. కానీ ఎంత కష్టం, ఎంత నష్టంతో మానవాళి మిగులుతుందో ఇప్పుడే తెలియదు.**



రావులపాటి సీతారాంరావు

ఘర్షణలు రెండు దేశాల మధ్యనో, మరికొన్ని దేశాల మధ్యనో జరగటం చూసాం కానీ ఏకంగామూడవ ప్రపంచ యుద్ధం మొదలైందా అన్న తీరులో ఇజ్రాయెల్-ఇరాన్ మధ్యలో యుఎస్ యుద్ధం, భారత్ కురుక్షేత్ర యుద్ధంలో పదహారు రోజుల్లో ఫలితం వస్తే, ఇంకా ఈ ప్రస్తుతయుద్ధం తుదివరకు చేరుకుంటున్న సూచనలు కనపడటంలేదు. ఇరాన్ బలహీన పడ్తుందేమో (ఖమైనీ చనిపోయిన తర్వాత) అని అందరూ సందేహించారు కానీ ఏదీ ఖాతరు చేయకుండా ఇజ్రాయెల్ యుఎస్ దేశాలతో, ధాటీగా తలపడటం అందర్నీ విభ్రమానికి గురి చేస్తున్నది. 'నిండా మునిగితే చలేమిటి' అన్నధోరణిలో ఇరాన్ యుద్ధం చేస్తున్నది. యుఎస్ యుద్ధం మొదలు పెట్టడం మా పని అంటే ఇహ ముగించటం మా చేతిలో ఉంది అని ఇరాన్ యుద్ధనాయకులు జవాబివ్వటం వింతగానే ఉంది. యుద్ధంలో పాల్గొనకపోయినా, భారత్‌కు ఆర్థికంగా, పర్యాటకపరంగా, నైతికంగా కోలుకోలేని నష్టం జరుగుతున్న మాట నిజం. ఫిబ్రవరి28న ఈ యుద్ధం మొదలైనప్పుడు పశ్చిమాసియాలో వేల మంది భారతీయులు పర్యటన నిమిత్తం వెళ్లినవారితోసహా గల్ఫ్‌లో చిక్కుకున్నారు. గల్ఫ్‌లోని మన దేశపు కార్యాలయాలు పర్యాటకులతోపాటు ఆ ప్రాంతాలలో నివసించే భారతీయుల ఎంక్వైరీలను, సహాయాల కోసం చేసే విన్నపాలు లెక్కకు మించి ఉండటంతో ఎంత సహాయసహకారాలు అందిస్తున్నా అక్కడ చిక్కుకున్న వారిని పూర్తిగా సంతృప్తి పర్చలేకపోతున్నారు. అన్నిటికంటే దిగ్భ్రాంతి చెందే విషయం దుబాయ్‌లోని వారిది. దుబాయిని స్వర్గంలా భావించే వారు చాలా మంది అనేక దేశవాసులు ఉన్నారు. ఇప్పుడు సైరన్ మోతలతో, కాల్పుల శబ్దాలతో దద్దరిల్లిపోతున్నది. మిస్సైల్స్ ఒకవైపు నుంచి పడుతుంటే, అవి కలిగించే పొగ, ధూళితో దుబాయి మొత్తం నిండుతున్నదా అన్న భావన అక్కడ స్థిరంగా కాపురాలు చేస్తున్న వారికి కలుగుతున్నది. పర్యాటకులు ఎన్నో ప్రణాళికలతో విహార యాత్రలు చేద్దామనుకుని వచ్చినవారు, అన్నీ రద్దు చేసుకొని హోటళ్లలో 'రెస్ట్‌లెస్'గా పచార్లు చేస్తూ కాలం గడుపుతున్నారట. బయటకు అంటే దుబాయి నుంచి బయటపడడానికి ఎన్ని ప్రణాళికలు చేసినా చెల్లని పరిస్థితి. దాదాపు పదిహేను సెకండ్ల కొక విమానం ల్యాండ్ అయ్యే దుబాయి విమానాశ్రయం ప్రస్తుతం బాంబుల మోతలతో, కాలుతున్న కట్టడాలతో కకావికలుగా మారిందని అక్కడి నుంచి వచ్చే సమాచారం చెబుతున్నది. అన్ని విమానాలు గ్రౌండ్ అయ్యాయి. గల్ఫ్‌లో వేలకొద్ది భారతీయులు చిక్కు కొని దిక్కుతోచని రీతిలో నానా అవస్థలు పడుతున్నారు. యుఎఇ ప్రభుత్వం చాతనైన సహాయం



నిర్విరామంగా చేస్తూనే ఉంది. హోటళ్లల్లో చిక్కుకొనిపోయిన యాత్రికులను ఖాళీ చేయమని ఒత్తిడి తేమని హామీలు కూడా విశాల వైఖరితో ఇస్తూనే ఉంది. ప్రభుత్వం హోటళ్ల మేనేజర్లకు పర్యాటకులను బయటకు కాలపరిమితి దాటిందని ఖాళీ చేయించవద్దు అని ఉత్తర్వులు కూడా జారీ చేసింది. అయితే ఈ ఉత్తర్వులు అబుదాబీ వరకే పరిమితమని (రాజధాని) ఇతర ఎమిరేట్స్‌కు ఈ ఆర్డర్లు వర్తించవని సున్నితంగా చెబుతున్నారట! ఎక్కువ రోజులు ఉండాల్సి వస్తే ఎక్కువ ఛార్జీలు కూడా వసూలు చేస్తున్నారట. ఆందోళన కలిగించే పరిస్థితుల్లో ప్రస్తుతం దుబాయి లాంటి ప్రదేశాలలో పర్యాటకులు దిక్కుతోచక పడి ఉంటున్నారు. సౌదీ అరేబియా, కువైట్, యుఎఇ, ఖతార్, బహరైన్, ఒమన్ (ఆరు గల్ఫ్ కోపరేషన్ కౌన్సిల్ జి.సి.ఇ అంటారు) ప్రాంతాలలో దాదాపు ఒక లక్ష కోట్ల మంది పనుల నిమిత్తం ఇండియన్ ఎక్స్‌పాట్రియేట్స్‌గా ఉన్నారని, భారత విదేశాంగ శాఖ చెబుతున్నది. అతిపెద్ద 'వర్క్‌ఫోర్స్'గా భారతీయులే ఉన్నారు. అధ్వాన్న పరిస్థితులలో కాలం వెళ్లబుచ్చుతున్న వీరిని గురించే ప్రభుత్వం ఆందోళన చెందుతున్నది. వీళ్లగాక వ్యాపారం కోసం పర్యాటకులుగా వచ్చినవారు కూడా చిక్కుకొని ఉన్నారు. అంతకు మునుపు భారత ప్రధాని పర్యాటనను కవర్ చేయడానికి వచ్చిన జర్నలిస్టులు, ఒకటి, రెండు రోజులు సైట్ సీయింగ్‌కు ఆగినవారు, అండర్‌గ్రౌండ్ బంకర్స్‌లో ఉండాల్సిన పరిస్థితి కూడా ఏర్పడింది. గల్ఫ్ దేశాలలోని పరిస్థితి ఈ విధంగా ఉంటే ఇజ్రాయెల్‌లో ఉన్న భారతీయుల పరిస్థితి కూడా గొప్పగా ఏమీలేదు. దాదాపు 30వేల మంది భారతీయులు (బ్లూకలర్ వర్కర్స్ అంటారు) ఉన్నారని విదేశాంగ శాఖ చెబుతున్నది. ఎంత మంది ఏ విధంగా ఉన్నారో లెక్కల్లో చెప్పటం కష్టమే. ఇరాన్‌లో మాత్రం భారతీయుల సంఖ్య తక్కువ. ఎక్కువగా టెహరాన్, ఖూమ్, బందర అబ్బాస్, (దేశంలోని పెద్దపోర్ట్)లో ఉన్నారు. యు.ఎస్, ఇజ్రాయెల్ బాంబింగ్‌లలో భారతీయులు చనిపోవడం గాయాలబారిన పడటం జరగలేదు కానీ ఇరానీయన్ డ్రోన్, మిస్సైల్ దాడుల్లో మాత్రం (ఆయిల్ టాంకర్ల మీద) దాదాపు నలభైమంది గాయపడటమో, చనిపోవటమో కనపడకుండాపోవటమో జరిగిందని వార్తలు వస్తున్నాయి. యుద్ధంతో సంబంధం లేకపోయినా, భారతీయులకు ప్రాణనష్టం ఇజ్రాయెల్, గల్ఫ్, ఇరాన్ దేశాలలో సంభవిస్తుండటం దురదృష్టకరం. ప్రభుత్వం చేతనైన సహాయం అందిస్తున్నా సరిపోని పరి స్థితి. ట్రంప్ చేస్తున్న నిర్వాకం అమెరికన్ ప్రజలు స్వాగతించారో లేదో తెలియదుకానీ, ప్రశాంతంగా చాలా వరకు ప్రవహిస్తున్న నీటిపై తన ప్రతిభను గుర్తింప చేయడానికి చేతిలో ఉన్న రాళ్లు విసిరాడు. ఫలితం ప్రపంచ ప్రజలు అనుభవిస్తున్నారు. అన్ని విధాలుగా విజ్ఞాన వీచికలు ఈ అధునాతన ప్రపంచంలో వీస్తున్న వేళ, కాలం చెల్లిన ఈ యుద్ధ ప్రవృత్తి కొందరి పాలకుల్లో ఎందుకు పదే పదే వస్తుందో అంతుపట్టడం లేదు. ప్రతి సమస్యకూ పరిష్కారం ఉంటుంది. మొదలైన ప్రతి యుద్ధం ముగియక మానదు. కానీ ఎంతకష్టం, ఎంత నష్టంతో మానవాళి మిగులుతుందో ఇప్పుడే తెలియదు. ●

# రైతు రాజ్యంలో కౌలు రైతు ఎందుకు పరాయి?

తిప్పర్తి శ్రీనివాస్

తెలంగాణను 'రైతు రాష్ట్రం'గా అభివర్ణించుకోవడం కొత్త విషయం కాదు. వ్యవసాయానికి అనుకూలంగా సాగునీటి ప్రాజెక్టులు, పెట్టుబడి సబ్సిడీలు, పంట మద్దతుధరల వంటి అంశాల్లో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టినట్టు చెప్పుకుంటుంది. కానీ ఈ చర్చల్లో ఒకవర్గం తరచుగా కనపడకుండా పోతుంది కౌలు రైతులు. భూమి యజమాన్యం లేకపోయినా, భూమిని కౌలుకు తీసుకుని పంట పండించే ఈ రైతులే వాస్తవానికి వ్యవసాయ వ్యవస్థకు వెన్నెముక. అయినప్పటికీ వారి సమస్యలు ఇంకా పరిష్కారం కోసం ఎదురు చూస్తూనే ఉన్నాయి. తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున కౌలు వ్యవసాయం జరుగుతోంది. చిన్నచిన్న భూస్వాములు నగరాలకు వలస వెళ్తూ, తమ భూములను సాగు చేయడానికి ఇతరులకు కౌలుకు ఇస్తున్నారు. సాగు బాధ్యతను మోసేది కౌలు రైతే అయినా, భూమి పత్రాలు మాత్రం యజమాని పేరులోనే ఉంటాయి. ఈపరిస్థితి ప్రభుత్వ పథకాల అమలులో ప్రధాన అడ్డంకిగా మారుతోంది. ఉదాహరణకు రైతుబంధు పథకం రైతులకు పెట్టుబడి మద్దతు అందించడానికి రూపొందించబడింది. కానీ ఈ సాయం భూమి యజమాని పేరుమీద ఆధారపడి ఉంటుంది. కౌలు రైతు పంటకు ఖర్చు పెట్టినా, ఆర్థిక సహాయం మాత్రం భూమి యజమానికి చేరుతుంది. చాలా సందర్భాల్లో యజమానులు ఆ మొత్తాన్ని కౌలు రైతుకు ఇవ్వరు. ఈ విధంగా పథకం లక్ష్యం కౌలు రైతుల వద్ద ఆగిపోకుండా మార్గం మళ్లుతోంది. అలాగే రైతు బీమా వంటి జీవిత బీమా పథకాలు కూడా భూమి యజమానులకే పరిమితం అవుతున్నాయి. పంట విఫలమై అప్పుల బారిన పడి, ఆర్థిక ఒత్తిడితో ప్రాణాలు కోల్పోయే వారు చాలాసార్లు కౌలు రైతులే. కానీ పరిహారం అందే సమయంలో భూమి పత్రాలు అడగడం వల్ల వారి కుటుంబాలు న్యాయం కోల్పోతున్నాయి. కౌలు రైతుల ప్రధాన సమస్య అధికారిక గుర్తింపు లేకపోవడం. ఎక్కువగా కౌలు ఒప్పందాలు మౌఖికంగానే ఉంటాయి. భూమి యజమానులు రాతపూర్వక ఒప్పందాలకు ముందుకు రావడం అరుదు. భవిష్యత్తులో యాజ



మాన్య హక్కులపై సమస్యలు తలెత్తుతాయనే భయంతో వారు ఒప్పందాలను నమోదు చేయరు. దీనివల్ల కౌలు రైతుకు చట్టపరమైన రక్షణ ఉండదు. పంట నాటిన తరువాత కూడా భూమి కోల్పోయేప్రమాదం ఉంటుంది. బ్యాంకు రుణాల విషయంలోనూ ఇదే పరిస్థితి. భూమి పాస్‌బుక్ లేకుండా వ్యవసాయ రుణం పొందడం కష్టం. ఫలితంగా కౌలు రైతులు అధిక వడ్డీకి ప్రైవేట్ అప్పులపై ఆధారపడుతున్నారు. పంట నష్టపోతే అప్పుచెల్లించడం అసాధ్యమవుతుంది. ఈ ఆర్థిక అస్థిరత గ్రామీణ సమాజంలో తీవ్రమైన సమస్యలకు దారితీస్తోంది. తెలంగాణ ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం అనేక చర్యలు చేపట్టినప్పటికీ, కౌలురైతుల కోసం ప్రత్యేక చట్టబద్ధ వ్యవస్థ ఇంకా అవసరం. సాగుచేసే వ్యక్తిని గుర్తించి, అతనికి నేరుగాప్రయోజనాలు అందే విధంగా విధానాలు రూపుదిద్దుకోవాలి. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేసి, బ్యాంకు రుణాలు, పంటబీమా, సబ్సిడీలు అందేలా చేయాలి. కేంద్ర ప్రభుత్వ పథకాలైన పీఎం కిసాన్ లేదా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన వంటి కార్యక్రమాల్లో కూడా సాగు చేసే రైతును లబ్ధిదారుడిగా గుర్తించే మార్పులు అవసరం. ఇదొక కీలకఅంశం సామాజిక భద్రత. కౌలు రైతుల కోసం ఆరోగ్య బీమా, ప్రమాద బీమా, వృద్ధాప్య పింఛన్ వంటి రక్షణ చర్యలు అమలు చేయాలి. గ్రామ స్థాయిలో రైతు సంఘాలను బలోపేతం చేసి, కౌలురైతులను సంఘటితం చేయడం కూడా సమయోచితం. వారు సంఘటితంగా ఉంటేనే తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురాగలరు. తెలంగాణలో వ్యవసాయం అభివృద్ధి చెందాలంటే, పంటను నిజంగా పండించే రైతు బలపడాలి. భూమియజమాని మాత్రమే రైతుకాదని, భూమిని చెమటోడ్చి సాగు చేసే కౌలురైతే అసలైన కృషికుడని గుర్తించాల్సిన సమయం వచ్చింది. సంక్షేమ పథకాలు కేవలం పత్రాల ఆధారంగా కాకుండా, భూమిపై కష్టపడే చేతులను గుర్తించే విధంగా మారాలి. కౌలు రైతుల సమస్యలను పట్టించుకోకుండా 'రైతు రాజ్యం' అనేనినాదం అసంపూర్ణమే. తెలంగాణలో వ్యవసాయ రంగం స్థిరంగా ఉండాలంటే, కౌలు రైతులకు చట్టబద్ధ రక్షణ, ఆర్థిక భద్రత, సామాజిక గౌరవం కల్పించాలి. అదే నిజమైన రైతు సంక్షేమం. అదే తెలంగాణ వ్యవసాయ భవిష్యత్తుకు బలమైన పునాది. ●

# ప్రజావాక్కు



## ప్రాణాలు తీస్తున్న శబ్ద కాలుష్యం

ఆధునిక నాగరికత వేగంగా ముందుకు సాగుతున్న కొద్దీ మన జీవితాల్లో శబ్దకాలుష్యం ప్రమాదకరమైన సమస్యగా నిశ్శబ్దంగా పెరుగుతోంది. నగరాలవిస్తరణ, పెరుగుతున్న ట్రాఫిక్, నిరంతరం వినిపించే హారన్లు, లౌడ్‌స్పీకర్లు, పరిశ్రమలశబ్దాలుకలిసి మన జీవనశైలిని ప్రభావితం చేస్తున్నాయి. ఈపరిస్థితి మన ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపుతుందని కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ సహాయమంత్రి తాజాగా లోక్‌సభలో వెల్లడించడం ఆందోళన కలిగించే విషయం. సుదీర్ఘకాలంపాటు అధిక శబ్దానికి గురైతే నిద్రలేమి, మానసిక అసహనం, ఒత్తిడి, రక్తపోటు, హృదయ సంబంధిత వ్యాధులు వచ్చేప్రమాదం ఉందని వైద్య నిపుణులుకూడా చెబుతున్నారు. శబ్దకాలుష్యం కేవలం వినికిడి సమస్యలకు మాత్రమే పరిమితంకాదు.

- ఇ. శ్రీనివాస్ రావు, హైదరాబాద్

## ఉద్యమకారుల కమిటీ ఉత్త మాట

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలనలో అభయ హస్తం స్కీమ్ ప్రకటిస్తూ జైలు పాలైన ఉద్యమ కారులకు పెన్షన్, 250గజాల భూమి ఇస్తున్నామని వారి వివరాలు తీసుకొన్నారు. అభయహస్తం స్కీమ్ ప్రకటించక ముందే 1969 ఉద్యమకారులు 2018లో హై కోర్టును ఆశ్రయించితే పెన్షన్, భూమి, ఉద్యోగ నియామకంలో రిజర్వేషన్, ఉచిత విద్యా, ఉచిత రవాణ సౌకర్యంలాంటివి ఇవ్వాలని 2023లో హై కోర్ట్ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ ప్రభుత్వం కోర్ట్ ఉత్తర్వులను అమలు చేయలేదు. పెన్షన్లు, భూమి తదితరాలు అమలుచేస్తే ఆర్థికంగా ప్రభుత్వం మీద భారమేమీ పడదు.

- ప్రొ.ననుమాసస్వామి, హైదరాబాద్

## ఆలోచనా శక్తి పెంచాలి

భారత విద్యా వ్యవస్థలో పరిశోధనా దృష్టిని విస్తరించాల్సిన అవసరం అత్యంత కీలకంగా మారింది. దేశంలో కోట్లాదిమంది విద్యార్థులు, లక్షలాదిపాఠశాలలు, ఉపాధ్యాయులు ఉన్నపరిస్థితిలో, పిల్లలలోజిజ్ఞాస, విచారణ, విశ్లేషణాత్మక ఆలోచనలను పెంపొందించడం ప్రధాన బాధ్యతగా నిలిచింది. చదువు అనేది కేవలం పాఠ్యపుస్తకాలు వల్లె వేయడంకాదు, ప్రశ్నించడం, అన్వేషించడం, వివిధ కోణాలలో ఆలోచించడం అనే దృక్పథాన్ని చిన్నప్పటి నుంచే అభివృద్ధి చేయాలి.

- ఎం.రామారావు, నల్గొండజిల్లా

## ప్రశ్నపత్రాల్లో పనిచేయని క్యూఆర్ కోడ్

పన్నెండో తరగతి గణిత ప్రశ్నాపత్రంలో ఉన్న ఒక క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగా ఆంగ్ల గీతంతో కూడిన యూట్యూబ్ వీడియోకు దారి తీసిందన్న వార్తలు ఇటీవల విద్యా వర్గాల్లో చర్చకుదారితీశాయి. ఈ ఘటన విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల్లో ఆసక్తితోపాటు అయోమయాన్ని కూడా కలిగించింది. సామాజిక మాధ్యమాల్లో ఈ అంశం విస్తృతంగా చర్చకు రావడంతో ప్రశ్నాపత్రాల భద్రతావ్యవస్థపై సందేహాలు వ్యక్తమయ్యాయి. సాధారణంగా ప్రశ్నాపత్రాల్లో క్యూఆర్ కోడ్‌ను భద్రతా లక్షణంగా ఉపయోగిస్తారు. దీని ప్రధాన ఉద్దేశ్యం ప్రశ్నాపత్రం నిజమైనదో కాదో నిర్ధారించడం, అలాగే దాని సమగ్రతను కాపాడడం. అయితే ఈ ఘటన వెలుగులోకి రావడంతో ఆ వ్యవస్థ ఎలాపనిచేస్తోంది అన్నదానిపై అనేకప్రశ్నలు తలెత్తాయి. దీనిపై స్పందించిన కేంద్ర మాధ్యమిక విద్యా మండలి ప్రశ్నాపత్రాల భద్రతలో ఎలాంటి లోపంలేదని స్పష్టం చేసింది. ఈ విషయాన్ని గంభీరంగా పరిగణించి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపింది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## ప్రత్యేక విభాగాలు అవసరం

గురుకుల కళాశాలలు పరిపాలన పరంగా క్లాసులు, టీచింగ్ స్టాఫ్, అటెండన్స్ రిజిస్టర్లు, స్టాఫ్ రూమ్ ప్రత్యేకంగా ఉండాలి. ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ హోదాలు కూడా ప్రత్యేకంగా వేరువేరుగా ఉండాలి. హై స్కూల్ కళాశాల ఒకే చోట ఉన్నా కూడా పరిపాలన వేరువేరుగా ఉండాలి. పనిసులువుగాఉంటుంది. పరిపాలన సులువుగా ఉంటుంది. ఎక్కువ ఫలితాలువస్తాయి. 2026-2027 విద్యా సంవత్సరం జూన్ 1వ తేదీ నుండి కొత్త విధానం అమలు చేసేలాప్రభుత్వం గురుకుల ప్రిన్సిపాల్‌లకు ఆదేశాలు జారీ చేయాలి.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

## సామాజిక మాధ్యమాల ప్రభావం


నేడు సమాజంలో యువత సెల్‌ఫోన్ భారినపడి ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటున్నారు. వీటన్నింటికి కారణంసామాజిక మాధ్యమాలైనా వాట్సాప్, ఇన్స్టాగ్రామ్, స్నాప్చాట్‌లో మీ ఇంట్లో మీ పిల్లలు ఏం చేస్తున్నారో గమనించండి. ఓ తల్లిదండ్రులారా మీ పక్కనే ఉంటూ మిమ్మల్ని వదిలి వెళ్ళేలా ప్రేరేపిస్తున్న సామాజిక మాధ్యమాలను సోషల్ మీడియా వాడకాన్ని జర అదుపులో పెట్టండి. పిల్లలు మీకు దూరంగా వెళ్తున్నారు.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

# బలహీన చట్టాలతో ప్రజాస్వామ్యానికే ప్రమాదం

పాపని నాగరాజు

భారతదేశంలో దళితులు, ఆదివాసీలు శతాబ్దాలుగా సామాజిక అణచివేతను ఎదుర్కొంటున్న వర్గాలు. దళితులపై దాడులు జరిగిన అనేక సందర్భాల్లో కేసులు నమోదు కావడం లేదన్నది సామాజిక సంస్థలు, హక్కుల సంఘాలు తరచుగా ప్రస్తావించే వాస్తవం. పోలీస్ స్టేషన్ల వద్దే ఫిర్యాదులు తిరస్కరించబడటం, కేసులు నమోదు ఆలస్యం కావడం, లేదా సాధారణ సెక్షన్ల కింద నమోదు వంటి సమస్యలు కనిపిస్తుంటాయి. కాగా దళితులపై జరిగే అణచివేతను నిరోధించే ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీస్ చట్టంలోని అంశాలపై కొన్ని తీర్పులను చూద్దాం. ఉత్తరప్రదేశ్‌లోని ఒక కేసు సందర్భంగా అలహాబాద్ హైకోర్టు చేసిన వ్యాఖ్యలను పరిశీలిస్తే ఒక వ్యక్తి ఎస్సీ/ఎస్టీ సమాజానికి చెందినవాడైన మాత్రాన కోర్టులు ఆటోమేటిక్‌గా ఎఫ్ఐఆర్ నమోదు చేయమని పోలీసులకు ఆదేశించాల్సిన అవసరం లేదని కోర్టు వ్యాఖ్యానించింది. కోర్టు ముందు వచ్చిన అభియోగాలు, ఆధారాలు, పరిస్థితులను పరిశీలించిన తరువాత మాత్రమే పోలీసు దర్యాప్తుకు ఆదేశించాలన్నది ఆ వ్యాఖ్యల సారాంశం. న్యాయపరంగా చూస్తే ఇది 'న్యాయ విచక్షణ' కింద చెప్పబడిన వ్యాఖ్య. కానీ భారతీయ సామాజిక వాస్తవాల దృష్టిలో ఇది ఆందోళన కలిగించే అంశంగా మారుతోంది. ఇదే సమయంలో జాతీయ స్థాయిలో కోర్టులు కూడా క్రమంగా ప్రజలకు అనుకూలంగా ఉన్న కొన్ని నిర్ణయాలను పరిమితం చేసే తీర్పులు ఇస్తున్నాయనే చర్చ పెరుగుతోంది. అలాంటి నేపథ్యంలోని ఒక ఉదాహరణగా ఇటీవలి అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పు కూడా సామాజిక న్యాయం అంశంపై కొత్త చర్చలకు దారితీసింది. ఇలాంటి పరిస్థితుల్లో కేవలం ఎస్సీ/ఎస్టీ అని చెప్పడం వల్ల ఎఫ్ఐఆర్ తప్పనిసరి కాదు" అనే వ్యాఖ్యలు బాధిత వర్గాల్లో అనిశ్చితిని పెంచే ప్రమాదం ఉంది. ఇప్పటికే కేసులు నమోదు కావడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న దళితులకు ఇది మరింత అడ్డంకిగా మారవచ్చని విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరుచట్టం దుర్వినియోగం కాకుండా ఉండాలని వాదిస్తారు. కానీ భారత దేశంలో ప్రధాన సమస్య దుర్వినియోగం కంటే న్యాయం అందకపోవడమే అని అనేక సంఘాలు చెబుతున్నాయి. గణాంకాలు కూడా ఈ సమస్య తీవ్రతను చూపుతున్నాయి. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) నివేదికల ప్రకారం దళితులపై నమోదయ్యే అట్రాసిటీ కేసులు యేటా పెరుగుతున్నాయి. అయితే ఈ కేసుల్లో శిక్షా రేటు మాత్రం చాలా తక్కువగా ఉంది. అంటే నేరాలు తగ్గడం కాదు, కానీ బాధితులకు న్యాయం అందే ప్రక్రియ బలహీనంగానే ఉందనే అభిప్రాయం వ్యక్తమౌతోంది. ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. అలాంటి పరిస్థితిలో ఎఫ్ఐఆర్ నమోదు ప్రక్రియను మరింత కఠినతరం చేసే వ్యాఖ్యలు రావడం ఆందోళన కలిగించేదిగా ఉంది. ఇటీవలి కాలంలో మరో ముఖ్యమైన సామాజిక రాజకీయ పరిణామం కూడా కనిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రారంభమైన ఒక డిమాండ్ ఇప్పుడు జాతీయ స్థాయిలో చర్చనీయాంశమైంది. అది ఏమిటంటే, ఎస్సీ, ఎస్టీ సమాజాలకు ఉన్నట్లే బీసీలకు




కూడా ప్రత్యేక అట్రాసిటీ చట్టం అవసరం అనే డిమాండ్. కుల వివక్ష, సామాజిక అవమానాలు బీసీ వర్గాలపై కూడా జరుగుతున్నాయనే వాదనతో ఈ డిమాండ్ బలపడుతోంది. ఎస్సీ, ఎస్టీలకు ఉన్న రక్షణాత్మక అట్రాసిటీ చట్టం వల్లే బీసీలు కూడా అలాంటి చట్టాన్ని కోరుతున్నారనే వాస్తవాన్ని అగ్రవర్ణ ఆధిపత్య వర్గాలు గమనిస్తున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. అందుకే ముందుగా ఎస్సీ, ఎస్టీలకు ఉన్న రక్షణ చట్టాలను బలహీనపరిస్తే భవిష్యత్తులో బీసీలు కూడా అలాంటి చట్టాన్ని డిమాండ్ చేసే పరిస్థితి తగ్గుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల మహారాష్ట్రలోని సౌందాల గ్రామంలో గ్రామపంచాయితీ ఒక తీర్మానం చేసి "గ్రామంలో కులం, కుల వివక్షను నిషేధిస్తున్నాము" అని ప్రకటించింది. పైకి చూస్తే ఇది ప్రగతిశీల నిర్ణయంలా కనిపిస్తుంది. కానీ భారతీయ సామాజిక వాస్తవాలను దృష్టిలో పెట్టుకుంటే దీనిపై కొన్ని సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే ఒకవైపు దళితులు, బీసీలు (ఓబీసీలు), ఆదివాసీలు తమ స్వాభిమానాన్ని కాపాడుకుంటూనే కుల ఆధిపత్యాన్ని వ్యతిరేకిస్తూ పోరాడుతున్నారు. అలాంటి పరిస్థితిలో 'కులం అనే అంశాన్నే పూర్తిగా నిషేధించాలి" అనే తీర్మానాలు అసలు సమస్య అయిన కుల ఆధిపత్యాన్ని ప్రశ్నించకుండా, అణచివేతకు గురైన వర్గాల గుర్తింపును చెరిపివేయడానికి ఉపయోగపడతాయనే అనుమానం వ్యక్తమవుతోంది. ఈ సంఘటన బీజేపీ పాలిత రాష్ట్రంలో జరగడం కూడా చర్చనీయాంశమైంది. ఒకవైపు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పరిమితం చేసే వ్యాఖ్యలు వస్తుంటే, మరోవైపు విద్యాసంస్థల్లో ఎస్సీ, ఎస్టీలతో పాటు ఓబీసీ విద్యార్థులపై కుల వివక్ష ఉండకూడదని యూజీసీ ఇచ్చిన మార్గదర్శకాలకు వ్యతిరేకంగా ఉత్తరప్రదేశ్‌లో అగ్రవర్ణ సంఘాలు నిరసనలు చేపట్టడం కూడా గమనించదగ్గ విషయం. 2025 ప్రారంభంలోనే కొన్ని కోర్టుల తీర్పులుచూస్తే, క్రింది కులాల రక్షణ కోసం రూపొందించిన చట్టాలు, హక్కులను పరిమితం చేసే విధంగా వ్యాఖ్యలు వస్తున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే నేపథ్యంలో సుప్రీంకోర్టు ముగ్గురు న్యాయమూర్తుల ధర్మాసనం ఇచ్చిన ఒక తీర్పు కూడా చర్చనీయాంశమైంది. ఆ తీర్పులో ఎస్సీ/ఎస్టీ వ్యక్తిని కులం పేరుతో బహిరంగంగా అవమానించినప్పుడే అది అట్రాసిటీ కేసుగా పరిగణించవచ్చని వ్యాఖ్యానించబడింది. దీనివల్ల వ్యక్తిగతంగా జరిగే అనేక అవమానాలను చట్టపరంగా నిరూపించడం కష్టతరం అవుతుందనే విమర్శలు వచ్చాయి. అలాంటి తీర్పుల పరంపరలోనే ఇప్పుడు అలహాబాద్ హైకోర్టు వ్యాఖ్యలు కూడా కొనసాగింపుగా కనిపిస్తున్నాయని సామాజిక న్యాయం కోసం పోరాడే వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ పరిస్థితిని భారత రాజ్యాంగ దృష్టితో కూడా చూడాలి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 17 అస్పృశ్యతను రద్దు చేస్తూ దానిని చట్టవిరుద్ధంగా ప్రకటించింది. అలాగే ఆర్టికల్ 15 కులం ఆధారంగా వివక్షను నిషేధిస్తుంది. చరిత్రపరంగా అణచివేతకు గురైనవర్గాలకు ప్రత్యేక రక్షణ కల్పించడం ఈ రాజ్యాంగ హామీల అసలు ఉద్దేశం. కోర్టులు ఇచ్చే వ్యాఖ్యలు సామాజిక వాస్తవాలను పరిగణనలోకి తీసుకోవాలి. దళితులపై దాడులు ఇంకా జరుగుతున్న సమాజంలో బాధితులకు న్యాయం అందించే పరిస్థితిని తీసుకురావాలి. సామాజిక న్యాయం అనేది కేవలం న్యాయపరమైన పదంకాదు, అది భారత ప్రజాస్వామ్యానికిప్రాణం. అణచివేతకు గురైనవర్గాల రక్షణ కోసం రూపొందించిన చట్టాలు బలహీనపడితే, భారత రాజ్యాంగంవాగ్దానం చేసిన సామాజిక న్యాయం పునాదులే కదిలే ప్రమాదం ఉంది. ●

గమనిక : ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి
ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)



## ఇంధన ట్యాంక్‌పై డ్రోన్ దాడి:
### దుబాయ్ విమానాశ్రయం మూసివేత

**దుబాయ్, మార్చి 16:** పశ్చిమాసియాలోని పలు దేశాలపై ఇరాన్ దాడులు పెంచుతోంది. సోమవారం తెల్లవారుజామున దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో డ్రోన్ల దాడులు జరిగినట్లు స్థానిక అధికారులు వెల్లడించారు. ఈ ఘటనలో డ్రోన్ ఇంధన ట్యాంక్‌ను ఢీకొట్టడంతో భారీగా మంటలు చెలరేగాయి. దీంతో విమానాశ్రయంలోని అన్ని విమానాలను తాత్కాలికంగా నిలిపివేసి, విమానాశ్రయాన్ని మూసివేసినట్లు దుబాయ్ సివిల్ ఏవియేషన్ అథారిటీ అధికారులు వెల్లడించారు. ప్రయాణికులు, ఎయిర్‌పోర్టు సిబ్బందికి సేఫ్టీ నోటీసు జారీ చేశారు. విమానాల స్టేటస్ తెలుసుకునేందుకు విమానయాన సంస్థలను సంప్రదించాలని ప్రయాణికులకు సూచించారు. పలు విమానాలను దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి అల్ మక్తూమ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి మళ్లించినట్లు ఎయిర్‌పోర్టు అధికారులు వెల్లడించారు. ఇంధన ట్యాంక్‌కు అంటుకున్న మంటలను ఆర్పేందుకు దుబాయ్ సివిల్ డిఫెన్స్ సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. సమీపంలోని ప్రజలు ఇళ్లల్లోనే ఉండాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

## పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు
# 5,522 విమానాలు రద్దు
### - రాజ్యసభలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడి



**న్యూఢిల్లీ, మార్చి 16:** పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల కారణంగా 5,522 విమాన సర్వీసులను రద్దు చేయాల్సి వచ్చిందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. సోమవారం రాజ్యసభలో ఈ మేరకు ప్రకటన చేశారు. మధ్యప్రాచ్యంలో నెలకొన్న పరిస్థితులతో భారత విమానయాన సంస్థలు 4,335 విమానాలను, విదేశీ సంస్థలు 1,187 విమానాలను రద్దు చేశాయని రామ్మోహన్ నాయుడు వివరించారు. ప్రయాణికుల భద్రతకే ప్రభుత్వం, విమానయాన సంస్థలు అత్యంత ప్రాధాన్యత ఇస్తాయన్నారు. "సంఘర్షణ ప్రభావిత ప్రాంతాల్లో గగనతలాన్ని మూసివేసినప్పుడు అక్కడ విమానాలు నడపాల్సిన అవసరం లేదు" అని ఆయన స్పష్టం చేశారు. అయితే, విమానాల రద్దుతో అంతరాయం ఏర్పడినప్పటికీ, ఈ ఉద్రిక్త పరిస్థితుల మధ్య కూడా దాదాపు 2,19,780 మంది ప్రయాణికులు ప్రయాణించినట్లు మంత్రి తెలిపారు. భారత విమానయాన నియంత్రణ సంస్థ (డిజిసిఎ), పౌర విమానయాన మంత్రిత్వ శాఖ అధికారులు ప్రభావిత ప్రాంతాల అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ పరిస్థితిని సమీక్షి స్తున్నారని వివరించారు. ఆయా ప్రాంతాల్లో గగనతలం తిరిగి తెరుచుకున్న తర్వాతే విమాన సర్వీసులు సాధారణ స్థితికి వస్తాయని రామ్మోహన్ నాయుడు తెలిపారు.

## కటక్ ఆసుపత్రిలో భారీ అగ్ని ప్రమాదం..
### 10మంది రోగులు దుర్మరణం



**భువనేశ్వర్, మార్చి 16:** ఆసుపత్రి ఐసియూలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో రోగులు, సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. రోగులను ఐసియు నుంచి బయటకు తీసుకువెళ్లే క్రమంలో పలువురు సిబ్బందికి కూడా గాయాలయ్యాయి. ఒడిశాలోని కటక్ సిటీలో గల ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే కటక్‌లోని ఎస్‌సిబి ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆసుపత్రి ట్రామా కేర్ విభాగం ఐసియులో ఆదివారం అర్ధరాత్రి మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో 10 మంది రోగులు దుర్మరణం పాలయ్యారు. మరో 11 మందికి గాయాలయ్యాయి. ఒడిశా సిఎం మోహన్ చరణ్ మాఝి ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం అందచేయనున్నట్లు సిఎం ప్రకటించారు. అదేవిధంగా ఈ అగ్నిప్రమాదంపై సమగ్ర విచారణకు ఆదేశించారు. ఈ తెల్లవారుఝామున 2.30 గంటల సమయంలో మంటలు చెలరేగగానే రోగులను ఐసియు నుంచి బయటికి తీసుకొచ్చే ప్రయత్నం చేశామన్నారు.

## చమురుబావులకోసమే
# గల్ఫ్‌లోయుద్ధాలు



ఆనాడు ఇరాక్ నుంచి నేటి ఇరాన్ వరకూ అదేనా?

**బాగ్దాద్, మార్చి 16:** పశ్చిమాసియాల్లో చమురుబావులు, నిల్వలే యుద్ధాలకు దారితీస్తున్నాయి. నేడు ఇరాన్‌పై జరిగిన దాడికి కూడా మూల కారణం అదే కనిపిస్తోంది. అణుధ్వంసం అని చెపుతున్నా ఇరాన్‌కీలకమైన చమురు స్థావరాల న్నింటిపైనా ఇజ్రాయెల్, అమెరికాలు దాడులు చేస్తున్నాయి. ఇదేవిధంగా మూడున్న దశాబ్దాలక్రితం కువైట్‌పై సద్దాం హుస్సేన్ కన్నువేసి చమురుబావుల న్నింటినీ స్వాధీనంచేసుకోవడంతో గల్ఫ్‌యుద్ధానికి బీజంపడింది. 1990 ఆగస్టు 2న ఇరాక్ అప్పటి అధ్యక్షుడు సద్దాం హుస్సేన్ తన శక్తిమంతమైన సైన్యంతో పొరుగు దేశమైన కువైట్‌పై దండెత్తాడు. ఈ ఆక్రమణకు ప్రధాన కారణం చమురు. ఇరాన్‌ఇరాక్ యుద్ధం (1980-88) తర్వాత ఇరాక్ తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. కువైట్ కు తాము ఇవ్వాల్సిన అప్పులను రద్దు చేయాలని డిమాండ్ చేశాడు. అలాగే తమ సరిహద్దులోని చమురు బావుల నుంచి కువైట్ చమురును దొంగిలిస్తోందని సద్దాం ఆరోపించాడు. కేవలం రెండు రోజుల్లోనే కువైట్‌ను తన గుప్పిట్లోకి తెచ్చుకున్న సద్దాం దానిని ఇరాక్ యొక్క 19వ రాష్ట్రంగా ప్రకటించాడు. కువైట్ ఆక్రమణను ఐక్యరాజ్య సమితి తీవ్రంగా ఖండించింది. ప్రపంచ చమురు నిల్వల్లో కీలకమైన ప్రాంతం సద్దాం చేతుల్లోకి వెళ్లడం వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందని అమెరికా భయపడింది. దీంతో అప్పటి అమెరికా అధ్యక్షుడు జార్జ్ హెచ్.డబ్ల్యూ. బుష్ నేతృత్వంలో 35 దేశాలతో కూడిన ఒక భారీ సైనిక కూటమి ఏర్పడింది. సౌదీ అరేబియాపై దాడి జరగకుండా రక్షించడానికి ఆపరేషన్ డెజర్ట్ షీల్డ్‌పేరుతో భారీగా సైన్యాన్ని మోహరించారు. 1991 జనవరి 15 లోపు కువైట్‌ను వదిలి వెళ్లాలని సద్దాంకు అల్టిమేటం జారీ చేశారు. సద్దాం హుస్సేన్ వెనక్కి తగ్గకపోవడంతో 1991 జనవరి 17న మిత్రదేశాల కూటమి యుద్ధాన్ని ప్రకటించింది. దీనినే ఆపరేషన్ డెజర్ట్ స్టార్మ్ అని పిలిచారు. వైమానిక దాడులతో ఇరాక్ సైనిక స్థావరాలను, కమ్యూనికేషన్ వ్యవస్థను ధ్వంసం చేశారు. టెక్నాలజీని ఉపయోగించి చేసిన ఈ దాడులు టీవీల్లో ప్రత్యక్ష ప్రసారం కావడం అప్పట్లో ఒక సంచలనం. ఫిబ్రవరి 24న భూతల దాడులు ప్రారంభమయ్యాయి. కేవలం 100 గంటల్లోనే మిత్రదేశాల సైన్యం ఇరాక్ సైన్యాన్ని చిత్తు చేసి కువైట్‌ను విముక్తి చేసింది. తప్పనిసరి పరిస్థితుల్లో కువైట్ నుంచి వెనుదిరుగుతూ సద్దాం హుస్సేన్ ఒక దారుణమైన పని చేశాడు. కువైట్‌లోని సుమారు 600కు పైగా చమురు బావులకు నిప్పు పెట్టాడు. ఆ మంటలు నెలల తరబడి ఎగసిపడ్డాయి, ఆకాశం నల్లటి పొగతో నిండిపోయింది. ఇది చరిత్రలోనే అతిపెద్ద పర్యావరణ విపత్తులలో ఒకటిగా నిలిచిపోయింది. చివరకు 1991 ఫిబ్రవరి 28న యుద్ధ విరమణ ప్రకటన వెలువడింది. గల్ఫ్ యుద్ధం ముగిసినా సద్దాం హుస్సేన్ అధికారం మాత్రం పోలేదు. ఇరాక్‌పై ఐక్యరాజ్య సమితి కఠినమైన ఆర్థిక ఆంక్షలు విధించింది.

ఈ యుద్ధం అమెరికాను ప్రపంచంలోనే ఏకైక సూపర్ పవర్‌గా నిలబెట్టింది. ఆధునిక ఆయుధాలు, స్మార్ట్ బాంబులు, జీపీఎస్ టెక్నాలజీ యుద్ధాల్లో ఎంత కీలకమో ఈ యుద్ధం నిరూపించింది.

పశ్చిమాసియాలో అమెరికా సైనిక జోక్యం పెరగడానికి ఇది పునాది వేసింది, ఇది తర్వాతి కాలంలో అనేక పరిణామాలకు దారితీసింది.

ఈ యుద్ధం ద్వారా ప్రపంచం ఒక విషయాన్ని అర్థం చేసుకుంది గల్ఫ్ ప్రాంతంలో ఏ చిన్న అలజడి రేగినా, అది ప్రపంచవ్యాప్తంగా సామాన్యుడి జేబును, దేశాల ఆర్థిక వ్యవస్థలను తీవ్రంగా ప్రభావితం చేస్తుందని ప్రపంచానికి తెలిసివచ్చేలా చేసింది.

## తైవాన్ సరిహద్దుల్లోకి చైనా యుద్ధవిమానాల విన్యాసాలు
# మళ్లీ ఉద్రిక్తలు రెచ్చగొట్టిన డ్రాగన్



**తైపేయి, మార్చి 16:** తైవాన్ జలసంధిలో గత రెండు వారాలకు పైగా కొనసాగిన నిశ్శబ్దంనుంచి మళ్లీ ఉద్రిక్తతలు చెలరేగాయి. చైనా తన సైనిక విమానాలు, నౌకలతో మరోసారి కవ్వింపు చర్యలకు దిగింది. గడిచిన 24 గంటల్లో తమ ద్వీపం చుట్టూ 26 చైనా సైనిక విమానాలు, 7 నౌకలు సంచరించినట్లు తైవాన్ రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. వీటిలో 16 విమానాలు తమ వాయు రక్షణ గుర్తింపు జోన్ లోని ఉత్తర, మధ్య, నైరుతి ప్రాంతాల్లోకి ప్రవేశించాయని పేర్కొంది. ఫిబ్రవరి చివరి వారం నుంచి మార్చి మొదటి వారం వరకు తైవాన్ సమీపంలో చైనా సైనిక విమానాల కదలికలు దాదాపుగా నిలిచిపోయాయి. 2021 తర్వాత ఇంత ఎక్కువ కాలం పాటు చైనా విమానాల కార్యకలాపాలు ఆగడం ఇదే తొలిసారి. దీంతో చైనా తన వ్యూహాన్ని మార్చుకుందేమోనని, సైనిక శిక్షణ ప్రాధాన్యతలపై దృష్టి సారించి ఉండవచ్చని లేదా దౌత్యపరమైన చర్చల నేపథ్యంలో సంయమనం పాటిస్తుండవచ్చని విశ్లేషకులు భావించారు. అయితే, ఈ ఊహాగానాలకు తెరదించుతూ చైనా మళ్లీ తన దూకుడును ప్రదర్శించింది. తాజా పరిణామాల నేపథ్యంలో తైవాన్ అప్రమత్తమైంది. చైనా విమానాలు, నౌకల కదలికలను పర్యవేక్షించేందుకు తమ వాయు, నౌకా దళాలతో పాటు తీరప్రాంత క్షిపణి వ్యవస్థలను మోహరించినట్లు తెలిపింది. చైనా నుంచి కవ్వింపు చర్యలు మినహా ఎలాంటి దూకుడు చర్యలు చోటుచేసుకోలేదని అధికారులు తెలిపారు. ఇటీవలి సంవత్సరాలలో తైవాన్‌పై ఒత్తిడి పెంచే "గ్రేజోన్" తంత్రంలో భాగంగా చైనా దాదాపు ప్రతిరోజూ తమ గగనతలంలోకి విమానాలను పంపుతోంది. రాజకీయంగా కీలకమైన సంఘటనల సమయంలో ఈ కార్యకలాపాల తీవ్రత మారుతూ ఉంటుంది. తమ నుంచి విడిపోయిన భూభాగంగా తైవాన్‌ను పరిగణించే చైనా, అవసరమైతే బలవంతంగానైనా విలీనం చేసుకుంటామని హెచ్చరిస్తున్న విషయం తెలిసిందే. అయితే, రెండు వారాల పాటు సైనిక విన్యాసాలను ఎందుకు నిలిపివేసింది, ఇప్పుడు మళ్లీ ఎందుకు ప్రారంభించింది అనే దానిపై బీజింగ్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.



## కంట్ రైల్వేస్టేషన్‌లో
# పాక్ స్పై కెమెరాలు
### రహస్య సమాచారం చేరవేస్తున్న ఆరుగురి అరెస్టు

**న్యూఢిల్లీ, మార్చి 16:** దేశ రాజధాని ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న భారీ గూఢచర్య ముఠా గుట్టురట్టయింది. ఈ రాకెట్ వెనుక పాకిస్థాన్ హస్తం ఉన్నట్లు ఘజియాబాద్ పోలీసులు తమ విచారణలో గుర్తించారు. ఢిల్లీ కంట్ రైల్వే స్టేషన్‌లో నిందితులు రహస్య కెమెరాను అమర్చి, పాకిస్థాన్‌లోని హ్యాండ్లర్లకు లైవ్ ఫుటేజ్ పంపినట్లు తేలడం కలకలం రేపింది. ఈ కేసులో పోలీసులు ఆరుగురిని అరెస్ట్ చేశారు. పాకిస్థాన్‌లోని హ్యాండ్లర్ల నుంచి వాట్సాప్ ద్వారా ఆదేశాలు అందుకుని, దేశంలోని సున్నితమైన ప్రాంతాల సమాచారాన్ని చేరవేస్తున్నట్లు నిందితులు విచారణలో అంగీకరించారు. ఒక్కో అసైన్‌మెంట్‌కు రూ.10,000 నుంచి రూ.15,000 వరకు తీసుకున్నట్లు తెలిపారు. ముంబై, ఢిల్లీఎన్‌సీఆర్ పరిధిలోని రైల్వే స్టేషన్లు, ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ మోహరింపు పాయింట్లు, రక్షణ శాఖ కార్యాలయాలు, భద్రతా ఏజెన్సీల కదలికలను వీరు వీడియో తీసి పంపినట్లు పోలీసులు కనుగొన్నారు. నిందితుల నుంచి 8 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని, వారిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), అధికార రహస్యాల చట్టంలోని పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. నిందితులు కొంత డేటాను డిలీట్ చేయగా, దాన్ని తిరిగి పొందేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఈ నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు మరికొంత మందిని నియమించుకోవాలని కూడా నిందితులు ప్రయత్నించినట్లు తెలిసింది. ఢిల్లీ కంట్ వంటి కీలక రైల్వే స్టేషన్ నుంచి నేరుగా లైవ్ ఫుటేజ్ పాకిస్థాన్‌కు చేరడం అత్యంత ఆందోళనకరమని అధికారులు పేర్కొంటున్నారు. ఈ సమాచారాన్ని ఉపయోగించి ఉగ్రదాడులకు ప్లాన్ చేసే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో కీలక ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు.

## బీహార్‌లో ఎన్‌డియే క్లీన్‌స్వీప్
### - ఒడిశాలో బిజెపికి కాంగ్రెస్ ఎమ్మెల్యేల మద్దతు - 7 రాష్ట్రాల్లో 26 మంది అభ్యర్థులు ఏకగ్రీవం - తొలిసారిగా నితీశ్, నబిన్ రాజ్యసభలోకి



**న్యూఢిల్లీ, మార్చి 16:** దేశవ్యాప్తంగా పది రాష్ట్రాలలో 37 రాజ్యసభ స్థానాలకు ఎన్నికల నిర్వహించగా, 26 మంది అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు. ఇందులో బిజెపి 7, కాంగ్రెస్ 5, తృణమూల్ కాంగ్రెస్ 4, డిఎంకె 3, శివసేన, ఆర్‌పిఐ(ఎ), ఎన్‌సిపి, ఎన్‌సిపి(ఎస్‌పి), ఎఐఎడిఎంకె, పిఎంకె, యుపిపిఎల్ ఒక్కొక్క స్థానం దక్కించుకున్నారు. శరద్ పవార్, అభిషేక్ సింఘ్వి, తిరుచ్చి శివ, వినోద్ తవ్డే తదితర ప్రముఖ నేతలున్నారు. వీరంతా ఇప్పటికే రాజ్యసభ సభ్యులుగా కొనసాగుతుండగా, మరోమారు పెద్దల సభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇక బీహార్, ఒడిశా, హర్యానాలో మాత్రమే సోమవారం పోలింగ్ నిర్వహించి, ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటించారు. బీహార్‌లో ఐదు స్థానాలనూ ఎన్‌డియే అభ్యర్థులు విజయం సాధించారు. బీహార్ ముఖ్యమంత్రి, జెడియు అభ్యర్థి నితీశ్ కుమార్, బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, రామ్‌నాథ్ ఠాకూర్ (బిజెపి), శివేష్ రామ్ (బిజెపి), ఉపేంద్ర కుశ్వాహ (ఆర్‌ఎల్‌ఎం) విజయం సాధించారు. ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో మరొక విపక్ష ఎమ్మెల్యే ఓటింగ్‌కు దూరం కావడం, పలువురు ఇండిపెండెంట్ ఎమ్మెల్యేలు ఎన్‌డియే అభ్యర్థులు ఓటు వేయడంతో సునాయాశంగా విజయం సాధించారు. బీహార్ నుంచి గెలుపొందిన నితీశ్ కుమార్, నితిన్ నబిన్‌లు తొలిసారిగా రాజ్యసభలో అడుగుపెడుతున్నారు. అటు ఒడిశాలో నాలుగు స్థానాలకు జరిగిన ఎన్నికల్లో అనూహ్య సంఘటనలు చోటుచేసుకున్నాయి. మూడు రోజుల క్రితమే కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బెంగళూరుకు తరలించగా, సోమవారం ఉదయం ఓటింగ్‌కు ముందు బెంగళూరు నుంచి భువనేశ్వర్‌కు విమానంలో, అట్నుంచి నేరుగా అసెంబ్లీ వద్దకు ప్రత్యేక వాహనాల్లో వచ్చారు. అయినప్పటికీ కాంగ్రెస్– బిజెడికి చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినట్లు సమాచారం. దీంతోనే బిజెపి బరిలో నిలిపిన ముగ్గురు అభ్యర్థులు విజయం సాధించగా, మరో స్థానంలో బిజెడి అభ్యర్థి గెలుపొందారు. ఇక హర్యానాలో రెండు స్థానాలకు ఎన్నికలు జరగ్గా, రెండింటిని అధికార బిజెపి కైవసం చేసుకుంది.

## మోడీ టూర్ తర్వాత కేబినెట్ ఒకేతోనే ఇరాన్‌పై దాడులు
### భారత్‌లో ఇజ్రాయెల్ రాయబారి వెల్లడి



**న్యూఢిల్లీ, మార్చి 16:** భారత ప్రధాని నరేంద్ర మోడీ ఫిబ్రవరిలో ఇజ్రాయెల్ టూర్‌కు వెళ్లి వచ్చిన రెండు రోజులుకే ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయెల్ దళాలు దాడికి దిగిన విషయం తెలిసిందే. అయితే ప్రధాని మోడీ పర్యటన ముగిసిన కొన్ని గంటల్లోనే ఇరాన్‌పై అటాక్ జరగడం పై భిన్న కథనాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో భారత్‌లోని ఇజ్రాయెల్ అంబాసిడర్ రూవెన్ అజర్ క్లారిటీ ఇచ్చారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లారు. ప్రధాని మోడీ చేపట్టిన ఉన్నత స్థాయి దౌత్య పర్యటనకు ముందే ప్రాంతీయంగా ఉద్రిక్త పరిస్థితులు ఉన్నట్లు అజర్ వెల్లడించారు. ప్రధాని మోడీ గతనెల 25, 26 తేదీల్లో ఇజ్రాయెల్‌లో పర్యటించారని, ఆ సమయం కన్నా ముందే తమ ప్రాంతంలో పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు అందరికీ తెలిసిందే అని అజర్ అన్నారు. మోడీ టూర్‌తో సంబంధం లేకుండా సైనిక ఆదేశాల ప్రకారం దాడి జరిగినట్లు ఆయన చెప్పారు. వ్యూహాత్మక అంచనాలు వేసిన తర్వాతే ఇరాన్‌పై అమెరికాతో కలిసి దాడికి దిగినట్లు అంబాసిడర్ రూవెన్ అజర్ చెప్పారు. దాడి అంశాన్ని పరిగణలోకి తీసుకుంటే, ప్రధాని మోడీవచ్చి వెళ్లిన తర్వాతే మిలిటరీ ఆపరేషన్ చేపట్టే అవకాశం వచ్చిందని ఆయన అన్నారు. ఇరాన్‌పై దాడికి, మోడీ ట్రిప్‌కు లింకు ఉన్నట్లు వస్తున్న ఊహాగానాలను ఆయన కొట్టిపారేశారు. తమ ప్రాంతం నుంచి మోడీ వెళ్లిపోయిన తర్వాతే దాడి చేసేందుకు అనుమతి వచ్చినట్లు చెప్పారు. మోడీ పర్యటన ముగింపునకు, సైనిక చర్య చేపట్టడానికి మధ్య రెండు రోజుల సమయం పట్టిందని,

అయితే క్యాబినెట్ నిర్ణయం తర్వాతే దాడికి పాల్పడినట్లు అజర్ చెప్పారు. అమెరికాకు కానీ, ఇజ్రాయెల్‌కు కానీ ఇరాన్‌ను ఆక్రమించాలన్న ఉద్దేశం లేదన్నారు. కేవలం ఇరాన్‌లో అంతర్గత మార్పులు జరగాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. పశ్చిమాసియా ప్రాంతంలో స్థిరత్వాన్ని, భద్రతను కల్పించాలన్నదే ఇజ్రాయెల్ ముఖ్య ఉద్దేశమన్నారు.

## పశ్చిమబెంగాల్ డిజిపి, నగరకమిషనర్‌ల బదలీ
### ఇప్పటికే హోం కార్యదర్శి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల బదలీ

**కోల్‌కత్తా, మార్చి 16:** పశ్చిమ బెంగాల్‌లో స్వేచ్ఛాయుత, శాంతియుత ఎన్నికల నిర్వహణే లక్ష్యంగా కేంద్ర ఎన్నికల సంఘం (ఇసిఐ) చర్యలు చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోం సెక్రటరీలను బదిలీ చేసిన మరుసటి రోజే, పోలీసు శాఖలోనూ భారీ మార్పులు చేసింది. రాష్ట్ర యాక్టింగ్ డీజీపీ పీయూష్ పాండే, కోల్‌కతా పోలీస్ కమిషనర్ సుప్రతిమ్ సర్కార్‌లను తక్షణమే ఆ పదవుల నుంచి తొలగిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. నూతన డీజీపీగా 1992 బ్యాచ్ ఐపీఎస్ అధికారి సిద్ధ్ నాథ్ గుప్తాను, కోల్‌కతా నూతన పోలీస్ కమిషనర్‌గా 1996 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అజయ్ కుమార్ నంద్‌ను ఈసీ నియమించింది. వీరితో పాటు లా అండ్ ఆర్డర్ డీజీగా ఉన్న వినీత్ కుమార్ గోయల్‌ను కూడా తొలగించి, ఆయన స్థానంలో 1995 బ్యాచ్ అధికారి అజయ్ ముకుద్ రానడేను అదనపు డీజీగా (లా అండ్ ఆర్డర్) నియమించారు. మరోవైపు, 1991 బ్యాచ్ ఐపీఎస్ అధికారి నటరాజన్ రమేశ్ బాబును డైరెక్టర్ జనరల్ ఆఫ్ కరెక్షనల్ సర్వీసెస్‌గా పోస్టింగ్ ఇచ్చారు. బెంగాల్‌లో ఎన్నికలను హింసారహితంగా నిర్వహిస్తామని చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ప్రకటించిన విషయం తెలిసిందే. కేవలం జనవరి 30న నియమితులైన పాండే, సర్కార్‌లను రెండు నెలలు కూడా గడవకముందే మార్చడం గమనార్హం.

## నేపాల్‌లో చుక్కలను తాకుతున్న పెట్రో, డీజిల్ ధరలు!

**ఖాట్మండు, మార్చి 16:** పశ్చిమాసియాలో చెలరేగుతున్న యుద్ధ సెగలు ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలను దహించివేస్తున్నాయి. ఇరాన్‌ఇజ్రాయెల్ యుద్ధం కాస్తా ప్రపంచ ఇంధన సంక్షోభానికి దారితీయడంతో, మన పొరుగు దేశమైన నేపాల్‌లో పెట్రో ధరలు రాత్రికి రాత్రి రికార్డు స్థాయికి చేరాయి. నేపాల్ ఆయిల్ కార్పొరేషన్ తీసుకున్న సంచలన నిర్ణయంతో ఈ రోజు నుంచి పెరిగిన ధరలు అమల్లోకి వచ్చాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు పెరగడం, సరఫరా వ్యవస్థలో అంతరాయాల కారణంగా నేపాల్ ప్రభుత్వం ఇంధన ధరలను భారీగా సవరించింది. పెట్రోల్ లీటరుకు రూ.31 పెరగడంతో ఇప్పుడు రూ.188 కి చేరింది. డీజిల్ ఏకంగా రూ.54 పెరగడంతో లీటరు ధర రూ.196 కి చేరుకుంది. ఎల్‌పీజీ సిలిండర్‌పై రూ.296 భారం పడటంతో, ఇప్పుడు ఒక్కో బండ ధర రూ.2,126 కు పెరిగింది. గతనెల 28న ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ మరణం తర్వాత పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పరాకాష్టకు చేరాయి. ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన 'హార్మూజ్ జలసంధి గుండా నౌకల రాకపోకలు నిలిచిపోవడంతో అంతర్జాతీయంగా ముడి చమురు కొరత ఏర్పడింది. ఈ ప్రభావం నేరుగా దిగుమతులపై ఆధారపడే నేపాల్ వంటి దేశాలపై పడింది. ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో తమకు నిరంతరాయంగా ఇంధనాన్ని సరఫరా చేస్తున్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌కు నేపాల్ ప్రభుత్వం కృతజ్ఞతలు తెలిపింది. భారత్‌లో ధరలు స్థిరంగా ఉన్నన్నాయి.

## మంటల్లో పశ్చిమాసియా

## నాటో కూటమిపై ట్రంప్ ఫైర్!



**వాషింగ్టన్, మార్చి 16:** పశ్చిమాసియా యుద్ధం ముదురుతున్న తరుణంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన యూరోపియన్ మిత్ర దేశాలపై నిప్పులు చెరిగారు. నార్త్ అట్లాంటిక్ ట్రెటీ ఆర్గనైజేషన్ (నాటో) భవిష్యత్తుపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ప్రస్తుత పరిస్థితి చాలా దారుణంగా ఉందని వ్యాఖ్యానించారు. ఇరాన్ అడ్డంకుల వల్ల మూతపడిన హార్మూజ్ జలసంధిని తిరిగి తెరిపించేందుకు తమతో కలిసి రావాలని నాటో కూటమిని ఆయన డిమాండ్ చేశారు. హార్మూజ్ జలసంధి ద్వారా చమురు పొందుతున్న దేశాలు తమ సొంత నౌకల రక్షణ కోసం ముందుకు రాకపోవడాన్ని ట్రంప్ తప్పుబట్టారు. అందరి కోసం అమెరికా ఒక్కటే కాపలా కాయలేదు. ఈ కీలక మార్గాన్ని తెరిపించేందుకు జర్మనీ, ఫ్రాన్స్ వంటి దేశాలు తమ యుద్ధనౌకలను పంపించాలి. నాటో దేశాలు తమ బాధ్యతను నెరవేర్చకుంటే ఆ కూటమి భవిష్యత్తు ప్రశ్నార్థకమే అని ఆయన హెచ్చరించారు. మరోవైపు, ఇరాన్‌పై అమెరికా జరిపిన బాంబు దాడులను ట్రంప్ సమర్థించుకున్నారు. చమురు సరఫరాను అడ్డుకుంటే ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుందని, దానిని అడ్డుకోవడానికి ఎంతటి కఠిన నిర్ణయాలకైనా వెనకాడబోమని చెప్పారు. ట్రంప్ వ్యాఖ్యలతో నాటో కూటమిలో ఒక్కసారిగా కలకలం రేగింది. పశ్చిమాసియా యుద్ధంలో నేరుగా పాల్గొనడానికి యూరోపియన్ దేశాలు మొగ్గు చూపకపోవడంతో, అమెరికా, దాని మిత్రదేశాల మధ్య దూరం పెరుగుతోందనే చర్చ మొదలైంది.

## ఇజ్రాయెల్ అమెరికాలను సవాల్‌చేస్తున్న 'డాన్సింగ్ మిసైల్'



**టెహ్రాన్, మార్చి 16:** ఇరాన్‌పై జరుగుతునన దాడులకు ప్రతిగా ఇరాన్ డ్యాన్సింగ్ మిస్సైల్ అని పిలిచే అత్యాధునిక క్షిపణిని ప్రయోగించి ప్రపంచాన్ని విస్మయానికి గురిచేసింది. సాధారణ క్షిపణులు ఒకే మార్గంలో వెళ్తాయి, కానీ ఈ క్షిపణి గగనతలంలో దిశలను మారుస్తూ, వంకరటింకరగా ప్రయాణిస్తూ ఇజ్రాయెల్ రక్షణ కవచం ఐరన్ డోమ్‌ను ముప్పుతిప్పలు పెట్టింది. ఈ క్షిపణి ప్రయాణించే తీరును చూసి రక్షణ రంగ నిపుణులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కోర్ (ఐఆర్ జీసీ) ఈ ప్రయోగాన్ని ధ్రువీకరించింది. ఈ క్షిపణులు రాడార్లకు దొరకకుండా, శత్రుదేశాల రక్షణ వ్యవస్థలను ఏమారుస్తూ లక్ష్యాన్ని చేరుకుంటాయని వెల్లడించింది. ఇజ్రాయెల్‌లోని వ్యూహాత్మక సైనిక స్థావరాలే లక్ష్యంగా వీటిని ప్రయోగించినట్లు తెలుస్తోంది. తమ అమ్ములపొదిలో ఉన్న అత్యంత రహస్య ఆయుధాల్లో ఇదొకటని, తాము ఇంకా తమ పూర్తి సామర్థ్యాన్ని ప్రదర్శించలేదని ఇరాన్ హెచ్చరించింది. ఇజ్రాయెల్ కూడా ప్రతీకార దాడులను ముమ్మరం చేసింది. లెబనాన్‌లోని హిజ్బుల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ వాయుసేన బాంబుల వర్షం కురిపించింది. ఈ దాడుల్లో పలువురు సామాన్య పౌరులు కూడా ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. అమెరికా తన థాడ్ క్షిపణి రక్షణ వ్యవస్థను ఇజ్రాయెల్‌లో మోహరించినప్పటికీ, ఇరాన్ కొత్తగా ప్రయోగిస్తున్న ఈ డ్యాన్సింగ్ మిస్సైళ్లను అడ్డుకోవడం పెద్ద సవాలుగా మారింది.

## ఔను...నేను చనిపోయాను కదా!
### కాఫీ తాగుతూ బెంజమిన్ నెతన్యాహు సెటైర్లు



**టెల్ అవీవ్, మార్చి 16:** ఇరాన్ దాడిలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు చనిపోయారని సోషల్ మీడియాలో కొన్ని రోజులుగా వార్తలు వైరల్ అయ్యాయి. ఈ ఊహాగానాలపై స్పందిస్తూ నెతన్యాహు స్వయంగా ఒక వీడియోను సోషల్‌మీడియాలో విడు దల చేసి ఆ వార్తలను నవ్వుతూ కొట్టిపారేశారు. నెతన్యాహు ఒక కేఫ్ వద్ద కాఫీ ఆర్డర్ చేస్తూ వీడియోలో కనిపించారు. అవును నేను చనిపోయాను కాఫీ కోసం అంటూ ఆయన సరదా వ్యాఖ్యలుచేసారు. నా ప్రజల కోసం నేను ప్రాణాలు ఇస్తున్నాను, వారి ధైర్యం చూస్తుంటే చాలా గర్వంగా ఉంద్ది అని ఆయన అన్నారు. కొన్ని రోజుల క్రితం నెతన్యాహు ప్రెస్ మీట్‌లో పాల్గొన్న వీడియోను ఎవరో మార్ఫింగ్ చేసి ఆయన చేతికి ఆరు వేళ్లు ఉన్నాయని అది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో చేసిన వీడియో అని ప్రచారం చేశారు. నెతన్యాహు తన రెండు చేతులను కెమెరా వైపు చూపిస్తూ నా చేతి వేళ్లను లెక్కపెట్టాలనుకుంటున్నారా ఇక్కడ చూడండి, ఇదిగో ఇక్కడ చూశారా అన్నీ బాగానే ఉన్నాయని నవ్వుతూ చెప్పారు. ఇజ్రాయెల్ ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ బయటకు వెళ్లండి కానీ ఎప్పుడూ సురక్షిత ప్రాంతాలకు దగ్గరలోనే ఉండండి. మీ ధైర్యం నాకు, ప్రభుత్వానికి, సైన్యానికి, మొసాద్ సంస్థకు ఎంతో బలాన్ని ఇస్తోంది. మేము ఇరాన్‌పై చాలా గట్టిగా దాడులు చేస్తున్నాం. మీరు ధైర్యంగా ముందుకు సాగండి, నేను కూడా మీతోనే ఉంటాను అని భరోసానిచ్చారు. స్థానిక అధికారులు ఇచ్చే భద్రతా సూచనలను ఎప్పటికప్పుడు పాటించాలని ఆయన కోరారు. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య యుద్ధం మొదలై 16 రోజులు దాటింది.

## హార్మూజ్ రక్షణకు ట్రంప్ పిలుపు: వస్తామంటూ చైనా షరతు



బీజింగ్, మార్చి 16: ఇరాన్ యుద్ధం కారణంగా దెబ్బ తిన్న హార్మూజ్‌ను సురక్షితంగా ఉంచేందుకు, ఇంధన రవాణాను క్రమబద్ధీకరించేందుకు ముందుకు రావాలని ట్రంప్ పలు దేశాలను కోరారు. ఈ విషయమై చైనా స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది. హార్మూజ్ రక్షణకు తాము ముందుకు రావాలంటే.. పశ్చిమాసియాలో సైనిక కార్యకలాపాలను వెంటనే నిలిపివేయాలని చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ ఇరువర్గాలకు సూచించారు. ఈ ఘర్షణల వల్ల అంతర్జాతీయ ఇంధన ప్రవాహం, ప్రాంతీయ శాంతి, ప్రపంచ స్థిరత్వం దెబ్బతిన్నాయన్నారు. ఉద్రిక్తతలు మరింత పెరగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని లిన్ జియాన్ అమెరికాకు సూచించారు. ప్రస్తుత ఘర్షణలు ఆగితేనే ప్రాంతీయ స్థిరత్వం సాధించగలమని పేర్కొన్నారు. ఈ నెల చివరలో ట్రంప్ బీజింగ్ పర్యటన గురించి అమెరికాతో చర్చలు జరుగుతున్నాయన్నారు. ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు మెరుగుపరుచుకోవడంలో ఈ పర్యటన కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఆదివారం ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో మీడియాతో ట్రంప్ మాట్లాడుతూ.. హార్మూజ్ ప్రాంతంలో చైనా ప్రయోజనాలే ఎక్కువ.

# రైతు వేదికల్లో జాతీయ ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ



## ఎంపిక చేసిన రైతులకు ప్రకృతి వ్యవసాయ కిట్లు పంపిణీ చేయనున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, మార్చి 16, ప్రభాతవార్త:** జాతీయ ప్రకృతి వ్యవసాయ పథకంలో భాగంగా రైతులకు సేంద్రియ వ్యవసాయంపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. క్రమంగా రైతులను సేంద్రియ వ్యవసాయం వైపు ప్రోత్సహించాలని భావిస్తోంది. ఇందులో భాగంగా మంగళవారం నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమంలో రైతు వేదికల ద్వారా ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇవ్వనుంది.
ఈ పథకంలో భాగంగా కృషి సఖిలను క్లస్టర్‌కు ఇద్దరు చొప్పున ఎంపిక చేసి వారికి శిక్షణను ఇవ్వనుంది. శిక్షణ అనంతరం వారి ద్వారా క్లస్టర్‌లో 125 మంది రైతులకు సేంద్రియ సాగు పద్ధతులపై నిరంతరం అవగాహన కల్పించనుంది. అదేవిధంగా రైతులకు ప్రకృతి వ్యవసాయం చేసినట్లుగా సర్టిఫికెట్‌ను ప్రభుత్వం ఇవ్వనుంది. ప్రతి క్లస్టర్ కు 125 మంది రైతుల చొప్పున గుర్తించిన 489 క్లస్టర్లలో 61,125 మంది రైతులకు సేంద్రియ సాగుపై శిక్షణ ఇవ్వనున్నారు. జాతీయ ప్రకృతి వ్యవసాయ పథకంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన రైతులక ఫార్మర్ కిట్లను పంపిణీ చేసే కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉదయం 10 గంటలకు సచివాలయం నుండి అధికారికంగా ప్రారంభిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 489 క్లస్టర్లలో ఈ కిట్ల పంపిణీ జరుగుతుంది. ప్రతీ క్లస్టర్‌కు 125 మంది చొప్పున రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 61,125 మంది రైతులకు ఈ కిట్లను అందజేయనున్నారు. సచివాలయంలో మంత్రి తుమ్మల ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయా జిల్లాల్లోని రైతు వేదికల్లో స్థానిక ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా రైతులకు కిట్లను పంపిణీ చేస్తారు.

**22న సిఎం చేతుల మీదుగా**

**నర్మెట్ట ఆయిల్‌ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభం**

సిఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభంకానున్న నర్మెట్ట ఆయిల్ పామ్ ఫ్యాక్టరి ప్రారంభోత్స ఏర్పాట్లు ఘనంగా ఉండాలని వ్యవసాయశాఖ ఉన్న తాధికారులను ఆ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఈ నెల 22న సిఎం అధికారికంగా ఆయిల్‌ఫామ్ ఫ్యాక్టరిని ప్రారంభిస్తారని తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లపై సచివాలయంలో సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరితో కలిసి ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా రైతు వేదికల ద్వారా ప్రత్యక్ష ప్రసారం నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం సందర్భంగా రైతుల సందర్శనార్థం మార్చి 20 నుంచి 22 వరకు రైతు మేళాను నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ మేళాలో రైతులకు ఉపయోగపడే విధంగా వివిధ స్టాల్స్ ఏర్పాటు చేయాలని, కేవలం వ్యవసాయశాఖతోపాటు అనుబంధ రంగాలు, పశు సంవర్ధకశాఖకు సంబంధించిన స్టాల్స్ కూడా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 22న ఆయిల్ పామ్ ఫ్యాక్టరిని సిఎం ప్రారంభించడంతోపాటు రూ.80 కోట్లతో నిర్మించనున్న ఆయిల్ పామ్ రిఫైనరీకి శంకుస్థాపన చేస్తారని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.

**గడ్డి, కలుపు మందును నిషేధించండి:**

**సిఎం రేవంత్, మంత్రి తుమ్మలకు రైతు కమిషన్ వినతి**

గడ్డిమందు దుష్ప్రభావాలపై సిఎంతోపాటు మంత్రి తుమ్మలకు నివేదిక వ్యవసాయరంగంలో గడ్డి, కలుపు మందు వినియోగాన్ని, విక్రయాలను నిషేదించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ రైతు కమిషన్ కోరింది. ఈ మేరకు సిఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును అసెంబ్లీ ఆవరణలో కలిసి గడ్డి మందు వినియోగం, దుష్ప్రభావాలపై నివేదికను అందజేసింది. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సైతం గడ్డి, కలుపు మందును నిషేదించాలని కోరుతోందని కమిషన్ బృందం సిఎంకు వివరించింది. తెలంగాణలో ఈ మందులను నిషేధించడంతోపాటు దేశ వ్యాప్తంగా నిషేధించేలా ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని సిఎంను రైతు కమిషన్ బృందం కోరింది.



## అభివృద్ధి పనుల కోసం సిఎం రేవంత్‌రెడ్డితో బిజెపి ఎమ్మెల్యేల భేటీ

**హైదరాబాద్, మార్చి 16,ప్రభాతవార్త :** నిజామాబాద్ జిల్లా అభివృద్ధి అంశాలపై చర్చించడానికి టిపిసిసి చీఫ్ ఎమ్మెల్సీ మహేష్‌కుమార్,కాంగ్రెస్ ఎమ్మెల్యే భూపతి రెడ్డితో కలిసి బిజెపి ఎమ్మెల్యేలు పైడి రాకేష్‌రెడ్డి వెంకట రమణారెడ్డిలు సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆర్మూర్, కామారెడ్డి ఎమ్మెల్యేల ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించడమే కాకుండా జిల్లా అభివృద్ధికి సంధించిన పలు కీలక అంశాలను పరిష్కరిస్తానని హామి ఇచ్చారు. బిజెపి ఎమ్మెల్యేలు డిచ్‌పల్లి మండలం గన్నారం ప్రాంతంలో మౌళిక వసతుల అభివృద్ధి చర్యలపై చర్చించారు.
గన్నారం ప్రాంతంలో 25 కోట్ల రూపాయల వ్యయంతో ఒక ఎకరా భూమిలో ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నిర్మాణానికి ముఖ్యమంత్రి సూత్రప్రాయంగా అంగీకారం తెలిపారు. అలాగే జిల్లా భవిష్యత్ అభివృద్ధి అవసరాలను దృష్టిలో ఉంచుకుని రెండో దశలో నిజామాబాద్ జిల్లాలో ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని చేపట్టే ప్రతిపాదనపై కూడా చర్చలు జరిగాయి. ఈ ప్రతిపాదనకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు.

**బోథ్ నియోజకవర్గం బిఆర్ఎస్,**

**బిజెపి కార్యకర్తలు భారీగా కాంగ్రెస్‌లో చేరిక**

తెలంగాణ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలకు ముగ్ధులై అనేక మంది పౌరులు స్వచ్ఛందంగా పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు వస్తున్నారని ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, పిసిసి చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. సోమవారం బోథ్ నియోజకవర్గానికి చెందిన బిఆర్ఎస్, బిజెపి పార్టీలకు చెందిన నాయకులు.కార్యకర్తలు దాదాపు 200 మంది కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

## రైతుల సంక్షేమం కోసం ఉచితంగా యూరియా పంపిణీకి ముమ్మర కసరత్తు

### బడ్జెట్ సమావేశాల్లో ప్రకటన చేసే అవకాశం

**హైదరాబాద్, మార్చి 16, ప్రభాతవార్త:** తెలంగాణ రైతులకు సాగు ఖర్చు తగ్గించి, ఆర్థిక భరోసా కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో సంచలన పథకానికి శ్రీకారం చుట్టనుంది. సాగులో అత్యంత కీలకమైన యూరియాను ఉచితంగా పంపిణీ చేసేందుకు సిద్ధమవుతోంది. రాష్ట్రంలోని రైతులకు పెట్టుబడి భారాన్ని తగ్గించడమే లక్ష్యంగా సాగులో కీలకమైన యూరియాను ఉచితంగా అందించాలని రేవంత్ సర్కారు నిర్ణయించింది. దీనిపై ఇప్పటికే ఒక సమగ్ర నివేదికను వ్యవసాయశాఖ రూపొందించి ప్రభుత్వానికి సమర్పించింది. పెట్టుబడి వ్యయం కోసం రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో ఉచిత యూరియా పంపిణీ రైతులకు తక్షణ ఊరటనిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. గత ప్రభుత్వ హయాంలోనూ ఉచిత యూరియా ప్రతిపాదన ప్రభుత్వం ముందుకు వచ్చినప్పటికీ పలు కారణాల వల్ల అమలుకు నోచుకోలేదు. అయితే ఈ అంశాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఈ బడ్జెట్ సమావేశాల్లో ఉచిత యూరియా పథకంపై అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉంది.

## నేడు హైదరాబాద్‌లో నేషనల్ మొబిలిటీ సమ్మిట్

**హైదరాబాద్, మార్చి 16, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో నేషనల్ మొబిలిటీ సమ్మిట్‌ను మంగళవారం రవాణా శాఖ ఏర్పాటు చేసింది. తెలంగాణ రవాణా శాఖ, ఎలెట్స్ టెక్నోమీడియా సంస్థ భాగస్వామ్యంతో హైదరా బాద్ మెట్రో రైల్ సహ భాగస్వామ్యంతో నేడు హైదరాబాద్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్ఐసీసీ)లో 2వ నేషనల్ మొబిలిటీ సమ్మిట్-2026 నిర్వహించనుంది. దేశంలో స్థిరమైన, సమగ్ర మొబిలిటీ అనే థీమ్‌తో నిర్వహించనున్న ఈ సమ్మిట్‌లో విధాన నిర్ణేతలు, రవాణా అధికారులు, పరిశ్రమ ప్రతినిధులు, స్టార్టప్‌లు, సాంకేతిక సంస్థలు పాల్గొని దేశంలో స్థిరమైన, సమగ్ర మొబిలిటీ భవిష్యత్తుపై చర్చించనున్నారు. సమ్మిట్ ప్రారంభ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు, ముఖ్యమంత్రి కార్యాలయ ప్రధాన కార్యదర్శి కె.ఎస్. శ్రీనివాస రాజు, రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, రవాణా కమిషనర్ డాక్టర్ కె. ఇళంబర్తి, హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్ పాల్గొననున్నారు. సమ్మిట్‌లో చివరి మైలు కనెక్టివిటీ, ప్రజా రవాణా డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు, ఇంధన పరిష్కారాలు (సీఎన్‌జీ, ఎల్‌పీజీ, బయోఫ్యూయల్) రోడ్డు, రైలు, వాయు, జల రవాణా వ్యవస్థల సమగ్ర, సురక్షి త మొబిలిటీ వంటి అంశాలపై చర్చలు జరగనున్నాయి. అదనంగా మొబిలిటీ రంగంలో అభివృద్ధి చెందుతున్న ధోరణులు, విధాన మార్పులను ప్రతిబింబించే ఈ గవర్న్‌మ్యాగ్జిన్ ప్రత్యేక సంచికను విడుదల చేయనున్నారు.

## ఈత సరదాతో నీటిలో దిగిన ముగ్గురు యువకులు దుర్మరణం

**హైదరాబాద్ (నార్సింగి), మార్చి 16, ప్రభాతవార్త ::** ఈత సరదాతో నీటిలో దిగిన ముగ్గురు యువకులు దుర్మరణం చెందిన విషాదకర దుర్ఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ జిల్లా గోల్కొండ మండలం ఇబ్రహీంబాగ్ ప్రాంతానికి చెందిన గోవర్ధన్ ప్రసాద్(26), కార్తిక్(19), వెంకటేష్(19)ఆదివారం గండిపేటకు వెళ్తున్నామని ఇంట్లో వారికి చెప్పి వెళ్లారు. మధ్యాహ్నం అయినా వారు ఇంటికి రాకపోవడంతో గోవర్ధన్ ప్రసాద్ భార్య సుకన్య నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మొదట పోలీసులు అదృశ్యం కేసులు నమోదు చేశారు. వీరి ఆచూకీ కోసం పోలీసులు గండిపేట పరిసర ప్రాంతాల్లో వెతికారు. సోమవారం ఉదయం గండిపేట చెరువు కిందున్న మడుగులో మృతదేహాలు తేలుతూ కనిపించాయి. పోలీసులు మృతదేహాలను వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతులలో గోవర్ధన్, కార్తిక్‌బావ బామ్మర్దులు కాగా వెంకటేష్ సమీప బంధువు. వీరంతా సరదాగా గడిపేందుకు వచ్చి లోతు తెలియక నీటిలో దిగి ప్రమాదంబారిన పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఒకరు నీట మునిగిపోతే మరొకరు చేతులు పట్టుకొని కాపాడే ప్రయత్నం చేసి ముగ్గు రూ మునిగిపోయి ఉంటారని పోలీసులు తెలిపారు.

## ప్రేమ పేరిట గిరిజన యువతి హత్య

### పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి.. అడవిలోకి తీసుకెళ్లి దారుణం

**పెంచికల్ పేట్, మార్చి 16, ప్రభాతవార్త :** కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్ పేట్ మండలం కొండపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని జైహింద్పూర్ అటవీ ప్రాంతంలో గిరిజన యువతి దారుణ హత్యకు గురైన ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం కొండపల్లి గ్రామానికి చెందిన ఆత్రం సమ్మక్క (25) కు జైహింద్పూర్ గ్రామానికి చెందిన వివాహితుడు కేర్కరి జలపతితో కొంతకాలంగా ప్రేమ సంబంధం కొనసాగుతోంది. ఇటీవల యువతి తనని పెళ్లి చేసుకోవాలని సదరు ప్రియుడిపై ఒత్తిడి తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం సమ్మక్క జలపతి వద్దకు వెళ్లింది. అయితే ఆమె తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. ఇదే సమయంలో సోమవారం ఉదయం జైహింద్పూర్ అటవీ ప్రాంతంలో యువతి హత్యకు గురైనట్లు సమాచారం బయటకు రావడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. సమాచారం అందుకున్న కాగజ్ నగర్ రూరల్ సీఐ కుమార స్వామి, పెంచికల్ పేట్ ఎస్సై అనిల్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. నిందితుడు జలపతిని అదుపులోకి తీసుకుని అడవిలోని ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అక్కడ లభ్యమైన మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. సంఘటన స్థలాన్ని కాగజ్ నగర్ డీఎస్పీ వాహిదోద్దీన్ పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. మృతురాలి సోదరి ఆత్రం మిరియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా పోలీసులు గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

## సినిమా పైరసీ నిరోధానికి టిజిసిఎస్‌బి మరో ఆవిష్కరణ

### ఆవిష్కరించిన టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖాగోయల్

**హైదరాబాద్, మార్చి 16, ప్రభాతవార్త:** సినీ రంగంలో పైరసీని మరింత కట్టుదిట్టంగా అరికట్టేందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎ స్‌బి), తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ (టిఎఫ్‌సిసి) ఆధ్వర్యంలో నూతన ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా కొత్తగా రూపొందించిన డి స్క్లెయిమర్‌ను టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖా గోయల్ సోమవారం నాడు ఆవిష్కరించారు.
కమాండ్ కంట్రోల్‌లోని టిజిసిఎస్‌బి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ నిర్మాత, టిఎఫ్‌సిసి అధ్యక్షుడు దగ్గుబాటి సురేష్ బాబు సహా సినీ రంగానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిఖా గోయల్ మాట్లాడుతూ కొత్తగా రూపొందించిన యాంటి పైరసీ వ్యవస్థ సినీ రంగాన్ని కాపాడుతుందని తెలిపారు. ఈ వ్యవస్థ వల్ల సినిమా హాళ్లలో పైరసీని నిరోధించవచ్చని ఆమె వెల్లడించారు. దీంతో పాటు పైరసీని నివారించేందుకు ఎస్‌ఓపిని ఏర్పాటు చేశామని ఆమె తెలిపారు.



టిజిసిఎస్‌బి రూపొందించిన డిస్క్లెయిమర్‌ను ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ శిఖాగోయల్. చిత్రంలో టిఎఫ్‌సిసి అధ్యక్షుడు సురేష్‌బాబు తదితరులు

## ఎల్‌పిజి కొరతతో విద్యార్థులకు ఇక్కట్లు

### గాంధీభవన్ ఆవరణలో ఎన్ఎస్‌యుఐ నిరసన

**హైదరాబాద్, మార్చి 16,ప్రభాతవార్త:**పరీక్షలకు సన్నద్ధం కాకుండా ఆహారంపై అనిశ్చితి నెలకొంటున్నదని ఎల్‌పిజి కొరతతతో విద్యార్థుల తీవ్ర ఇక్కట్లుపడుతున్నారని ఎన్ఎస్ యుఐ తెలంగాణరాష్ట్ర అధ్యక్షుడు యడపల్లి వెంకటస్వామి ఆవేదన చెందారు. సోమవారం గాంధీ భవన్‌లో గ్యాస్ సిలెండర్లు పెట్టి ఎన్ఎస్‌యుఐ నిరసన వ్యక్తంచేసింది.
ఈ సందర్భంగా ఎన్ఎస్‌యుఐ అధ్యక్షుడు వైవిస్వామి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఎల్‌పిజి గ్యాస్ సంక్షోభం కారణంగా గ్రామాల నుంచి ఉన్నత చదువుల కోసం పొరుగు వూళ్ళలో అద్దెకు ఇళ్ళలో ఉండే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ చెప్పారు.
గ్యాస్ సిలిండర్ల కొరతతో పాటు నల్లబజారు వ్యాపారులు వాటి ధరలు భారీగా పెంచడం వల్ల హాస్టల్లోని మెస్సులు, పిజి వసతగృహాలు విద్యార్థులకు సమయానికి భోజనం అందించలేని పరిస్థితి నెలకొందనీ అన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే పట్టణాల్లో చదువుకుంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులు ఈ పరిస్థితి వల్ల మరింత ఇబ్బందులు పడుతున్నారనీ ఆగ్రహం వ్యక్తంచేశారు.

## దేశంలో 2 లక్షల అంగన్‌వాడీ కేంద్రాలు బలోపేతం

### రాష్ట్రంలో 5 వేలకుపైగా అప్‌గ్రేడ్

### కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం

**హైదరాబాద్, మార్చి 16, ప్రభాతవార్త :** మిషన్ సాక్షం అంగన్‌వాడీ మరియు పోషణ్ పథకం కింద, కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా ప్రభుత్వ భవనాల్లో ఉన్న 2 లక్షల అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలని కీలక నిర్ణయం తీసుకుంది. మెరుగైన పోషకాహారం, బాల్య సంరక్షణ, విద్యను అందించడం లక్ష్యంగా తెలంగాణలోని 5,008 కి పైగా అంగన్‌వాడీ కేంద్రాలను సాక్షం అంగన్‌వాడీలుగా అప్‌గ్రేడ్ చేయడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని. ఇందుకు గాను దీనికి సంబంధించి రాష్ట్రానికి రూ.30.04 కోట్లు కేటాయించినట్లు కేంద్ర మహిళా, శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ అప్‌గ్రేడ్ చేసిన కేంద్రాలలో స్క్రీన్లు, వాటర్ ఫిల్టర్లు, పోషణ్ వాటిక, బాల్య విద్యా సామగ్రి, బిల్డింగ్ యాజ్‌లెర్నింగ్ ఎయిడ్ పెయింటింగ్‌లు ఉంటాయి. గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులు, పిల్లలకు అనుబంధ పోషకాహార కార్యక్రమం పోషకాహార మద్దతును అందిస్తుందని, సిఫార్సు చేయబడిన ఆహార భత్యం సగటు రోజువారీ తీసుకోవడం మధ్య అంతరాన్ని తగ్గిస్తుందని అధికారులు వెల్లడించారు.

**అంగన్‌వాడీలకు ఒంటిపూట బడి**

తెలంగాణలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సాధారణ పాఠశాలల తరహాలోనే ఒంటిపూట బడి అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. చిన్నారుల ఆరోగ్యం, భద్రత దృష్ట్యా ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంది. అంగన్‌వాడీలకు ఒంటిపూట బడులను ఏప్రిల్ 23వ తేదీ వరకు నిర్వహిస్తారు. ఆ తర్వాత నెల రోజులపాటు వేసవి సెలవులపై కూడా త్వరలో నిర్ణయం తీసుకోనున్నారు. అంగన్‌వాడీ చరిత్రలోనే గత ఏడాది నుంచి ఒంటిపూట బడులు, వేసవి సెలవులు ఇస్తున్నారు.

## రబి సీజన్‌లో రికార్డు స్థాయి ధాన్యం కొనుగోళ్లు



### 90 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు ప్రణాళిక

### గ్రేడ్-ఎ ధాన్యం క్వింటాల్‌కు రూ. 2,389 మద్దతు ధర

### నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి 16, ప్రభాతవార్త:** ముందెన్నడూ లేనివిధంగా ఈ ఏడాది రబి సీజన్‌లో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాలశాఖామంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రకటించారు.రాష్ట్ర వ్యాప్తంగా ఈ రబి సీజన్‌లో 54.48 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా 152.03 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నట్లు వెల్లడించారు. రబి సీజన్ ధాన్యం కొనుగోళ్లు, కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై సోమవారం కమిషనర్ స్టిఫెన్ రవీంద్రతో కలసి అదనపు కలెక్టర్లు, జిల్లా పౌర సరఫరాల శాఖాధికారులు, మేనేజర్లతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రబిలో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రణాళిక రూపొందించగా అందులో అందులో 60 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు రకం ధాన్యం, 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సన్న రకం ధాన్యాన్ని కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలులో రైతాంగానికి ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండేందుకు ఉత్పత్తికి తగినట్లుగానే రాష్ట్ర వ్యాప్తంగా 8,251 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.అదే సమయంలో కొనుగోలు కేంద్రాల్లో ఆధునిక సాంకేతికతను అందుబాటులోకి తేనున్నట్లు తెలిపారు.కొనుగోలు చేసిన ధాన్యానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయానుసారంగా మద్ధతు ధర చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. గ్రేడ్-ఏ, సాధారణ విభాగలుగా గుర్తించి గ్రేడ్-ఏ రూ.2,389, సాధారణ ధాన్యానికి రూ. 2,369 చెల్లించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో పెరిగిన ధాన్యం దిగుబడికి అనుగుణంగా పెరిగిన మద్దతు ధరతో రైతాంగానికి పెద్ద ఎత్తున లబ్ది చేకూరుతుందని ఆయన చెప్పారు. తద్వారా రైతాంగానికి ఆదాయం పెరుగుతుందన్నారు. కొనుగోలు కేంద్రాలను పెంచడంతోపాటు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన అధికారులను ఆదేశించారు.

## 29 జిల్లాల్లో 45 రోజుల కోచింగ్

### అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసాచారి

## మోడల్ స్కూళ్లలోని ఇంటర్ విద్యార్థినులకు నీట్, ఎప్‌సెట్, జెఇఇ ఇంటెన్సివ్ కోచింగ్

**హైదరాబాద్, మార్చి 16, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న మోడల్ స్కూల్స్ లో చదువుతున్న ఇంటర్ విద్యార్థినులకు ప్రత్యేకంగా నీట్, ఎప్‌సెట్, జెఈఈ ప్రవేశ పరీక్షల కోసం ఇంటెన్సివ్ కోచింగ్‌ను ఇవ్వనున్నారు. సుమారు 45 రోజుల పాటు కొనసాగనున్న ఇంటెన్సివ్ కోచింగ్‌ను సోమవారం మోడల్ స్కూల్స్ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసాచారి ప్రారంభించారు. విద్యాపరంగా వెనుకబడిన మండలాల్లో నాణ్యమైన విద్యను ఆంగ్ల భాషలో అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం 2013-14 విద్యా సంవత్సరంలో తెలంగాణ మోడల్ స్కూళ్లను స్థాపించింది. ప్రస్తుతం రాష్ట్రంలోని 29 జిల్లాల్లో మొత్తం 194 మోడల్ స్కూళ్లలో 6వ తరగతి నుండి ఇంటర్మీడియట్(ఎంపిసి, బైపిసి, సీఈసీ, ఎంఈసీ (గ్రూపుల్లో) విద్యను అందిస్తున్నాయి. 2024-25 విద్యా సంవత్సరంనుండి ఎంపికైన విద్యార్థులకు ఆన్‌లైన్ ఎప్‌సెట్ కోచింగ్ నిర్వహించబడుతోందని అడిషనల్ డైరెక్టర్ తెలిపారు. అలాగే 2025-26 విద్యా సంవత్సరంలో ఆగస్టు నుండి విద్యార్థులకు ఆన్‌లైన్‌లో ఐఐటీ-జెఈఈ, నీట్, ఎప్‌సెట్ కోచింగ్ నిర్వహించినట్టు తెలిపారు. విద్యార్థులకు ప్రత్యక్ష రెసిడెన్షియల్ కోచింగ్ అందించేందుకు జనవరి 31న రాష్ట్రవ్యాప్తంగా స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించినట్టు తెలిపారు. స్క్రీనింగ్ టెస్ట్‌లో పతిభ కనబరిచిన 150 మంది విద్యార్థినులకు ప్రత్యేకంగా ఇంటెన్సివ్ కోచింగ్ కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. .డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ డాక్టర్ ఈ. నవీన్ నికోలస్ మార్గదర్శకత్వంలో ప్రత్యేక ఇంటెన్సివ్ రెసిడెన్షియల్ కోచింగ్ కార్యక్రమం సోమవారం నుండి ప్రారంభించి.. మే 2 వరకు 45 రోజులపాటు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కోచింగ్ విద్యార్థినులకు హాస్టల్ వసతి, ప్రముఖ సంస్థల నిపుణులైన ఫ్యాకల్టీ ద్వారా కోచింగ్ తరగతులు, రోజువారీ ప్రాక్టీస్ టెస్టులు, స్టడీఅవర్, గ్రాండ్ టెస్టులు నిర్వహించబడతాయని శ్రీనివాసా చారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ మంజరి, ఎంఈఓ హీర్యానాయక్, మోడల్ స్కూల్ బొంగులూరు కోర్స్ కోఆర్డినేటర్ సాయిఈశ్వరి, స్టేట్ అకాడమిక్ టీమ్‌తోపాటు ఫ్యాకల్టీ పాల్గొన్నారు.

## గ్యాస్ బుకింగ్‌లో నయా తిప్పలు

### బుకింగ్ కోసం ఫోన్‌చేస్తే ప్రాసెసింగ్ మెసేజ్‌లు

**హైదరాబాద్, మార్చి 16, ప్రభాతవార్త :**పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో గ్యాస్ బుకింగ్ రాష్ట్ర ప్రజలకు పెద్ద సమస్యగా మారింది. గతంలో సదరు ఆయిల్ కంపెనీల ఐవీఆర్ఎస్ కు ఫోన్ కాల్ చేయగానే బుకింగ్ నంబర్ వచ్చేది. కానీ ఇప్పుడు కాల్ చేసినా కేవలం ప్రాసెసింగ్ మెసేజ్‌లతోనే సరిపెడుతున్నారని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా గ్యాస్ బుకింగ్ కోసం అధికారిక నంబర్‌కు కాల్ చేసినప్పుడు, వెంటనే బుకింగ్ కన్ఫర్మేషన్ రావాలి. అయితే ప్రస్తుతం చాలా మంది వినియోగదారులకు మీ అభ్యర్థన అందింది, 24 గంటల్లో ప్రాసెస్ చేస్తాం అనే మెసేజ్‌లు మాత్రమే వస్తున్నాయి. తీరా 24 గంటలు గడిచినా బుకింగ్ నంబర్ రాకపోవడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.


## రాష్ట్రంలో 21.25 లక్షల జన్‌ధన్ ఖాతాలు బోగస్

**హైదరాబాద్, మార్చి 16, ప్రభాతవార్త :** కేంద్రం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జన్ ధన్ పథకానికి వివిధ బ్యాంకులు మోకాలడ్డుతున్నాయి. బోగస్ ఖాతాలకు అడ్డుకట్ట వేయడానికి కేంద్రం ప్రతీ బ్యాంకు జన్ ధన్ ఖాతాకు ఖాతాదారుడి ఆధార్ సంఖ్యను తప్పనిసరిగా అనుసంధానం చేయాలని గతంలోనే ఆదేశాలు జారీ చేసింది. ఈ విషయాన్ని మాత్రం కొన్ని బ్యాంకులు పట్టించుకోవడం లేదు. సంక్షేమ పథకాల సొమ్మును జన్‌ధన్ ఖాతాలకు ప్రత్యక్ష ప్రయోజన బదిలీ విధానంలో కేంద్రం జమ చేస్తోంది. అయితే తెలంగాణలో 21,24,728 జన్ ధన్ ఖాతాలకు ఆధార్ అనుసంధానం కాకపోవడంతో బోగస్ ఖాతాలను గుర్తించడం సాధ్యం కావడం లేదు.

## హామీల ఎగవేత డిక్లరేషన్‌లా గవర్నర్ ప్రసంగం

### ఏప్రిల్ 20 వరకు సమావేశాలు నిర్వహించాలి

### బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



**హైదరాబాద్, మార్చి 16, ప్రభాతవార్త:** బడ్జెట్ ఉభయ సభల సమావేశానుద్దేశించి గవర్నర్ చేసిన ప్రసంగం హామీల ఎగవేతల డిక్లరేషన్‌లా ఉందని, సర్కారు సొంత డబ్బాకే ప్రాధాన్యత ఇచ్చిందని బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వం తన బాధ్యతలను పూర్తి విస్మరించిన విషయంలో గవర్నర్ ప్రసంగంతో తేటతెల్లమైందన్నారు. రాష్ట్ర ప్రజలు రైతులు, కార్మికులకు భరోసా ఇచ్చేలా గవర్నర్ ప్రసంగం లేదని స్పష్టం చేశారు. గవర్నర్‌తో భ్రమలు, అవాస్తవాలు, అబద్దాలను ప్రభుత్వం చెప్పించిందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో అప్పులు, పరిష్కారం కాని సమస్యలు పేరుకుపోతున్నాయని, వాటిని పరిష్కరించేందుకు తీసుకుంటున్న చర్యలను గవర్నర్ ప్రసంగంలో ప్రభుత్వం వివరించలేదని దుయ్యబట్టారు. బిఎసి సమావేశం అనంతరం అసెంబ్లి మీడియా పాయింట్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బడ్జెట్ సమావేశాలను ప్రభుత్వం తూతూ మంత్రంగా నిర్వహించాలని నిర్ణయించిందని దుయ్యబట్టారు. ఈ నెల 30వరకే సమావేశాలు అంటే అందులో మూడు సెలవులు, రెండు ఆదివారాలు పోతే ఇక ఆరు లేదా ఏడు రోజులు మాత్రమే సభ జరగనుందన్నారు. ఫలితంగా అనేక ప్రభుత్వ పద్దులపై చర్చ ఉండబోదన్నారు. బడ్జెట్ పద్దులపై చర్చను ఎగవేసేందుకు హైడ్రా, జిహెచ్‌ఎంసి విభజన తదితర అంశాలపై ప్రభుత్వం చర్చ చేపట్టాలని నిర్ణయించిందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వ అప్పులు హిమాలయాలతో పోటి పడుతున్నాయని, అయినా ఆ అంశంపై ప్రభుత్వం ఎలాంటి చర్చకు అవకాశం ఇవ్వడం లేదని విమర్శించారు. బడ్జెట్ సమావేశాలను మార్చి తర్వాత ఎప్రిల్ నెలలోనూ 20 రోజులు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 30 శాతం నిధులు కేటాయించాలి

### ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్

**హైదరాబాద్, మార్చి 16, ప్రభాతవార్త:**రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులను కేటాయించాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ నెల 20న అసెంబ్లీలో ప్రవేశపెట్టే రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రజనీకాంత్, రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్య అనేది సమాజాభివృద్ధికి, దేశ భవిష్యత్తుకు మూలస్తంభం అయినప్పటికీ ప్రభుత్వాలు విద్యారంగాన్ని నిరక్ష్యం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణలో పాఠశాలల నుంచి యూనివర్సిటీల వరకు మౌలిక సదుపాయాల కొరత తీవ్రంగా ఉందని, అనేక విద్యాసంస్థల్లో భవనాలు, తరగతి గదులు, ల్యాబొరేటరీలు, లైబ్రరీలు, హాస్టళ్ల సరిపడా లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల పోస్టులు భారీగా ఖాళీగా ఉండటంతో విద్యాప్రమాణాలు దెబ్బతింటున్నాయన్నారు. ఇంజినీరింగ్, డిగ్రీ, పీజీ చదువుతున్న విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు రూ. 8,500 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీల్లో టీచింగ్ పోస్టులు భారీగా ఖాళీగా ఉన్నాయని, వాటిని తక్షణమే భర్తీ చేయాలని రజనీకాంత్, నాగరాజు డిమాండ్ చేశారు.

## కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతున్నా సర్కార్ చోద్యం

### మాజీమంత్రి హరీశ్‌రావు

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,మార్చి16: కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతున్న కాంగ్రెస్ సర్కార్ చోద్యం చూస్తుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. అసెంబ్లీలోని బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. రేవంత్ రెడ్డి ఆంధ్రాకు దాసోహమై తెలంగాణను చంద్రబాబుకు తాకట్టు పెట్టారని ఆరోపించారు. గోదావరి, బనకచర్లపై ఢిల్లీ మీటింగ్ మినిట్స్ వచ్చి నెల దాటినా అందులో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై రేవంత్ రెడ్డి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. మొద్దు నిద్ర వీడి నీటి హక్కులను కాపాడాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. లేఖల డ్రామాలు కట్టిపెట్టాలని సూచించారు. ఏపీ ప్రభుత్వం పోలవరం - నల్లమలసాగర్ ప్రాజెక్టు కట్టి తీరుతామని ఏపీ అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగంలో పేర్కొంటే, దీనికి దీటుగా సమాధానం చెప్పాల్సిన తెలంగాణ ప్రభుత్వం కనీసం పోలవరం - నల్లమలసాగర్‌ను అడ్డుకుంటాం, కృష్ణా - గోదావరిలో మక్క నీరు కూడా వదులుకోమని తెలంగాణ గవర్నర్ ప్రసంగంలో ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు.




### సినీనటి ప్రత్యూష ఆత్మహత్య కేసు

## నాంపల్లి కోర్టులో లొంగిపోయిన సిద్ధార్థరెడ్డి

హైదరాబాద్, మార్చి 16, ప్రభాతవార్త: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన సినీ నటి ప్రత్యూష ఆత్మహత్య కేసులో ఆమె ప్రియుడు సిద్దార్థ రెడ్డి సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సోమవారం నాడు నాంపల్లి కోర్టులో లొంగిపోయాడు. 2002 ఫిబ్రవరి నెల 23వ తేదీన ప్రత్యూషతో పాటు సిద్దార్థ రెడ్డి బేగంపేట్ వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించడం తెలిసిందే. వీరిని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించ గా వెంటనే ఆసుపత్రికి తరలించడం విదితమే. ఆసుపత్రిలో ప్రత్యూష చనిపోగా సిద్దార్థ రెడ్డి కోలుకున్నాడు. అయితే తన కుమార్తెది ఆత్మహత్య కా దని, ఆమెది హత్య అని ప్రత్యూష తల్లి సరోజిని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు కోర్టులో న్యాయ పోరాటం చేశారు. ఈ కేసులో ట్రయల్ కోర్టు విచారణ చేసి ప్రత్యూష ఆత్మహత్యకు సిద్దార్థ రెడ్డి కారకుడని, అందుకుగాను ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. దీనిని సిద్దార్థ రెడ్డి హైకోర్టులో సవాల్ చేయగా ఈ శిక్షను ధర్మాసనం రెండేళ్లకు తగ్గించింది. దీనిపైనా సిద్దార్థ రెడ్డి సుప్రీం కోర్టులో సవాల్ చేసి ఈ శిక్షను కూడా రద్దు చేయాలని కో రాడు. మరోవైపు సిద్దార్థ రెడ్డికి కఠిన శిక్ష వేయాలని ప్రత్యూష తల్లి సరోజిని కూడా సుప్రీం కోర్టును కోరారు. సిద్దార్థ రెడ్డి, సరోజిని పిటిషన్లపై సుప్రీం కోర్టులో సుదీర్ఘ కాలం విచారణ అనంతరం ఫిబ్రవరి 17వ తేదీన తీర్పు వెలువడింది. ఈ కేసులో సిద్దార్థ రెడ్డికి హైకోర్టు విధించిన శిక్షను సుప్రీం కోర్టు సమర్థించడంతో పాటు నాలుగు వారాల్లోగా అతను కోర్టులో లొంగిపోవాలని ఆదేశించింది. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు అమెరికాలో స్థిరప డ్డ సిద్దార్థ రెడ్డి 24 ఏళ్ల తరువాత భారత్‌కు వచ్చి నాంపల్లి కోర్టులో లొంగిపోగా పోలీసులు భద్రత మధ్య చంచల్‌గూడ జైలుకు తరలించారు.

### ప్రపంచ ధోరణులు, పరిశ్రమ అవసరాలకు

## అనుగుణంగా కొత్త కోర్సులు

### రైజింగ్ తెలంగాణ-2047 లక్ష్యంగా కోర్సుల రూపకల్పన

### కొత్త కోర్సుల బ్రోచర్‌ను విడుదల చేసిన ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి

హైదరాబాద్, మార్చి 16, ప్రభాతవార్త: అభివృద్ధి చెందుతున్న ప్రపంచ ధోరణులు, పరిశ్రమ అవసరాలతోపాటు యువత ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్రంలో కొత్త కోర్సులను ప్రారంభిస్తున్నట్లు ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో 2026–27 విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలో ప్రారంభించనున్న కొత్త యుజీ, పీజీ కోర్సులకు సంబంధించిన బ్రోచర్‌ను సోమవారం ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్మన్లు ప్రొఫెసర్ ఈ పురుషోత్తం, ఎస్‌కె మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్ బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ.. కొత్త విద్యా కార్యక్రమాలు తెలంగాణలో ఉన్నత విద్యను అభివృద్ధి చెందుతున్న ప్రపంచ ధోరణులు, పరిశ్రమ అవసరాలు, యువత ఆకాంక్షలకు అనుగుణంగా రూపొందించామని పేర్కొన్నారు. పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి, వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగాలలో భవిష్యత్ కెరీర్‌లకు విద్యార్థులను సిద్ధం చేయడానికి ఈ కార్యక్రమాలు విస్తృత దృక్పథంలో భాగం కానున్నాయని తెలిపారు.

కొత్తగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, ఫిన్‌టెక్, డిఫెన్స్ అండ్ సెక్యూరిటీ స్టడీస్, ఏవియేషన్ అండ్ ఎయిర్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, టూరిజం అండ్ హాస్పిటాలిటీ, హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్, బయోమెడికల్ సైన్సెస్, క్లైమేట్ సైన్స్, రూరల్ డెవలప్‌మెంట్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఇంటర్ డిసిప్లినరీ డొమైన్‌లలో సహా విస్తృత శ్రేణి అభివృద్ధి చెందుతున్న రంగాలను కవర్ చేస్తాయని తెలిపారు. తెలంగాణలో బలమైన విద్యా పునాదులను ఆవరణాత్మక, పరిశ్రమ ఆధారిత నైపుణ్యాలతో కలపడానికి రూపొందించబడ్డాయన్నారు. ప్రభుత్వం రైజింగ్ తెలంగాణ-2047, వికసిత్ భారత్-2047 జాతీయ ఆకాంక్షతో కొత్త కోర్సుల రూపకల్పన చేసినట్లు ఛైర్మన్ తెలిపారు. భవిష్యత్‌లో యువతకు అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలు, సామర్థ్యాలతో తెలంగాణ యువతను సన్నద్ధం చేయడమే లక్ష్యంగా పెట్టుకుందన్నారు. కొత్త కోర్సులుగా కోర్, ఫ్యూచర్, రేర్ మోడల్‌తో పట్టణ, పెరిఅర్బన్, గ్రామీణ దృక్పథాలను ఉన్నత విద్యలో అనుసంధానిస్తుందని తెలిపారు. క్రెడిట్ ఆధారిత కోర్సులు, ఫీల్డ్‌వర్క్, ప్రాజెక్టులలో విద్యార్థులు పాల్గొంటారు, కొత్త కోర్సులు విద్యార్థులకు అనుకూలమైన మూడు, నాలుగు సంవత్సరాల అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులతోపాటు బహుళ ప్రవేశ, నిష్క్రమణ ఎంపికలు ఉంటాయని తెలిపారు. విద్యార్థులు పూర్తిగాని కోర్సుకుండా తమ అధ్యయనాలను పాజ్ చేసి తిరిగి ప్రారంభించడానికి అనుమతించే అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్ వంటి అవకాశాలను కూడా కల్పించినట్లు బాలకిష్టారెడ్డి తెలిపారు. ఇంటర్న్‌షిప్‌లు, పరిశ్రమ ప్రాజెక్టులు, ఫీల్డ్‌వర్క్ లెర్నింగ్ ప్యాకేజ్‌లలో అంతర్భాగంగా ఉంటాయని తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి నేడు(మంగళవారం) మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు టి-సాట్‌లో ప్రత్యక్ష ప్రసారంలో పాల్గొంటారని తెలిపారు.

# అంగరంగ వైభవంగా 'ఆస్కార్' వేడుక

### ఉత్తమ చిత్రం: వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్‌కు ఆరు అవార్డులు

### ఉత్తమ నటుడుగా మైఖేల్ బి జోర్డాన్, ఉత్తమ నటిగా జెస్సీబక్లీ

### ఉత్తమ దర్శకుడిగా పాల్‌థామస్

లాస్‌ఏంజెల్స్, మార్చి 16: ప్రపంచ సినీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 98వ అకాడమీ అవార్డుల (ఆస్కార్ 2026) వేడుక అట్టహాసంగా నిర్వహించారు. లాస్‌ఏంజెల్స్‌లోని డాల్బీథియేటర్స్‌లో ఈ అవార్డుల బహూకరణ వేడుక జరిగింది. జాతీయ అంతర్జాతీయ చిత్రప్రముఖులు హాజరైన ఈ వేడుకల్లో ఈ ఏడాది ఉత్తమ చిత్రంగా "వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్" ఆస్కార్ పురస్కారాన్ని కైవసం చేసుకుంది. ఇదే చిత్రానికి దర్శకత్వం వహించిన పాల్ థామస్ అండర్సన్ ఉత్తమ దర్శకుడిగా, ఇందులో నటనకు గాను సీన్ పెన్ ఉత్తమ సహాయ నటుడిగా అవార్డులు గెలుచుకున్నారు. ఈ చిత్రానికి ఏకంగా వివిధ విభాగాల్లో ఆరు అవార్డులు దక్కాయి. "సిన్నర్స్"చిత్రంలో అద్భుత నటనకు మైఖేల్ బి జోర్డాన్ ఉత్తమ నటుడిగా నిలవగా, "హామ్నెట్" చిత్రానికి గాను జెస్సీ బక్లీ ఉత్తమ నటి అవార్డును అందుకున్నారు. వెపన్స్ చిత్రంలో నటనకు అమీ మడిగాన్ ఉత్తమ సహాయ నటిగా ఎంపికయ్యారు. ఈసారి పలు చిత్రాలకు అవార్డులు పంచుతూ జ్యూరీ సమ ప్రాధాన్యతనిచ్చింది. సిన్నర్స్ చిత్రం ఉత్తమ ఒరిజినల్ స్క్రీన్‌ప్లే, ఒరిజినల్ స్కోర్, సినిమాటోగ్రఫీ వంటి విభాగాల్లో పురస్కారాలు గెలుచుకుంది. మరోవైపు ఫ్రాంకెన్‌స్టైన్ చిత్రం ప్రొడక్షన్ డిజైన్, మేకప్ అండ్ హెయిర్‌స్టైలింగ్, కాస్ట్యూమ్ డిజైన్ విభాగాల్లో మూడు అవార్డులను సొంతం చేసుకుంది.

ఉత్తమచిత్రం...వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్
ఉత్తమ దర్శకుడుపాల్‌థామస్ అండర్సన్(వన్‌బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్)
ఉత్తమనటుడు : మైఖేల్ బి జోర్డాన్ (సినర్స్)
ఉత్తమ నటి : జెస్సీ బక్లీ (హామ్నెట్)
ఉత్తమ సహాయనటుడు: సీన్‌పెన్ (వన్‌బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్)
ఉత్తమ సహాయనటి: అమీ మడిగాన్ (వెపన్స్)
ఉత్తమ యానిమేటెడ్‌ఫీచర్: కేపాప్ డెమాన్ హంటర్స్
ఉత్తమ అంతర్జాతీయ ఫీచర్‌ఫిలిమ్: సెంటిమెంటల్ వ్యాల్యూ
ఉత్తమ డాక్యుమెంటరీ ఫీచర్: మిస్టర్ నోబడీ ఎగెనెస్ట్ పుతిన్
ఉత్తమ ఒరిజినల్‌స్క్రీన్‌ప్లే: ర్యాన్‌కూగ్లర్(సినర్స్)
ఉత్తమ అడాప్టెడ్ స్క్రీన్‌ప్లే: పాల్‌థామస్ అండర్సన్(వన్‌బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్)
ఉత్తమ సౌండ్: ఎఫ్1
ఉత్తమ విజువల్ ఎఫెక్ట్: అవతార్‌ఫ ఫైర్ అండ్ యాష్
ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్: ఫ్రాంకెన్‌స్టైన్



ఆస్కార్ ఉత్తమ చిత్రంగా ఎంపికైన వన్ బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్ చిత్ర దర్శకుడుపాల్‌థామస్,ఉత్తమ నటిజెస్సీ బక్లీ తదితరులు

ఉత్తమ కాస్ట్యూమ్‌డిజైన్: ఫ్రాంకెన్‌స్టైన్
ఉత్తమ మేకప్ హెయిర్‌స్టైలింగ్: ఫ్రాంకెన్‌స్టైన్
ఉత్తమ కాస్టింగ్: వన్‌బ్యాటిల్ ఆఫ్టర్ అనదర్
ఉత్తమ యానిమేటెడ్ షార్ట్‌ఫిల్మ్: ది గర్ల్ హూ క్రైడ్ పెర్ల్స్
ఉత్తమ డాక్యుమెంటరీ షార్ట్ ఫిల్మ్: ఆలిది ఎంప్టీరూమ్స్
ఉత్తమ లైవ్ యాక్షన్ షార్ట్‌ఫిల్మ్: ది సింగర్స్,టూ పీపుల్ ఎక్స్చేంజింగ్ సలైవా (జాయింట్ అవార్డు)

# రాష్ట్రంలోకి 13 ప్రఖ్యాత యుకె స్కూళ్ల క్యాంపస్‌లు

### వరల్డ్ క్లాస్ ఫెసిలిటీస్ కలిగిన హైదరాబాదుకే యుకె విద్యా సంస్థలు

### 18న రాష్ట్రంలో బ్రిటన్ ప్రతినిధి బృందం టూర్

### రాష్ట్ర ఉన్నతాధికారులు, యుకె ప్రతినిధులతో కీలక సమాలోచనలు

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,మార్చి16: దేశంలోనే అత్యద్భుతమైన వరల్డ్ క్లాస్ ఫెసిలిటీస్ కలిగిన హైదరాబాదు మహానగరానికే అంతర్జాతీయ సంస్థలు క్యూ కడుతున్నాయి. ఇదివరకు ఐటీ కంపెనీలు, బయో సంబంధిత సంస్థలు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీలు ఆసక్తి చూపుతుండగా... తాజాగా విద్యా సంస్థలు కూడా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు క్యూ కడుతున్నాయి. యునైటెడ్ కింగ్‌డమ్(యుకె)కు చెందిన 13 ప్రఖ్యాత పాఠశాలలు హైదరాబాద్ నగరంలో తమ క్యాంపస్‌ను ఏర్పాటు చేసేందుకు సుముఖత వ్యక్తం చేశాయి. ఈ మేరకు యుకె ప్రభుత్వం నుంచి తెలంగాణ సర్కారుకు గ్రీన్ సిగ్నల్ అందింది. అందులో భాగంగా యుకె డిపార్ట్‌మెంట్ ఆఫ్ బిజినెస్ అండ్ ట్రేడ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం..ఈనెల 18న రాష్ట్రంలో పర్యటించనుంది. ఈ సందర్భంగా స్థానిక ఉన్నతాధికారులతో యుకె ప్రతినిధులు కీలక సమాలోచనలు జరపనున్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంటు మేరకు అంతర్జాతీయ సంస్థలు రాష్ట్రంలోకి ఆహ్వానం పేందుకు ప్రజా ప్రభుత్వం తీవ్ర కసరత్తులు చేస్తున్నది.

ఈ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందంలో 13 యుకె స్కూళ్ళకు సంబంధించిన రిప్రజెంటేటివ్స్, యుకె ప్రభుత్వ అధికారులు పాల్గొననున్నారు. తెలంగాణలోకి రానున్న ప్రైవేటు విద్యా సంస్థలు, కేజీ టూ ప్లస్ 2 కరికులంలో అగ్రగామిగా పేరొందాయి. స్థానికంగా విద్యా శాఖ ఉన్నతాధికారులు, వివిధ శాఖలు మున్సిపల్, విద్యా, ఐటీ, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీకి చెందిన అధికారులు చర్చించనున్నారు. ఈ విషయంలో మరింత సమన్వయం, యుకె విద్యా సంస్థలు మన రాష్ట్రంలో ఏర్పాటు చేయబోయేటప్పుడు ఏ విధమైన టైమ్ లైన్‌ను నిర్దేశించుకుని వెళ్ళాలో చర్చలు సాగనున్నాయి. అయితే, యుకెకు సంబంధించిన విశ్వవిద్యాలయాలు సైతం తెలంగాణలో వారి క్యాంపస్‌లు ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలన్నీ ఒక కీలక దశకి చేరుకున్న విషయం విదితమే. ఈ క్యాంపస్‌లు ఎక్కడ పెట్టాలన్న దానిపై తెలంగాణ ప్రభుత్వ ఉన్నతాధికారులు సమగ్రంగా చర్చలు చేస్తున్నటికీ, మరోవైపు భారత్ ఫ్యూచర్ సిటీలో ఇప్పటికే ప్రత్యేకంగా ఒక ఎడ్యుకేషన్ జోన్‌లో వరల్డ్ క్లాస్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ ఏర్పాటు చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి అడుగులు పడుతున్నాయి.

## ఆస్కార్ ప్రపంచవేదికపై భారత్ కళాకారులకు నివాళి

### దక్షిణాదినుంచి కోటశ్రీనివాసరావు, బి.సరోజలకు దక్కిన అరుదైన గౌరవం

లాస్‌ఏంజెల్స్, మార్చి 26: ప్రపంచ సినీ రంగంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన వేదికగా గుర్తింపు పొందిన ఆస్కార్ అవార్డ్స్ సందర్భంగా భారతీయ సినీ పరిశ్రమకు అరుదైన గౌరవం దక్కింది. 98వ ఆస్కార్ వేడుకల సందర్భంగా అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ తమ అధికారిక వెబ్‌సైట్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నివాళి విభాగంలో భారతదేశానికి చెందిన నలుగురు దిగ్గజ కళాకారులను స్మరిస్తూ నివాళి అర్పించింది. 2025 - 2026 ఆస్కార్ వేడుకల మధ్య కాలంలో కన్నుమూసిన ప్రపంచవ్యాప్తంగా పలువురు ప్రముఖ సినీ కళాకారులను గుర్తుచేసుకుంటూ అకాడమీ 2025 మరియు 2026 ఆస్కార్ల మధ్య మనం కోల్పోయిన కళాకారులు, వెండితెర నిర్మాతలను స్మరించుకోవడానికి ఒక క్షణం కేటాయించండి" అనే సందేశంతో వారి ఫోటోలను ప్రదర్శించింది. నివాళి జాబితాలో తెలుగు సినీ పరిశ్రమకు గర్వకారణమైన విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు, బాలీవుడ్ హీ-మ్యాన్‌గా పాపులారిటీ దక్కించుకున్న ధర్మేంద్ర, దేశభక్తి కథాంశాలతో ప్రత్యేక గుర్తింపు పొందిన దర్శకుడు-నటుడు మనోజ్ కుమార్ దక్షిణాది వెండితెరలో తన అందం, అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ప్రముఖ నటి సరోజా దేవిలకు అకాడమీ నివాళి అర్పించింది. దశాబ్దాల పాటు భారతీయ సినిమాకు వీరు అందించిన సేవలను గుర్తిస్తూ ప్రపంచంలోనే అత్యున్నత సినీ వేదిక అయిన ఆస్కార్ ఈ విధంగా స్మరించుకోవడం ఎంతో గౌరవంగా భావిస్తున్నారు. ముఖ్యంగా కోట శ్రీనివాసరావు తన అసాధారణ నటనతో తెలుగు మరియు దక్షిణ భారత చిత్రసీమలో చెరగని ముద్ర వేశారు.

## వేం నరేందర్‌రెడ్డిని అభినందించిన సిఎల్పీ

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,మార్చి16:రాజ్యసభకు నూతనంగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డిని సోమవారం సిఎల్పీ సమావేశంలో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు.ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క,మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, రామచంద్రనాయక్ పాల్గొన్నారు.

## పోక్సో కేసులో నిందితునికి 20 యేళ్ల కఠిన కారాగార శిక్ష

హైదరాబాద్ (సరూర్‌నగర్), మార్చి 16, ప్రభాతవార్త: పోక్సో కేసులో నేరం రుజువుకావడంతో నిందితుడైన ఓ యువకునికి రంగారెడ్డి జిల్లా ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టు 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించారు. అదే విధంగా రూ.42 వేల జరిమానా విధించి బాధితు రాలికి రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని ఆదేశించింది. పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నెంబర్ 209/2024లో బిఎన్ సెక్షన్లు 376(2)(ఎన్)(ఎఫ్), 448,427, 506లు కింద జల్‌పల్లికి చెందిన ఆటో డ్రైవర్ మైత్రి అజయ్ (26)పై కేసులు నమోదు అయ్యాయి. మైనర్ బాలికపై లైంగిక దాడికి సంబంధించిన పోక్సో చట్టం కింద నమోదైన కేసులకు సంబంధించి విచారణ పూర్తి కావడంతో ఫాస్ట్ ట్రాక్ కోర్టు న్యాయమూర్తి కేసును వెలువరించారు. ఈ కేసును అప్పటి మహేశ్వరం ఏసిపి (ప్రస్తుత నాగర్‌కర్నూల్ డిఎస్‌పి) బి.శ్రీనివాస్, మరో ఏసిపి లక్ష్మీకాంత్‌రెడ్డి (ప్రస్తుత ఏసిపి హైదరాబాద్) విచారణ జరపగా కోర్టులో ప్రభుత్వం తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్లు శోభారాణి, పి.సత్యనారాయణలు సమర్థవంతంగా వాదనలు వినిపించారు.



శిక్ష ఖరారైన నిందితుడు

# బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయంలో ఏసిబి విచారణ

### అవినీతి అక్రమాల ఫిర్యాదులపై రంగంలో దిగిన అధికారులు

### ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాల పనులపై ఆరా

హైదరాబాద్ (సరూర్‌నగర్), మార్చి 16, ప్రభాతవార్త: అవినీతి అక్రమాల నేపథ్యంలో జిహెచ్ఎంసి పరిధిలోని బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం అవినీతి నిరోధక శాఖ విచారణ జరిపింది. ఇటీవల జరిగిన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పునర్విభజనలో భాగంగా కొత్తగా ఏర్పాటైన శంషాబాద్ జోనల్ పరిధి కిందకు వచ్చిన ఈ బడంగ్‌పేట్ సర్కిల్‌లో 15 మందితో కూడిన ఏసిబి బృందం విచారణకు వచ్చింది. జిహెచ్ఎంసిలో విలీనం అయ్యే ముందు బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌గా కొనసాగుతున్న సమయంలో అధికారం పనులు చేసినట్లు చూపించడం.. పనులు చేయకున్నా పెద్ద మొత్తంలో బిల్లులు పెట్టి భారీ ఎత్తున నిధులు మంజూరు చేయించి అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని వచ్చిన ఫిర్యాదులకు ఏసిబి స్పందించింది. చేయని పనులకు నిధులు దుర్వినియోగం చేయడమే కాకుండా ఇంకా మైనస్‌లో ఉన్న గ్రేటర్‌లో విలీనం అయిన తర్వాత కూడా మంజూరు కోసం జిహెచ్ఎంసి ఆమోదం కోసం పంపడంపై కూడా బడంగ్‌పేట్ సర్కిల్‌పై ఫిర్యాదులు వచ్చాయి. ఇంజనీరింగ్ విభాగంతో పాటు టౌన్ ప్లానింగ్ అవినీతి అక్రమాలపై ఫిర్యాదులు రాగా ఏసిబి హైదరాబాద్ సిటీ రేంజ్ డిఎస్‌పి గంగసాని శ్రీధర్ నేతృత్వంలో ఇన్స్‌పెక్టర్లు, పలువురు సిబ్బంది కలిపి మొత్తం 15



డిప్యూటీ కమిషనర్ సరస్వతిని విచారణ చేస్తున్న ఏసిబి అధికారులు

మందితో కూడిన బృందం బడంగ్‌పేట్ కార్పొరేషన్/సర్కిల్‌లో జరిగిన, జరుగుతున్న అవినీతి అక్రమాలపై నిగ్గు తేల్చడానికి రంగంలో దిగింది. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయానికి చేరుకున్న అవినీతి నిరోధక శాఖ అధికారులు విచారణను ప్రారంభించారు. కార్యాలయంలో ఉన్న డిప్యూటీ కమిషనర్ పి.సరస్వతిని ఆమె ఛాంబర్‌లోనే విచారణ జరిపారు. కాగా అవినీతి ఆరోపణలు ఉన్న టౌన్ ప్లానింగ్ విభాగానికి చెందిన ఏసిపి (అసిస్టెంట్ సిటీ ప్లానర్) పోసాని కిరణ్‌కుమార్‌కు ఏసిబి అధికారులు ఫోన్ చేయగా స్విచాఫ్‌లో ఉన్నట్లు గ్రహించారు. ఆయనను కార్యాలయానికి రప్పించడానికి అధికారులు ప్రయత్నాలు చేశారు. డిప్యూటీ కమిషనర్‌తో ఫోన్ చేయించినా ఏసిపి అందుబాటులోకి రాలేదు. అయితే బడంగ్‌పేట్‌లో జరిగిన భారీ అవినీతి అక్రమాలపై నిజా నిజాలు రాబట్టడానికి చేపట్టిన ఏసిబి విచారణ సుదీర్ఘంగా సాగింది. ఉదయం ప్రారంభమైన దర్యాప్తు సాయంత్రం వరకు కూడా కొనసాగుతూనే ఉండడం గమనార్హం.

### స్కీంల గురించి కాకుండా స్కాముల గురించే మాట్లాడించారు : మాజీ మంత్రి వేముల

# గవర్నర్‌తో అన్నీ అబద్ధాలే పలికించారు



హైదరాబాద్, మార్చి 16, ప్రభాతవార్త: తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో తొలిరోజు నూతన గవర్నర్ ప్రసంగంలో అబద్ధాలు పలికించారని మాజీ మంత్రి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఆరోపించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. గవర్నర్ ప్రసంగం మొత్తం డొల్ల అని, చిత్తు కాగితంతో సమానమని పేర్కొన్నారు. కొత్తగా వచ్చిన గవర్నర్ తో ఈ ప్రభుత్వం పచ్చి అబద్ధాలు చెప్పించింది. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన స్కీంల గురించి ప్రసంగంలో లేనే లేదని,ఉన్నవల్లా కాంగ్రెస్ స్కాముల గురించే ఉన్నాయన్నారు. ఉపప్రసంగంతో ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని, 6 గ్యారంటీలు, 420 హామీల పై స్పష్టత లేదన్నారు. మహిళలకు ఇస్తామన్న 2,500 గురించి ప్రస్తావన లేదని ,రెండేళ్ల నుంచి మహిళలను మోసం చేస్తూనే ఉన్నారని ఆరోపించారు.

**ఆరు గ్యారంటీల ప్రస్తావనే లేదు : ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి**

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆరు గ్యారెంటీ గురించి ప్రస్తావనే లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడికౌశిక్‌రెడ్డి ఆరోపించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూమొదటి వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేస్తామని హామీ ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లకు పైగా అవుతుంది. ఇచ్చిన హామీలపై గవర్నర్ ప్రసంగంలో ఉంటుందేమో అనుకున్నాం. కాని అఖాకే లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత మూడో బడ్జెట్ ప్రవేశ పెడుతుందని రైతు భరోసా 15 వేలు ఇస్తామని చెప్పి ఐదువరకు ఇవ్వలేదన్నారు. అలాగే రైతు భరోసా ఇస్తున్నాం, రైతుల అకౌంట్లో పడుతుంది, లేదో నాకు తెలియదని రేవంత్ రెడ్డి నిరక్ష్యంగా మాట్లాడారని ఆరోపించారు.

**అబద్ధాలు చెప్పినందుకు గవర్నర్ ఆలయాలకు వెళ్లాలి: బిఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్**

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలకు చట్ట బద్ధత కల్పించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ డిమాండ్ చేశారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగం ముగిసేంత వరకు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపామని వెల్లడించారు. అసెంబ్లీ సాక్షి గా ఆరు గ్యారెంటీలకు చట్ట బద్ధత కల్పిస్తామని కాంగ్రెస్ చెప్పిందని, అసెంబ్లీ దేవాలయం లాంటిది, దేవాలయం లాంటి అసెంబ్లీలో అబద్ధాలు చెప్పారని ఆరోపించారు.

**బిఆర్ఎస్ నేతలకు గవర్నర్‌పై గౌరవం లేదు**

**ప్రసంగాన్ని అడ్డుకోవడం సరికాదు: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

ప్రతిపక్ష బీఆర్ఎస్‌సభ్యులకు గవర్నర్ అంటే ఏమాత్రం గౌరవం లేదని, ఆయన విలువైన అంశాలు ప్రసంగిస్తుంటే అడ్డుకోవడం సరైన విధానం కాదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మండిపడ్డారు. సంక్షేమ పథకాలు చూసి ఓర్వలేక అవమానకరంగా ప్రవర్తించారని, ఆరు గ్యారెంటీలలో ఐదు అమలు అవుతున్నా ప్రజలను తప్పు దోవపట్టించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌వద్ద మాట్లాడుతూ దళితుస్సీ ముఖ్యమంత్రి చేస్తామని, మూడు ఎకరాల భూమి ఇస్తామని అమలు ఎందుకు చేయలేదని, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, 20 లక్షల మంది రైతులకు రుణ మాఫీ ఆ పార్టీ నేతలకు కనిపించడం లేదని ప్రశ్నించారు.

అసెంబ్లీ మీడియా పాయింట్

**ప్రజాసమస్యలపై స్పష్టమైన హామీ కనిపించలేదు: సిపిఐ శాసనసభ పక్ష నాయకులు కూనంనేని**

గవర్నర్ ప్రసంగంలో ప్రజల ప్రధాన సమస్యలపై స్పష్టమైన హామీలు కనిపించలేదని సిపిఐ శాసనసభ పక్ష నాయకులు కూనంనేని సాంబశివ రావు అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ గవర్నర్ ప్రసంగం మూడు భాషల్లో ఉన్నా, అందులో ప్రజల ప్రధాన సమస్యలపై స్పష్టమైన హామీలు లేవన్నారు. బడ్జెట్ సమావేశాలు ప్రజల సమస్యలకు పరిష్కారం చూపేలా ఉండాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలు



క్రింది స్థాయి వరకు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కాగితాల్లో మాత్రమే నిధులు మంజూరు అవుతున్న కింది స్థాయిలో అమలు కావడం లేదన్నారు. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న వ్యవసాయ సంక్షోభం, సాగునీటి సమస్యలు వంటి కీలక అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

**బడ్జెట్ సమావేశాలను కుదించాలని ప్రభుత్వం యత్నం**

**బిజెఎల్పి నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి**

బీఏసి సమావేశంలోనే ప్రభుత్వ బాధ్యతారహితమైన ఆలోచన విధానం బయటపడిందని బిజెఎల్పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ సెలవులు మినహా కేవలం ఐదు లేదా ఆరు రోజుల్లోనే బడ్జెట్ సమావేశాలు నిర్వహించి ముగించాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ప్రజా సమస్యలపై చర్చ జరగకుండా ఉండేందుకు పథకం ప్రకారమే సమావేశాల రోజులను తగ్గించే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపించారు.

**నిరుద్యోగ యువతను నిరాశలోకి నెట్టారు: బిజెపి ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ**

నిరుద్యోగ యువతను ప్రభుత్వం నిరాశలోకి నెట్టిందని బిజెపి ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా నిధుల విడుదలలో జాప్యం జరుగుతోందన్నారు. రెండు లక్షల ఉద్యోగాల భర్తీపై ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు.

# విజయ నెయ్యిపై ఆగని దుమారం

## ఏపి మంత్రి లోకేష్‌కు టిజి విజయ డెయిరీ చైర్మన్ ఘాటు రిప్లై

**హైదరాబాద్, మార్చి 16, ప్రభాతవార్త** ఆంధ్ర విజయ డెయిరీ నెయ్యిపై రెండు రాష్ట్రాల మధ్య దుమారం ఆగడం లేదు. తెలంగాణలోని ఏపి విజయ బ్రాండ్ అంశంపై ఏర్పడిన కల్తీ వివాదంపై విచారణ జరిపిస్తామన్న ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్ ప్రకటనపై తెలంగాణ స్టేట్ డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ ఘాటుగా స్పందించారు. ఈ మేరకు అమిత్ రెడ్డి, ఏపీ మంత్రికు సోమవారం సుదీర్ఘమైన విజ్ఞప్తిచేశారు. ఆంధ్రప్రదేశ్ డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ అనుసరిస్తున్న విధానాలు వినియోగదారులను తప్పుదోవ పట్టిస్తేలా ఉన్నాయని ఆయన ఆరోపించారు. విజయా బ్రాండ్ పేరుతో మోసం చేస్తున్నారని అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణలో విజయ తెలంగాణ పేరుతో ప్రభుత్వం స్వయంగా రైతుల నుంచి పాలను సేకరించి, ప్రాసెసింగ్ చేసి విక్రయిస్తుండగా, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆంధ్ర ఫెడరేషన్ వద్ద సొంతంగా పాల సేకరణ గానీ, చిల్లింగ్ సెంటర్లు గానీ, ప్రాసెసింగ్ యూనిట్లు గానీ లేవని ఆయన గుర్తు చేశారు. కేవలం విజయ అనే బ్రాండ్ పేరును ప్రైవేట్ వ్యక్తులకు ఫ్రాంఛైజ్ పద్ధతిలో కట్టబెట్టారన్నారు. ఆ ప్రైవేట్ ఆపరేటర్లు ఎక్కడో సేకరించిన పాలను విజయ బ్రాండ్ పేరుతో విక్రయిస్తూ వినియోగదారులను నమ్మిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇక కృష్ణా, కర్నూలు, నెల్లూరు వంటి జిల్లాల్లో మ్యాక్స్ చట్టం కింద నమోదైన జిల్లా యూనియన్లు తమ పరిధిని దాటి విజయ బ్రాండ్‌ను వాడుతున్నాయని ఆరోపించారు. ఆయా జిల్లాల పరిధులు దాటి ఈ బ్రాండ్‌ను మార్కెటింగ్ చేయడం నిబంధనలకు విరుద్ధమని ఆయన స్పష్టం చేశారు. ప్రైవేట్ సంస్థలు విజయ బ్రాండ్ వాడుతూ ఆంధ్రప్రదేశ్ డెయిరీ క్వాలిటీ ప్రొడక్ట్ అని ప్రచారం చేసుకోవడం వల్ల సామాన్య ప్రజలు అది ప్రభుత్వ ఉత్పత్తే అని మోసపోతున్నారని ఆయన విమర్శించారు. కాగా ప్రధాని మోదీ ఆశించిన ఒకే దేశం, ఒకే మార్కెట్ స్ఫూర్తికి ఏపీ ప్రభుత్వం చేస్తున్న ఈ ప్రైవేట్ ఫ్రాంఛైజీ ఒప్పందాలు విరుద్ధమని వ్యాఖ్యానించారు. వెంటనే ఈ ప్రైవేట్ ఒప్పందాలను రద్దు చేయాలని, అనధికారికంగా విజయ బ్రాండ్‌ను వాడుతున్న జిల్లా యూనియన్లపై చర్యలు తీసుకోవాలని ఏపీ మంత్రి లోకేష్‌కు విజ్ఞప్తి చేశారు. ఇలాంటి దిద్దుబాటు చర్యల వల్లనే సహకార రంగం బలోపేతం అవుతుందని, కల్తీ పాలను అరికట్టవచ్చని ఆయన సూచించారు.

## కాంగ్రెస్ నుంచి జీవన్‌రెడ్డి వెళ్లిపోవాలని ఎవరూ కోరుకోవడం లేదు: ఎమ్మెల్యే సంజయ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మార్చి16:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి పార్టీ నుంచి వెళ్లిపోవాలని ఎవరూ కోరుకోవడం లేదని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గతంలో తాను ఎల్ రమణతో కలిసి పనిచేశానని, ఇప్పుడు జీవన్ రెడ్డితో కూడా కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నానని అన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో ఎల్ రమణ వంటి వారికి మంత్రి పదవి ఇవ్వాల్సిందని అభిప్రాయపడ్డారు. అలాంటి తప్పిదాల వల్లనే బీఆర్‌ఎస్ తిరిగి అధికారంలోకి రాలేదని అన్నారు.గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన సంజయ్ కుమార్ కాంగ్రెస్ పార్టీకి దగ్గరయ్యారు. అభివృద్ధి పనుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నట్లు తెలిపారు. సంజయ్ కుమార్ కాంగ్రెస్ పార్టీకి దగ్గరైనప్పటి నుంచి పార్టీ సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి తీవ్ర అసంతృప్తితో ఉంటున్నట్లు తెలుస్తోంది. కొన్ని రోజుల క్రితం జరిగిన మున్సిపల్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తీరుపై జీవన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పటి నుంచో పార్టీలో ఉన్న తన వర్గానికి తక్కువ సీట్లు ఇచ్చి, సంజయ్ కుమార్ వర్గానికి ఎక్కువ టికెట్లు కేటాయించారని ఆరోపించారు. ఈ క్రమంలో జీవన్ రెడ్డి త్వరలో కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి, బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ ప్రచారం నేపథ్యంలో సంజయ్ కుమార్ పైవిధంగా స్పందించారు.

## బ్రాహ్మణులను వాడుకొంటున్న బిజెపి

### ఎమ్మెల్యే మందుల సామెలు

**హైదరాబాద్,మార్చి 16,ప్రభాతవార్త:** బ్రాహ్మణులను వాడుకొంటూ బిజెపి రాజకీయాలు చేయడం తగదని మందుల సామెలు ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. బ్రాహ్మణులపై చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే మందుల సామెలు విచారం వ్యక్తం చేశారు.బ్రాహ్మణులను నేను ఏం అనలేదని నా వ్యాఖ్యల వల్ల బాధ పడితే విచారం వ్యక్తం చేస్తున్నానంటూ సంజాయిషీ ఇచ్చుకున్నారు. నా మాటల వల్ల బాధపడితే ఆ పదాలను వెనక్కి తీసుకుంటున్నానని తెలిపారు. బిజెపి మిమ్మల్ని వాడుకొని రాజకీయం చేస్తోందని ఆయన పేర్కొన్నారు.ఈ విషయం బ్రాహ్మణులు అర్థం చేసుకోవాలి అని కోరారు.

## అంగన్‌వాడీ నేతలపై పోలీసులు అమానుషంగా ప్రవర్తించారు

### - 23న కలెక్టరేట్ల ముట్టడికి సంపూర్ణ మద్దతు - సిపిఐఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

**హైదరాబాద్, ప్రభాతవార్త, మార్చి 16:** తమ సమస్యల పరిష్కారానికి ఆందోళనబాట పట్టిన అంగన్‌వాడీ నేతలపై పోలీసులు అమానుషంగా వ్యవహరించారని సీపీఐఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మండిపడ్డారు. ఈ నెల 23న అంగన్‌వాడీలు చేపట్టనున్న కలెక్టరేట్ల ముట్టడికి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్టు వెస్లీ సోమవారం తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు తమ న్యాయమైన హక్కుల కోసం చేస్తున్న పోరాటాన్ని అణచివేయడానికి ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ విధానాలను రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు. సోమవారం తలపెట్టిన చలో అసెంబ్లీ, ఇందిరాపార్కు ధర్నాకు వస్తున్న మహిళా కార్యకర్తలను అర్ధరాత్రి వేళ అరెస్టులు చేయడం ప్రభుత్వ అరాచకత్వానికి నిదర్శనమని విమర్శించారు. అంబర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో అరెస్టయిన నాయకులను పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. జయలక్ష్మి, జి. కోశాధికారి మంగమ్మలను వారి నివాసాల వద్ద పదుల సంఖ్యలో పోలీసులు వచ్చి అర్ధరాత్రి అరెస్టు చేయడం అన్యాయమన్నారు. వారితో పాటు ఈ ఉద్యమానికి సహకరిస్తున్న సీఐటీయూ నాయకులను కూడా అక్రమంగా నిర్బంధించారని విమర్శించారు. రాత్రి వేళల్లో మహిళా నేతలను పోలీస్ స్టేషన్లకు తరలించి, కనీస వసతులు కల్పించకుండా కింద పడుకోవాల్సిన పరిస్థితి కల్పించడం అత్యంత దారుణమన్నారు. వారి ఫోన్లను బలవంతంగా లాక్కొని, కుటుంబ సభ్యులకు కూడా సమాచారం ఇచ్చే అవకాశం ఇవ్వకుండా మానసిక వేధింపులకు గురిచేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం అంగన్‌వాడీలకు కనీసం రూ.18,000 వేతనం వెంటనే చెల్లించాలని, ఈ బడ్జెట్ సమావేశాల్లోనే వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విధానాల వల్ల అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వీర్యమయ్యే ప్రమాదం ఉందని, వాటిని రక్షించుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. సోమవారం అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, గతంలో అంగన్‌వాడీలపై అరాచకాలకు పాల్పడిన ప్రభుత్వాలే గద్దె దిగాల్సిన పరిస్థితి వచ్చిందని జాన్‌వెస్లీ గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా అలాంటి స్థితి తెచ్చుకోవద్దని హెచ్చరించారు. ప్రభుత్వ నిర్బంధాలను నిరసనగా అంగన్‌వాడీ యూనియన్ ఈ నెల 23 నాటి రాష్ట్రవ్యాప్త కలెక్టరేట్ల ముట్టడి పిలుపునకు సీపీఐ(ఎం) సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని తెలిపారు. వెంటనే అరెస్టు చేసిన వారిని విడుదల చేసి, ప్రభుత్వం వారిని చర్చలకు పిలవాలని,.. లేనిపక్షంలో తమ పార్టీ ప్రత్యక్ష ఆందోళనలకు పూనుకుంటుందని జాన్ వెస్లీ హెచ్చరించారు.

# హిందూ సమాజాన్ని కించపరచడం కాంగ్రెస్ రాజకీయ సంస్కృతిలో భాగం

## బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప

**హైదరాబాద్, మార్చి 16 ప్రభాతవార్త:** హిందూ సమాజాన్ని కించపరచడం, వారి విశ్వాసాలను దెబ్బతీయడం కాంగ్రెస్ రాజకీయ సంస్కృతిలో భాగంగా మారిందని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప అన్నారు. సోమవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ సనాతన హిందూ ధర్మాన్ని కించపరిచే విధంగా బహిరంగ వేదికపై ఎమ్మెల్యే మందుల సామేల్ చేసిన వ్యాఖ్యలపై యావత్ హిందూ సమాజం తీవ్ర ఆగ్రహంతో మండిపడుతుందన్నారు. సామేల్ చేసిన వ్యాఖ్యలు కోట్లాది మంది విశ్వాసాలను అవమానించేలా ఉన్నాయన్నారు. మందుల సామేల్ బేసిక్‌గా హిందువు కాదు. ఆయనకు సనాతన ధర్మం పట్ల మాట్లాడే అర్హత లేదన్నారు. దళితుడిగా చెలామణి అవుతూ, రిజర్వేషన్ కోటాలో ఎమ్మెల్యేగా గెలిచి, సనాతన ధర్మంపై దుర్మార్గంగా, అవమానకరంగా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. తుంగతుర్తి నియోజకవర్గంలో మాట్లాడిన మాటలపై మండిపడుతూ ఇప్పటికే అనేక ప్రాంతాల్లో ప్రజలు మందుల సామేల్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్నారన్నారు. ఇది ప్రజల్లో నెలకొన్న తీవ్ర అసహనానికి నిదర్శనం అన్నారు ఇది కాంగ్రెస్ పార్టీకి కొత్త కాదు. హిందువులను కించపరచడం, హిందూయేతర మతాలను భుజాన ఎక్కించుకోవడం కాంగ్రెస్‌కు మొదటినుంచి వెన్నతో పెట్టిన విద్య అన్నారు. ఇది కేవలం మందుల సామేల్ ఒక్కరి వైఖరి కాదు. రాహుల్ గాంధీ నుంచి మొదలుకొని స్థానిక నాయకుల వరకు అదే తంతు కొనసాగుతుందన్నారు. మొన్నటికి మొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ప్రజలు ఇంకా మరిచిపోలేదు. ఇప్పుడు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు వరుసగా హిందూ సమాజంపై విరుచుకు పడుతున్న తీరు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నదన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి, కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామేల్ చేసిన వ్యాఖ్యలకు గాను ఆయనతో బహిరంగ క్షమాపణ చెప్పించాలన్నారు. మందుల సామేల్ చేసిన వ్యాఖ్యలు యావత్ సమాజాన్ని అగౌరవపరచడమే కాకుండా, దుర్మార్గం, దారుణం అమానవీయమైనదిగా ఉన్నాయి. ఇది యావత్ సమాజాన్ని కాంగ్రెస్ ఎమ్మెల్యే అగౌరవపరిచిన ఘటన అన్నారు. అత్యంత దుర్మార్గం, దారుణంగా హిందూ సమాజ విశ్వాసాలను, సనాతన ధర్మాన్ని అవమానించేలా మాట్లాడారు. ఇలాంటి వ్యాఖ్యలను సమాజం చూస్తూ ఊరుకోదు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి చోట మందుల సామేల్‌కు వ్యతిరేకంగా, కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా తీవ్ర నిరసన వ్యక్తమవుతుందని మేము స్పష్టంగా హెచ్చరిస్తున్నాం.కాంగ్రెస్ పార్టీ తరతరాలుగా ఇదే ధోరణిని అవలంభిస్తుందన్నారు.

# కాంట్రాక్టర్లకు దోచి పెట్టేలా మోడీ కొత్త చట్టం

## ప్రధాని తెచ్చిన రామ్ జీ చట్టంతో గ్రామ స్వరాజ్యం వినాశనం :పిసిసి అధ్యక్షురాలు షర్మిల



**ఆముదాలవలస/రణస్థలం (శ్రీకాకుళం జిల్లా), మార్చి 16 ప్రభాతవార్త :** మోడీ తెచ్చిన గ్రామజీ చట్టంతో గ్రామ స్వరాజ్యం వినాశనం చేస్తోందని, ఈ చట్టం కాంట్రాక్టర్లకు దోచి పెట్టేలా మోడీ కొత్త చట్టం చేశారని రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు షర్మిలా రెడ్డి అన్నారు. సోమవారం శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస మండలంలోని కొర్లకోట గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో మాటా మంతి కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ 125 రోజులు పని కల్పన పచ్చి అబద్ధమని సగటున 52 రోజులు పని కల్పించలేకపోయారని అన్నారు. గ్రామాలకు హాని చేసే చట్టానికి చంద్రబాబు, పవన్ మద్దతు తెలపడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. రాష్ట్ర హక్కులపై మోడీ కాలర్ పట్టుకుంటా అని చెప్పిన జగన్ మోదీకి బానిసగా మారారని అన్నారు. ముగ్గురు కలిసి ఆంధ్ర రాష్ట్ర ఆత్మగౌరవాన్ని మోడీ కాళ్ల దగ్గర తాకట్టు పెట్టారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అధికారంలో వచ్చిన వెంటనే మన్రేగా చట్టాన్ని పునరుద్ధరిస్తాం. 150 రోజులకు పని దినాలను పెంచుతామని అన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని బీజేపీ నిర్వీర్యం చేసిందని, గాంధీ పేరు తొలగించడం దారుణమన్నారు. పేద ప్రజల పొట్టగొట్టే చట్టం మన్రేగా చట్టానికి గ్రామ్ జి చట్టానికి నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని అన్నారు. మన్రేగా చట్టం కింద పనుల నిర్ణయాధికారం గ్రామసభలది, మోడీ తెచ్చిన కొత్తచట్టంలో పనులు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు.గ్రామాల్లో ఏం పనులు చేయాలో ఢిల్లీలో కూర్చున్న వాళ్లకు ఏం తెలుస్తుందని అన్నారు. 40 శాతం నిధులు రాష్ట్రంపై మోపడం ఏపీ భరిస్తుందా, గ్రామ్ జి చట్టం రాష్ట్రానికి 5 వేల కోట్ల భారం గ్రామ్ జి చట్టంతో రాష్ట్రంపై భారం పడుతుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు మద్దతు ఇవ్వడం దుర్మార్గం అని అన్నారు. ఇప్పటికే రాష్ట్రం 12 లక్షల కోట్ల అప్పుల్లో ఉందని, అప్పుల రాష్ట్రంలో ఉపాధికి 5 వేల కోట్లు కేటాయిస్తారా అని ప్రశ్నించారు. చట్టానికి మద్దతు ఇచ్చి మోడీ దగ్గర నిధులు ఇవ్వాలని ఎందుకు దేహి అంటున్నారని మండిపడ్డారు. మోదీ చట్టానికి జగన్ సైతం వ్యతిరేకించడం లేదని,జగన్ సైతం మోదీకి బానిస, కీలు బొమ్మగా మారారని అన్నారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన, వైసీపీ పార్టీలు మోదీకి గులాం గిరి చేసే పార్టీలుగా తయారయ్యారని అన్నారు. కేంద్రంలో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో వస్తే మార్పు వస్తుందని,కాంగ్రెస్ అధికారంలో వస్తే రాష్ట్రం బాగుపడుతుంది.



# టీమ్ ఇండియా ఆటగాడు తిలక్‌వర్మను సన్మానించిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,మార్చి16:** టీమ్ ఇండియా ఆటగాడు తిలక్ వర్మ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని సోమవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. టి-20 ప్రపంచ కప్2026 గెలుచుకుని హైదరాబాద్‌కు విచ్చేసిన సందర్భంగా సీఎంను తిలక్ వర్మ కలిశారు. ఈ సందర్భంగా తిలక్ వర్మను సిఎం సత్కరించి అభినందించారు.ఈ కార్యక్రమంలో మంత్రులు వాకిటి శ్రీహరి, అజారుద్దీన్, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, ఎండీ సోనీ బాలాదేవి పాల్గొన్నారు.

# సినీ ఆర్టిస్టులు ప్రజాప్రతినిధులు 90రోజులకు ఒకసారి డ్రగ్ టెస్ట్ చేయించుకోవాలి

### - డ్రగ్ టెస్టు చేయించుకొన్న సినీనటుల సినిమాలు విడుదల చేయాలి
### - అసెంబ్లీ లాబీలో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఇష్టాగోష్టి

**హైదరాబాద్, మార్చి 16,ప్రభాతవార్త:** డ్రగ్స్ మూలాలు సినిమా ఇండస్ట్రీలోనే ఎక్కువగా ఉన్నాయని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఆరోపించారు. కేవలం సినీ ఆర్టిస్టులే కాకుండా, ప్రజాప్రతినిధులు కూడా ప్రతి 90 రోజులకు ఒకసారి తప్పనిసరిగా డ్రగ్స్ టెస్ట్ చేయించుకోవాలని డిమాండ్ చేశారు.అసెంబ్లీ లాబీలో విలేఖరులతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ ఎవరైతే డ్రగ్స్ తీసుకొంటారో వారి సినిమాల విడుదలకు బ్రేక్ వేయాలనీ సలహా ఇచ్చారు.సినీ నటీనటులు డ్రగ్స్ టెస్ట్ చేయించుకున్న తర్వాతే వారి సినిమాలు విడుదల కావాలన్నారు. ఒకవేళ టెస్ట్‌లకు నిరాకరించిన పక్షంలో సినిమాల విడుదలను వెంటనే నిలిపివేయాలని కామెంట్ చేశారు. డ్రగ్స్ టెస్టుల విషయంలో రాజకీయ నాయకులు మినహాయింపు కోరకూడదని ఆయన అన్నారు. ఒకవేళ పొలిటీషియన్స్ టెస్ట్ చేయించుకోవడానికి నిరాకరిస్తే వారిపై పలు అనుమానాలు తలెత్తుతాయని అభిప్రాయపడ్డారు. డ్రగ్స్ టెస్ట్ చేయించుకోని ప్రజాప్రతినిధులను అసెంబ్లీలోకి కూడా అనుమతించకూడదని సంచలన ప్రతిపాదన చేశారు. డ్రగ్స్ ఫ్రీ స్టేట్‌గా తెలంగాణ తయారు కావాలంటే ఇలాంటి కఠిన నిబంధనలు అమలు చేయాల్సిన అవసరం ఉందని అనిరుధ్ రెడ్డి అన్నారు.

## దళితులను స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్న సామేల్: మాజీ ఎంపి వెంకటేశ్ నేత

**హైదరాబాద్, మార్చి 16 ప్రభాతవార్త** దళిత ముసుగులో ఉండి దళితుల హక్కులను స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగించుకునే వ్యక్తిగా సామేల్ వ్యవహరిస్తున్నారని మాజీ ఎంపి వెంకటేశ్ నేత అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామేల్ చేసిన వ్యాఖ్యల వెనుక రాజకీయ దురుద్దేశం ఉందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డైరెక్షన్, పిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ప్రణాళికలో భాగంగానే ఆయన ఈ వ్యాఖ్యలు చేసినట్లుగా అర్థమవుతుందన్నారు. ఉద్యమకారుడినని చెప్పుకుంటూ, దళిత పేరుతో రాజకీయ ప్రయోజనం పొందడం తప్ప సమాజానికి చేసిన సేవ ఏమీలేదు. కాంగ్రెస్ పార్టీ చరిత్రను చూస్తే మొదటి నుంచీ దళిత వ్యతిరేక పార్టీ, హిందూ వ్యతిరేక పార్టీ అని స్పష్టమవుతుందన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్వయంగా రాసిన రచనల్లో కాంగ్రెస్ పార్టీ దళితుల పట్ల ఎలా వ్యవహరించిందో స్పష్టంగా చెప్పారు. దళితులకు నిజమైన గౌరవం, ప్రాతినిధ్యం, హక్కులు కల్పించిన పార్టీ భారతీయ జనతా పార్టీ మాత్రమే అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కింది. వృద్ధాప్య పెన్షన్ పెంపు, మహిళల ఖాతాల్లో ఆర్థిక సహాయం, ఇందిరమ్మ ఇళ్లు, దళిత సంక్షేమానికి సంబంధించిన అనేక హామీలు ఇచ్చింది. కానీ ఏ ఒక్కటి పూర్తిస్థాయిలో అమలు చేసిన దాఖలాలు లేవున్నారు.

# పెరుగుతున్న డిమాండ్ పట్ల అప్రమత్తం

## దక్షిణ విద్యుత్ పంపిణీ సిఎండి జితేష్


**హైదరాబాద్, మార్చి 16, ప్రభాతవార్త** వేసవి సీజన్ ప్రభావం, సాగు నీటి వినియోగంతో రోజురోజుకు విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరుగుతోందని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సిఎండి జితేష్ అన్నారు. దీనికి తగ్గట్టుగా అప్రమత్తంగా వుంటూ విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. వికారాబాద్ జిల్లా పరిధిలోని పరిగిలో సోమవారం పర్యటించి ట్రాన్స్‌ఫార్మర్ రిపేరింగ్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల పనితీరు, నిర్వహణపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ పరిధిలో ఈ నెల 13వ తేదీన గరిష్ట విద్యుత్ డిమాండ్ 11,318 మెగావాట్లకు చేరుకోగా, అదే రోజున విద్యుత్ వినియోగం 222.34 మిలియన్ యూనిట్లకు నమోదైందన్నారు. ఈ నెల చివరి వారానికి విద్యుత్ డిమాండ్ 12 వేల మెగావాట్లకు చేరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగినట్లు తెలిపారు. పెరిగే అదనపు డిమాండ్‌ను తట్టుకునేందుకు డిస్కం పరిధిలో దాదాపు 5 వేల ట్రాన్స్‌ఫార్మర్లను మంజూరు చేసినట్లు తెలిపారు. అందులో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు 3 వేలకుపైగా ట్రాన్స్‌ఫార్మర్లను కేటాయించినట్లు వెల్లడించారు. ప్రతి సెక్షన్ పరిధిలో తగినంత స్థాయిలో డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్ రోలింగ్ స్టాక్ తప్పనిసరిగా అందుబాటులో ఉంచుకోవాలని స్పష్టం చేశారు.

ఎక్కడైనా ట్రాన్స్‌ఫార్మర్ పనిచేయడం లేదని ఫిర్యాదు అందిన వెంటనే ఆ స్థానంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని, ఈ విషయంలో సాగుదారులపై అదనపు భారం మోపకూడదని స్పష్టం చేశారు.

# స్త్రీనిధి నిధుల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

### అవినీతి ఆరోపణలపై సమగ్ర విచారణ
### కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం
### రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రి సీతక్క

**హైదరాబాద్, మార్చి 16, ప్రభాతవార్త:** స్త్రీ నిధి నిధులను వ్యక్తిగత అవసరాలకు వినియోగించినట్లు నిర్ధారణ అయితే సంబంధిత సిబ్బంది, అధికారులు, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క హెచ్చరించారు. స్త్రీనిధి సంస్థ పేద మహిళలకు ఆర్థికంగా అండగా నిలుస్తూ వేలాది కుటుంబాల జీవనోపాధిని మెరుగుపరుస్తోందని గుర్తు చేశారు. మహిళలు ఆర్థికంగా బలపడితేనే సమాజ అభివృద్ధి సాధ్యమని, ఇందిర మహిళా శక్తి వంటి కార్యక్రమాల ద్వారా మహిళలను ఆర్థికంగా ఎదిగేలా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వంపలు కార్యక్రమాలు అమలు చేస్తోందని చెప్పారు. ఈ మేరకు సచివాలయంలో సోమవారం స్త్రీనిధి సంస్థ కార్యకలాపాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. స్త్రీనిధి ద్వారా మహిళా స్వయం సహాయక సంఘాలకు అందుతున్న రుణ సదుపాయాలు, వాటి పంపిణీ, తిరిగి చెల్లింపుల పరిస్థితి, సంస్థ పురోగతి తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల వెలుగు చూసిన స్త్రీనిధి అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి పూర్తి నివేదిక సమర్పించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. స్త్రీనిధి కార్యకలాపాలు మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా కొనసాగాలని నిర్దేశించారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో సంస్థపై తప్పుడు ప్రచారాలు జరిగితే వాటిని తక్షణమే ఖండిస్తూ సరైన సమాచారం ప్రజలకు అందించాలని ఆదేశించారు. గ్రామ, పట్టణస్థాయిలో రుణాలు, రికవరీ నిధుల దుర్వినియోగం జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కాగా.. సమీక్షలో మంత్రికి అధికారులు వివరించిన మేరకు.... గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో స్త్రీనిధి ద్వారా రూ.1947 కోట్ల రుణాలు పంపిణీ చేయగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో ఇప్పటికే రూ.2064 కోట్ల రుణాలు మహిళా సంఘాలకు అందజేశారు. తక్కువ సిబ్బంది ఉన్నప్పటికీ రుణ ప్రణాళికలో దాదాపు 90 శాతం లక్ష్యాన్ని సాధించినట్లు మంత్రికి వివరించారు. గత సంవత్సరం 78 శాతం రికవరి సాధించగా, ప్రస్తుత సంవత్సరం 72 శాతం రికవరి నమోదైందని, సెర్ప్ , మెప్మా సిబ్బంది సమన్వయంతో 85 శాతం రికవరి లక్ష్యంతో క్షేత్రస్థాయిలో చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు.



సచివాలయంలో సోమవారం స్త్రీనిధి సంస్థ కార్యకలాపాలపై సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న మంత్రి సీతక్క

## రాష్ట్రంలో గృహావసరాలకు గ్యాస్ కొరత లేదు

**సచివాలయం,మార్చి 16,ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఎల్పీజీ గ్యాస్ వినియోగదారులు ఆందోళన చెందాల్సిన పరిస్థితి లేదని,పుకార్లు నమ్మి గ్యాస్ బుకింగ్‌ల కోసం ఏజెన్సీల వద్ద క్యూలు కట్టవద్దని రోజువారి సగటు కంటే ఎక్కువ గ్యాస్ సిలిండర్లు గృహ వినియోగదారులకు అందిస్తున్నామని పౌర సరఫరాలు ఆహారం మరియు వినియోగదారుల వ్యవహారాల శాఖమంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.

రాష్ట్రంలో గ్యాస్ సరఫరాపై ముఖ్యమంత్రి నిర్వహించిన సమీక్షా సమావేశం వివరాలను మంత్రి నాదెండ్ల మనోహర్ సచివాలయంలోని ప్రచార విభాగంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు.

# రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల మెరుగుదలపై చర్చ

## సిఎం రేవంత్‌రెడ్డితో ప్రముఖ ఆర్థికవేత్త సుబ్రమణియన్ భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, మార్చి16:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డితో ప్రముఖ భారత ఆర్థికవేత్త అర్వింద్ సుబ్రమణియన్ సోమవారం మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు.ఈభేటిలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అసెంబ్లీలోని సీఎం ఛాంబర్ లో జరిగిన ఈ భేటీలో వివిధ అంశాలపై సిఎం చర్చించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను మెరుగుపరిచేందుకు పలు కీలక సూచనలు చేసిన సుబ్రమణియన్ ఆర్థిక పరిస్థితి మెరుగు పరుకునేందుకు ప్రణాళికాబద్ధంగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లాలని పేర్కొన్నారు. కాగా, విద్యుత్ రంగం, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, జిఎస్‌టీ తదితర అంశాలపై సుబ్రమణియన్ తో సిఎం, డిప్యూటీ సీఎం చర్చించారు. విద్యుత్ రంగంలో ఖర్చుల నమూనా, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ విభా గంలో నమూనా మూల్యాంకనం, జీఎస్టీలో పన్నుల అంచనా, ఇతర అంశాలపై చర్చ చేశారు.

## కాంగ్రెస్ బిసి ఎమ్మెల్యేల సమావేశం

### బిసి జనాభా ప్రాతిపదికన బడ్జెట్ కేటాయింపులపై చర్చ

**హైదరాబాద్,మార్చి 16,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఛాంబర్‌లో కాంగ్రెస్ బిసిఎమ్మెల్యేలు సోమవారం సమావేశమైనారు అయ్యారు. ఈ సమావేశంలో మహేష్ గౌడ్, మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిసిలకు జనాభా ప్రాతిపదికన బడ్జెట్ కేటాయింపులపై చర్చించారు. లోక్‌సభలో కాంగ్రెస్ పెట్టబోయే బిసి ప్రైవేట్ బిల్‌పై కూడా చర్చ జరిగింది.

# హిందువుల విశ్వాసాలపై దాడి చేయడం సరికాదు

### బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధుల అశోక్ ముస్తాపురే,సోలంకి శ్రీనివాస్

**హైదరాబాద్, మార్చి 16 ప్రభాతవార్త** భారత దేశంలో ప్రతి సమావేశం, ప్రతి ప్రారంభోత్సవం, ప్రతి శుభకార్యంలో వేద మంత్రాలు చదవడం, ఆశీర్వచనాలు ఇవ్వడం అనేది ఎన్నో దశాబ్దాలుగా వస్తున్న భారతీయ పరంపర అని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి అశోక్ ముస్తాపురే సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. మన సంస్కృతి, హిందూ ధర్మంపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, సామేల్ మాటలపై కాంగ్రెస్ పార్టీ అవలంభిస్తున్న వైఖరిని ఖండిస్తున్నామన్నారు. అందరికీ మంగళం కలగాలని కోరే ఆధ్యాత్మిక సంస్కృతిలో భాగమిది అన్నారు. అలాంటి విషయాన్ని వక్రీకరించి, హిందూ సమాజాన్ని లక్ష్యంగా చేసుకుని అనరాని మాటలు మాట్లాడటం అత్యంత అభ్యంతరకరం. దీనిని మేము తీవ్రంగా ఖండిస్తున్నాం. మందుల సామేల్ వ్యాఖ్యలు వ్యక్తిగతంగా వచ్చినవి కావన్నారు. అవి కాంగ్రెస్ పార్టీ అసలు ఆలోచనను ప్రతిబింబిస్తున్నాయన్నారు. ఎందుకంటే ఆయన చేసిన వ్యాఖ్యలను ఇప్పటివరకు కాంగ్రెస్ పార్టీ ఎక్కడా ఖండించలేదన్నారు. తమ పార్టీ అభిప్రాయం కాదు అని చెప్పలేదన్నారు. హిందూ విశ్వాసాలపై దాడి చేయడం, సంస్కృతిని వక్రీకరించడం, సమాజంలో విభేదాలు రేపేలా మాట్లాడటం కాంగ్రెస్ నాయకులకు కొత్త విషయం కాదన్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధి సోలంకి శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలోనే కాదు ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో హిందూ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలపై ఒక ప్రణాళికబద్ధమైన దాడి జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ దీనికి ప్రధాన వేదికగా మారిందన్నారు. ఆయన వ్యాఖ్యలకు కాంగ్రెస్ పార్టీ కూడా బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

## యుద్ధ ప్రభావంతో రాష్ట్రంలో రికార్డు స్థాయిలో విద్యుత్ వినియోగం!


**విజయవాడ మార్చి 16 ప్రభాతవార్త ప్రతినిది:** పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ ప్రభావం ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ వినియోగంపై కూడా పడుతోంది. వంట గ్యాస్ వినియోగాన్ని తగ్గిస్తూ చాలా మంది ఇండక్షన్ స్టవ్‌లు, ఎలక్ట్రిక్ కుక్కర్లను ఎక్కువగా వినియోగిస్తున్నారని అధికారులు చెబుతున్నారు. దీంతో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ ఒక్కసారిగా పెరిగింది. మార్చి 7న రికార్డు స్థాయిలో 274.6 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదైంది. గత ఏడాదితో పోలిస్తే విద్యుత్ వినియోగం 9.15 శాతం అధికంగా ఉంది. మార్చి 12,13,14 తేదీల్లో వరుసగా సుమారు 272 మిలియన్ యూనిట్ల వినియోగం నమోదైంది. అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోతతో పాటు యుద్ధ ప్రభావం కూడా విద్యుత్ డిమాండ్ పెరగడానికి కారణమవుతోంది.



# రెండేళ్ల వ్యవధి అవసరం

దగ్గర వయసున్న అంటే.. రెండేళ్లలోపు వయసు తేడా ఉన్న అక్కచెల్లెళ్లు, అన్నదమ్ములు ఒకే రకమైన అవుట్‌ఫిట్స్ ధరించి కనిపిస్తే... అరే చూడ్డానికి భలే ముద్దుగా ఉన్నారే అనుకుంటాం. ఒకరికొకరు తోడుంటారు, కలిసి పెరుగుతారు, ఇద్దరి చదువులు ఒకేసారి పూర్తవుతాయి. అప్పుడు నీకు బోలెడు తీరిక దొరుకుతుంది. అంటూ ఇంట్లో పెద్దవాళ్ల సలహాలూ చాలానే వినిపిస్తాయి. దీన్నే 'టూ అండర్ టూ' పద్ధతిగా పిలుస్తున్నారు నిపుణులు. చూడ్డానికీ, వినడానికీ ఇది భాగానే ఉంటుంది తల్లికి అంతమంచిది కాదంటున్నారు. మొదటికాన్పు అయిన తరువాత మహిళలు శారీరకంగా, మానసికంగా కోలుకోవడానికి దాదాపు రెండేళ్ల సమయం పడుతుందట. అంతేకాదు. వాళ్ల కోలుకోవడానికీ, హార్మోన్లు తిరిగి సాధారణ స్థితికి రావడానికీ, నిద్రవేళలు గాడిలో పడటానికి కొంతమందికి రెండు నుంచి ఐదేళ్లు కూడా పడుతోందని చెబుతున్నాయి. అందుకే రెండేళ్లలోపు ఇద్దరు పిల్లలు నిద్రలేమి, శారీరక శ్రమ పెరిగి తొందరగా అలసిపోతున్నారని అంటున్నారు. కొందరిలో కార్టిసాల్ ఉత్పత్తి ఎక్కువ ఒత్తిడి పెరుగుతుందట. బరువు తగ్గడంతోపాటు రోగనిరోధక శక్తి తగ్గుతుంది. ఇలా మొదటి శిశువు పుట్టిన పద్దెనిమిది నెలలలోపు మళ్లీ ప్రెగ్నెంట్ అయితే పుట్టబోయే బిడ్డ తక్కువ బరువుతో, నెలలు నిండకుండా పుట్టే అవకాశాలు ఉన్నాయని డబ్ల్యూహెచ్ఓ ఒక నివేదికలో ఉంది. అందుకే మొదటికాన్పు తరవా రెండో బిడ్డను ప్లాన్ చేసుకుంటే రెండేళ్ల వ్యవధి పాటించమంటోంది. అప్పుడే తల్లీ బిడ్డా ఆరోగ్యంగా ఉంటారని చెబుతున్నారు నిపుణులు. ◻

# బాడీ లోషన్ రాస్తున్నారా ?



వాతావరణం మారే వాతావరణం పైనా ప్రతికూల ప్రభావం చూపుతుంది. చర్మం పొడిబారి నిర్జీవంగా మారుతుంది. అయితే చర్మంలో తేమని నిలిపి ఉంచడానికి ఏదో ఒక క్రీమ్/బాడీ లోషన్ రాసుకుంటే సరిపోతుందనుకుంటారు చాలామంది. కానీ వీటిలో కూడా చర్మతత్వానికి నప్పే లోషన్లను ప్రత్యేక ముఖ్యమంటున్నారు నిపుణులు. అలాగే వీటిని ఉపయోగించే అనేక జాగ్రత్తలు పాటించాలి. అప్పుడే ఫలితం కనిపిస్తుంది.

**కాస్త తడిగా ఉన్నప్పుడే...** ముఖానికి లేదా చర్మానికి క్రీమ్లు, లోషన్లు.. రాసుకునే ముందు చర్మాన్ని శుభ్రం చేసుకోవడం తప్పనిసరి. అలాగే చర్మం కాస్త తడిగా ఉన్నప్పుడే వాటిని రాసుకోవాలి. అప్పుడే అది చర్మ గ్రంథుల్లోకి చేరే అవకాశం ఉంటుంది. చర్మం తేమను కోల్పోకుండా జాగ్రత్తపడచ్చు.

స్నానం చేసిన వెంటనే ... క్రీమ్ లేదా బాడీ లోషన్స్ ఎప్పుడు పడితే అప్పుడు కాకుండా.. స్నానం చేసిన వెంటనే రాసుకోవాలి. ఎందుకంటే ఆ సమయంలో చర్మంలో తేమ ఎక్కువగా ఉండటం వల్ల లోషన్ రాసుకుంటే మంచి ఫలితం ఉంటుందట. అలాగే స్విమ్మింగ్ పూల్లో ఈత కొట్టిన తర్వాత కూడా తప్పకుండా క్రీమ్ లేదా బాడీ లోషన్ రాసుకోవాలి. లేదంటే నీటిలో ఉంటే క్లోరిన్ వల్ల చర్మం పొడిగా మారే ప్రమాదం ఉంటుంది.

**చర్మం ఉష్ణోగ్రతను బట్టి ....** అలాగే చర్మం కాస్త వేడిగా ఉన్నప్పుడే క్రీమ్ లేదా లోషన్స్ రాసుకుంటే అవి చర్మంలోకి సులభంగా ఇంకుతాయంటున్నారు నిపుణులు అందుకే క్రీమ్ లేదా లోషన్ రాసుకునే ముందు చర్మం చల్లగా అనిపిస్తే.. గోరువెచ్చని నీళ్లలో ముంచిన టవల్తో తుడుచు కొని ఆపై లోషన్ ను చర్మానికి అప్లై చేయండి. చేసుకోవాలంటున్నారు. పొడిబారి నిర్జీవంగా మారి పోయిన చర్మానికి క్రీమ్ లేదా లోషన్ రాసుకోవడం వల్ల అది తేమను సంతరించుకోవడంతో పాటు పునరుత్తేజం అవుదుంది, బాడీ లోషన్ చర్మంపై ఉన్న మచ్చల్ని క్రమంగా తగ్గించడానికి ఉపయోగపడుతుంది. ◻



# కేన్సర్ విజేతల్లో ఆత్మస్థైర్యం నింపాలి..

**చికిత్స సమయంలోనే కాదు, క్యాన్సర్‌ని జయించాక కూడా వాళ్లలో ఆత్మస్థైర్యం నింపడం ముఖ్యమంటారు. ముంబయికి చెందిన జయశ్రీ రతన్ అనడమే కాదు, క్యాన్సర్ విజేతల కోసం కోషె ప్రాస్థసిస్‌ను తయారు చేసి, 'శాయిషా ఇండియా ఫౌండేషన్' ద్వారా ఉచితంగా అందించారు.**

క్యాన్సర్ బారిన పడి కోలుకున్న వారి జీవితాలు క్యాన్సర్‌కి ముందు క్యాన్సర్ తర్వాత అన్నట్లు ఉంటాయి. అందులోనూ రొమ్ము క్యాన్సర్.. మహిళల్ని వేదించే వాటిలో ముఖ్యమైనది. మన దేశంలో ఏటా దీని బారిన పడేవాళ్ల సంఖ్యా ఎక్కువ అయితే దీన్ని ఓడించి గెలిచిన విజేతలు మాత్రం తర్వాతే ఎక్కువ ఇబ్బంది పడుతున్నారంటారు జయశ్రీ క్యాన్సర్‌తో పోరాడటం ఒకెత్తయితే, దానివల్ల రొమ్ము కోల్పోవడం మహిళల్ని మానసికంగా కుంగదీ స్తుంది. అలాంటి వారికి చేతితో అల్లిన కృత్రిమ వక్షోజాలను ఫ్రీగా అందించారు జయశ్రీ 'చిన్నప్పటి నుంచి సేవ చేయడమంటే నాకిష్టం. అందుకే అత్తయ్యతో కలిసి చెన్నైలో మెర్సీ హోమ్ లాంటి వృద్ధాశ్రమాలకు నా సాయం చేసేదాన్ని. ఒకసారి మా కోడలి బందువుల్ని కలవడానికి వెళ్లాం. ఆ ఇంటి యజమాని క్యాన్సర్ నుంచి కోలుకోవడానికి మాస్టెక్టమీ చేయించుకున్నారు. దాంతో ఆమె పడ్డ ఇబ్బందులు పంచుకున్నారు. అప్పుడే క్రోష్ బ్రెస్ట్ ప్రాస్థసిస్ గుర్తుకొచ్చాయి. అమెరికాలో ఉన్నప్పుడు ఒక ఎన్జీవోకి వీటిని అల్లి పంపేదాన్ని. అలాంటివే కొన్ని తయారుచేసి పంపా. వీటిని నూలుతో బ్రా కప్పు సైజులో తయారుచేస్తాం. వీటివల్ల చర్మానికి ఎలాంటి అలర్జీలూ ఉండవు. పైగా 18 నెలలపాటు వాడుకో వచ్చు. అవగాహన ఉన్నవాళ్లు, సిలికాన్ బ్రెస్ట్ ప్రాస్థసిస్ని ఉపయో గించారు. కానీ, వాటి ధర ఎక్కువ. దాంతో చాలమంది కాటన్ బాల్స్ చేతి రుమాళ్లను వాడుతుంటారు. వాటివల్ల చర్మ సమస్యలువస్తాయి. కానీ, ఈ క్రోషె ప్రాస్థసిస్ వాటి నుంచి ఉపశమనాన్నిస్తాయి, నేను పంపిన ప్రాస్థసిస్ వాడిన ఆమె 'ఇవి చాలా సౌకర్యంగా ఉన్నాయి. మాసెక్టమీ వల్ల నాలా చాలామంది ఆత్మ విశ్వాసం కోల్పోతున్నారనీ వాళ్లందరికీ ఇవి అందిస్తే బాగుంటుంది అన్నారామె. అప్పుడే ఈ శాయిషా ఇండియాఫౌండే షన్‌కి మొదటి అడుగు పడింది అంటారు జయశ్రీ.



**వాళ్లే మొదటి ప్రాధాన్యత...** ముగ్గురు స్నేహితులం కలిసి నాకర్స్ ప్రొవైడర్ పేరుతో దీన్ని నమోదుచేశాం. ఆర్థిక పరిస్థితి సరిగాలేనివాళ్లకే ప్రాధాన్యత. మొదట్లో చాలా సవాళ్లేన్నాం. వీటి తయారీకి స్వచ్ఛమైన కాటన్, నూలు వినియోగించాలి. అంతేకాదు, ఆంకాలజిస్టులు, రేడియాలజిస్టులు, బ్రెస్ట్ సర్జన్లకు అవగాహన కల్పించాలి. అసలు సమస్య అప్పుడే మొదలైంది. వీటి తయారీకి వాలంటీర్లు దొరికాయి. అన్ని కష్టాలు దాటుకుని ముందుకు వెళ్తుంటే ఈ ప్రాస్టసిస్ ను ఉచితంగా ఇవ్వడం కొన్ని వాణిజ్య సంస్థలకు నచ్చలేదు. అయినా వెనకడుగు వేయలేదు మా ఫౌండేషన్. మొదట వెయ్యిమందికి వీటిని అందించాం. ఈ ప్రయత్నంలో సాయం కోసం అమెరికా లోని నిట్టెడ్ నాకర్స్ సాయం తీసుకున్నాం. ఇప్పటిదాకా ఇరవైవేలమందికి పైగాప్రాస్టసిస్ అందించాం. ఇప్పుడు మా దగ్గర 450 మందికి పైగా వాలంటీర్లు ఉన్నారు. వీళ్లలో చాలామంది క్యాన్సర్ నుంచి కోలుకున్న వాళ్లే. సింగపూర్, కువైట్, ఒమన్‌లో కూడా వాలంటీర్లు ఉన్నారు. అక్కడ అల్లిన నాకర్లను మాకు పంపుతారు. నాణ్యత, కొలతల్లో ఏకరూపత ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటాం. ప్రాస్టసిస్‌ను తయారు చేయడానికి అయ్యే నూలు ఖర్చులు, ప్యాకేజింగ్, ప్రొస్టేట్ ఖర్చులను వాలంటీర్లు కొందరు స్వచ్ఛందంగా భరిస్తారు. అలా చేయలేనివారికి మా శాయీషా సాయం చేస్తుంది. అంతేకాదు https://sanishain dia.org/ మా వెబ్‌సైట్ ద్వారా అభ్యర్థుల్ని గుర్తించి సేవలు అంది. ◻

భరత భూమిలోని మట్టి కూడా భగవంతుడికి ఎంతో ఇష్టమైంది. అందుకే శ్రీకృష్ణ పరమాత్మ సైతం ఈ మట్టినే ఆనందంగా ఆరగించాడు. అంతటి అద్భుత శక్తి వుంది. ఈ నేలలో. ఈ నేలమీద పండిన పంటలను ఆహారంగా స్వీకరిస్తున్న మనం ఎంత అదృష్టవంతులయోమరి. ఒక ముసలిఎద్దూ, చినిగిపోయిన చర్మమూ, ఒక పాత గొడ్డలీ, బూడిదా, పాములూ, ఒక కపాలమూ కలిగిన ఆ పరమేశ్వరుని ఆరాధించడమేనా నా మతం? ఆ స్వామిని కొలిచే కోట్లాది భక్తులు తిండికోసం మలమలమాడుతూ, జీవిస్తున్న దరిద్ర హైందవ రూపంలో

# మతం ఎక్కడుంది?

వున్న సజీవ నారాయణుడి మాటేమిటి? ఆ దరిద్ర నారాయణుడిని కూడా సజీవనారాయణుడిగా నెంచి ధర్మమై వుండాలి. సాధారణ మార్గంగా ఎంచాలి. ఇది ఒక అనుభవ వేదాన్తం కావాలి. భగవద్భక్తియై వుండాలి శుష్క ప్రియాలతో ప్రయోజనం లేదు. క్రియారపకమైన సర్వజాత్యైక్యత ప్రతిస్పందించాలి. అప్పుడే మానవుడు సర్వేశ్వరాను సంధానం పొందగలుగుతాడు. భారతీయులు తమలో అఖండ భారతాన్ని పరస్పరం దర్శించి దేవసేవకు బద్ధకంకణులవుతారు. భారతదేశంలో ప్రతి నగరమూ, పల్లె కొండలూ, కోనలూ, నదీనదాలూ, వాగులూ వంకలూ, రాళ్లూ రప్పలూ, ప్రతి జంతువు చేతనత్వం పొందింపబడి పావనంగా భావింపబడుతున్నాయి. సర్వ మాతృభూమినీ దైవంగా పూజించడానికి కనపడే ప్రతి వస్తువూ అందరికీ భక్తియుతమైన ప్రేరణ కలిగిస్తూవున్నాయి. విగ్రహాల్ల ప్రాణ ప్రతిష్ఠ గావించి, దుర్గా విగ్రహాల్లో రక్తమాంసాలు సృష్టించుకుంటూ కొలిచితరిస్తున్నారు. ఇక ఆ భగవంతునిచే ప్రాణ ప్రతిష్ఠగావింపబడిన జీవుల రక్షణ, సంరక్షణ, చేయగలిగిన వారి కర్తవ్యంగా మారుతుంది. మనం ముందు మన హృదయ కవాటాలను తెరుచుకోవాలి. హృదయాలు కలుపుకోవాలి. మానవుడు తన విశ్వాసాన్ని బట్టే సదా అన్నింటినీ పొందగలుగుతాడు. దేనిమీద నమ్మకం వుందో అదే పొందగలుగుతున్నాడు.



-డా॥పులివర్తి కృష్ణమూర్తి

# స్పైసీగా తింటున్నారా!



ఉన్నది ఒక్కటే జీవితం... దీన్ని పూర్తిగా అనుభవించాలి... ఈ తరం చెబుతోన్న మాటే ఇది. కాబట్టే, కెరియర్ దగ్గర్నుంచి... టూర్ల వరకూ ఏదైనా నచ్చిందే. భిన్న రుచులను వెతుక్కుంటూ వెళ్లిమరీ ఆస్వాదించేస్తున్నారు. అన్నట్టు ఈమధ్య వాళ్లని ఆకర్షిస్తున్నదేంటో తెలుసా? హాట్ హనీ! అంటే తేనెని వేడి చేసి తీసుకోవడం అనుకునేరు. ఇదో తీపి, కారాల కలయిక, తేనెని వేడిచేసి, దానికి చిల్లీ ఫ్లేక్స్ కలుపుతారు. ఓవైపు తీయగా, మరోవైపు కారంగా.... ఆ రుచి వేరు అంటూ పిజ్జా, కూరగాయల సలాడ్, ఫ్రైడ్స్నాక్స్, టోస్ట్... ఇలా ప్రతి దానిమీద వేసుకుని తినేస్తున్నారు. పైగా ఈ స్వీట్, స్పైసీల కలయికకి స్పైసీ అని పేరు పెట్టుకుని మరీ సోషల్మీడియాలో దీని గురించి పంచుకుంటున్నారు. ఏళ్లనాటి నుంచి వస్తున్న సాస్కి దీన్నో ట్రెండీ ప్రత్యామ్నాయంగానూ చెబుతున్నారు. దీనితో చిటికెలో పూర్తయ్యే వంటలు, ఫ్లేవర్ల విషయంలో ప్రయోగాలు చేసే జెనీజీ అమ్మాయిల ఫేవరెట్‌గా మారిపోయింది స్పైసీ తేనె. మరి మీ సంగతేంటి? మీరూ రుచి చూస్తారా ఓసారి? ◻

# మహిళ అంబులెన్సులు

ఎంత ప్రమాదంలో అయినా ఉండనీయండి అవతలివాళ్లు మగవారైతే తమ బాధ, ఇబ్బందిని మహిళలు త్వరగా పంచుకోలేరు. అదే తోటి ఆడవాళ్లెవరైనా చెంత ఉంటే తెలియని ధైర్యం. వాళ్ల మాటలతో సాంత్వన పొందుతారు. ఇదే ఆలోచించారు షాహీద్ భగత్ సింగ్ సేవాదళ్... విమెన్స్ సెల్ ప్రెసిడెంట్ మంజీత్ కౌర్. అందుకే మహిళలకు ప్రత్యేకమైన అంబులెన్సులు తీసుకొచ్చారు. 2022 నుంచే ఢిల్లీలో ఈ పింక్ అంబులెన్స్‌లు




అందిస్తున్నాయి. వాటిని నడిపేవారూ మహిళలే. ఖిప్రసవం, తీవ్ర అనారోగ్యాలప్పుడు అంబులెన్సులను ఆశ్రయించినా... చాలామంది మహిళలు అడిగే ప్రశ్న ఖిలోపల ఆడవాళ్ళు లేరాఖి అనే! అప్పుడే వాళ్ల ఇబ్బంది అర్థమైంది. అందుకే ఈ పింక్ సేవలు అందుబాటులోకి తెచ్చాం. నడిపే వారే కాదు, లోపల ఎమర్జెన్సీ సేవందించే వారూ మహిళలే. ఇది రోగులకు సాంత్వనే కాదు పనిచేసేవారికీ ఆత్మవిశ్వాసం పెంచుతుందిఖి అంటోన్న ఈమె ఆలోచనకు సెల్యూట్ కొట్టాల్సిందే! ◻

తెర



# G.O.A.T(గోట్) 26న రిలీజ్

ప్రముఖ హాస్య కథానాయకుడు సుడిగాలి సుధీర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం G.O.A.T (గోట్) Greatest OfAllTimes అనేది ఉపశీర్షిక. దివ్యభారతి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి వేదవ్యాస్ దర్శకుడు. మహాతేజ క్రియేషన్స్ అండ్ జైష్ణవ్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి చంద్రశేఖర్ రెడ్డి మొగుళ్ళ నిర్మాత. ప్రస్తుతం నిర్మాణానంతర పనులను జరుపుకుంటోన్న ఈ చిత్రం మార్చి 26న ప్రపంచ వ్యాప్తంగా థియేట్రికల్ రిలీజ్ కానుంది. ఇప్పటి వరకు ఈ చిత్రం నుంచి విడుదలైన ప్రతి కంటెంట్‌కు మంచి స్పందన వస్తోంది. త్వరలోనే ఈ చిత్రం ట్రైలర్‌ను కూడా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. కాగా ఈ చిత్రం తాజాగా సెన్సారును పూర్తిచేసుకుంది. సెన్సారు వాళ్లు ఈచిత్రానికి యుబైఏ సర్టిఫికెట్‌ను జారీ చేశారు. నిర్మాత మాట్లాడుతూ ప్రస్తుతం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఖర్చు విషయంలో ఎక్కడా రాజీపడకుండా చాలా రిచ్‌గా చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. టెక్నికల్‌గా కూడా చిత్రం ఉన్నతస్థాయిలో వుంటుంది. సుడిగాలి సుధీర్ కెరీర్‌లో ఈ చిత్రం మైల్‌స్టోన్‌గా నిలుస్తుంది. సినిమా ఆద్యంతం ప్రతి ఫ్రేమ్ ఎంతో అద్భుతంగా ఉంటుంది. పూర్తి కమర్షియల్ అంశాలతో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో నేటి యువతను ఆలోచింపజేసే ఓ మంచి విషయం కూడా దాగి ఉంటుంది. తప్పకుండా ఈ చిత్రం అందర్ని అలరిస్తుందనే నమ్మకం ఉందిఖి అన్నారు. సుడిగాలి సుధీర్, దివ్యభారతి, సర్వధమన్ బెనర్జీ, నితిన్ ప్రసన్న, బ్రహ్మాజీ, పృథ్వీ,

# 'ఉస్తాద్ భగత్ సింగ్' ఫ్యామిలీ సినిమా: రాశి ఖన్నా



'గబ్బర్ సింగ్' వంటి సంచలన విజయం తరువాత పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, కల్ట్ కెప్టెన్ హరీష్ శంకర్ కలయికలో వస్తున్న చిత్రం ఉస్తాద్ భగత్ సింగ్. మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. రాశి ఖన్నా, శ్రీలీల కథానాయికలు. తాజాగా మీడియాతో ముచ్చటించిన కథానాయిక రాశి ఖన్నా, ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా విశేషాలను పంచుకున్నారు.

**ప్రస్తుతం మీ జీవితం ఎలా ఉంది? ఈ ప్రాజెక్ట్‌లోకి ఎలా వచ్చారు?**

నా జీవితం ఇప్పుడు చాలా బిజీగా ఉంది. నిజం చెప్పాలంటే, పవన్ కళ్యాణ్ గారి సినిమా అనగానే కథ కూడా వినకుండా ఎంతో ఉత్సాహంతో వెంటనే ఒకే చెప్పేశాను.

**ఈ సినిమాలో మీ పాత్ర ఎలా ఉంటుంది?**

నా పాత్ర పేరు శ్లోక. తను చాలా మోడరన్ అమ్మాయి. సినిమాలో ప్రతి పాత్రకు ప్రాధాన్యత ఉంది. నా పాత్రకు కూడా మంచి క్యారెక్టరైజేషన్ ఉంటుంది.

**పవన్ కళ్యాణ్ గారితో పని చేసిన అనుభవం ఎలా ఉంది?**

పవన్ గారు చాలా సింపుల్ పర్సన్, ఎప్పుడూ పుస్తకాలు చదువుతూ కనిపిస్తారు. ఆయనలో ఒక తెలియని అమాయకత్వం ఉంది. మీరు నటి కావాలని ముందే అనుకున్నారా? అని మొదటిరోజే నన్ను అడిగారు. లేదు సార్, నేను ఐఏఎస్ ఆఫీసర్ కావాలనుకున్నానని ఆయనతో చెప్పాను.

**దర్శకుడు హరీష్ శంకర్ గారి గురించి ఏం చెప్తారు?**

హరీష్ శంకర్ గారు చాలా స్మార్ట్. ఆయనకు మాస్ పల్స్ బాగా తెలుసు. సాధారణంగా 120 రోజులు పట్టే షూటింగ్‌ను ఆయన కేవలం 40 రోజుల్లోనే పూర్తి చేశారు. సరిగా నిద్ర కూడా పోకుండా సినిమా కోసం ఎంతో కష్టపడ్డారు.

**ఇద్దరు హీరోయిన్లు (శ్రీలీల, మీరు) ఉండటం వల్ల స్క్రీన్ స్పేస్ తగ్గుతుందని అనిపించలేదా?**

మా ఇద్దరికీ కలిసి సన్నివేశాలు లేవు. ప్రతి పాత్ర దేనికదే ప్రత్యేకంగా ఉంటుంది. నా పాత్రలో కూడా మంచి వేరియేషన్స్ ఉంటాయి.

**పవన్ కళ్యాణ్ గారి డేట్స్ కి తగ్గట్టుగా మీరు డేట్స్ ఇవ్వాలి కదా.. ఏమైనా ఇబ్బంది పడ్డారా?**

పవన్ కళ్యాణ్ గారి షెడ్యూల్స్ ఎలా ఉంటాయో చెప్పలేమని హరీష్ గారు ముందే చెప్పారు. అందుకు తగ్గట్టుగా నేను అడ్జస్ట్ చేసుకుంటాను.

**'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా ఎలా ఉండబోతుంది?**

ఇది ఒక ఫ్యామిలీ సినిమా, అందరూ కలిసి థియేటర్‌లో చూడొచ్చు.

**మీ భవిష్యత్తు ప్రాజెక్టుల గురించి చెప్పండి?**

ప్రస్తుతం హిందీలో అక్షయ్ కుమార్ గారితో ఒక సినిమా, ఖిఫర్జీ 2ఖి షో చేస్తున్నాను. అమెజాన్ సిరీస్ లో ఒక పంజాబీ పోలీస్ క్యారెక్టర్ చేస్తున్నాను,



# 'కొరియన్ కనకరాజు' కొరియాలో ప్రారంభం

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ కొరియన్ కనకరాజు. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో వి క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టైన్మెంట్ భారీ స్థాయిలో నిర్మిస్తున్నాయి. లావిష్ బడ్జెట్‌తో రూపొందించబడిన ఈ చిత్రం హర్రర్, కామెడీని రిఫ్రెషింగ్ క్రాస్‌కల్చరల్ ట్విస్ట్‌తో బ్లెండ్ తో తెరకెక్కుతోంది. ఇండియన్, కొరియన్ నేపథ్యాలలో రూపొందుతున్న ఈ చిత్రంలో వరుణ్ తేజ్ ఇంతకు ముందు ఎన్నడూలేని భిన్నమైన పాత్రలో కనిపించనున్నారు. టీం ఇప్పుడు ఫైనల్ షూటింగ్ షెడ్యూల్ సౌత్ కొరియాలో ప్రారంభించింది. కీలకమైన ఒక వారం రోజుల షెడ్యూల్‌ను ప్లాన్ చేశారు. ఈ షెడ్యూల్‌లో పాటలు, కథలో ముఖ్యమైన కొన్ని సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. వరుణ్ తేజ్, రితికా నాయక్, సత్య పాల్గొనున్న ఈ షెడ్యూల్ ను కొరియాలోని అద్భుతమైన ప్రదేశాల్లో చిత్రీకరించను న్నారు. వరుణ్ తేజ్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన కొరియన్ కనకరాజు టైటిల్ గ్లింప్స్ ఇప్పటికే అద్భుతమైన స్పందనను అందుకుంది.

# 'బైకర్' సినిమా అందరికీ కనెక్ట్ అవుతుంది: జిబ్రాన్



చార్మింగ్ స్టార్ శర్వా మోస్ట్ ఎవైటెడ్ స్పోర్ట్స్ డ్రామా బైకర్. మాళవిక నాయర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో రాజశేఖర్ పవర్ ఫుల్ పాత్రని పోషించారు. . ఏప్రిల్ 3న ఈ సినిమా థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా మ్యూజిక్ డైరెక్టర్ జిబ్రాన్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలని పంచుకున్నారు.

**ఈ ప్రాజెక్టులోకి ఎలా వచ్చారు?**

సాహో తర్వాత ఒక మంచి కం బ్యాక్ ఫిలిం కోసం ఎదురు చూస్తున్నాను. ఆ సమయంలో యువి క్రియేషన్స్ వంశీ గారు ఈ ప్రాజెక్టు గురించి చెప్పారు.

**రేసింగ్ సినిమాలు తెలుగులో చాలా అరుదుగా కదా.. ఈ సినిమా మేకింగ్ గురించి?**

ఈ సినిమా మేకింగ్ ఒక హాలీవుడ్ లెవెల్‌లో ఉంటుంది. దర్శకుడు అభిలాష్ గారి ఆలోచన కూడా అదే. ఇందులో కేవలం రేసింగ్, యాక్షన్ మాత్రమే కాదు, చాలా స్ట్రాంగ్ ఎమోషనల్ ఫ్యామిలీ కంటెంట్ కూడా ఉంది.

**ఫస్ట్ కాపీ చూసిన తర్వాత మీకు ఎలాంటి ఎలిమెంట్స్ బాగా నచ్చాయి?**

సినిమా మొత్తం చాలా అద్భుతంగా వచ్చింది. ముఖ్యంగా రేసింగ్ సన్నివేశాలు ప్రేక్షకులకు సీట్ ఎడ్జ్ అనుభూతి ఇస్తాయి.

**ఈ జోనర్ సినిమాకి మ్యూజిక్ చేయడంలో ఎలాంటి ఛాలెంజెస్ ఎదురయ్యాయి?**

రేసింగ్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చే సినిమాలు అంటే చాలా మంది హాలీవుడ్ సినిమాలతో పోల్చుతారు. ఎక్కడికి వెళ్లినా ఎఫ్ 1 లాంటి మ్యూజిక్ చేయమని అడిగేవారు. నిజానికి ఈ సినిమా అనుకున్నపుడు ఎఫ్ 1 ఇంకా రాలేదు. .

**శర్వా గారి పర్ఫార్మెన్స్ గురించి?**

ఈ సినిమా చూసిన తర్వాత శర్వానంద్ పర్ఫార్మెన్స్ గురించి చాలా ప్రత్యేకంగా మాట్లాడుకుంటారు.

**దర్శకుడు అభిలాష్ గురించి?**

అభిలాష్ చాలా క్రమశిక్షణ గల దర్శకుడు. ఆయన దృష్టి ఎప్పుడూ సినిమాపైనే ఉంటుంది. సినిమాలో ఎనిమిది పాటలు ఉన్నాయి.

**ప్రస్తుతం చేస్తున్న ప్రాజెక్టులు?**

ఒక సినిమా రిలీజ్ అయిన తర్వాతే కొత్త ప్రాజెక్ట్ గురించి ఆలోచిస్తాను. ప్రస్తుతం తెలుగులో బైకర్ రిలీజ్‌కు సిద్ధంగా ఉంది. అలాగే తమిళంలో లీడర్ అనే సినిమా చేశాను. అది కూడా ఏప్రిల్‌లో ప్రేక్షకుల ముందుకు వస్తుంది.



# 'విశ్వనాథ్ సన్స్' టీజర్ విడుదల

సూర్య ప్రధాన పాత్రలో నటిస్తున్న విశ్వనాథ్ సన్స్ సినిమా టీజర్ విడుదలైంది. ఈ టీజర్ ద్వారా సంజయ్ విశ్వనాథ్ అనే పాత్ర యొక్క ప్రపంచాన్ని ప్రేక్షకులకు పరిచయం చేశారు. వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాను సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం భావోద్వేగాలతో నిండిన, ఆసక్తికరమైన సినీ అనుభూతిని అందించనుందని టీజర్ హామీ ఇస్తోంది. టీజర్‌లో సంజయ్ విశ్వనాథ్ అనే అంతర్జాతీయ పిస్టల్ షూటర్ పాత్రను చూపించారు. 40 ఏళ్ల వయసులో కూడా తన కలలను వదలకుండా ముందుకు సాగుతున్న వ్యక్తిగా అతడిని పరిచయం చేశారు. సూర్య ఈ సినిమాలో తండ్రి ప్రేమ, భావోద్వేగ లోతు రెండూ కలిసిన ఒక గాఢమైన పాత్రలో కనిపిస్తున్నారు. ఆయన తెరపై కనిపించిన తీరు, వెంకీ అట్లూరి రాసిన ప్రభావవంతమైన సంభాషణలు.. సూర్య సినీ ప్రయాణంలో చిరస్థాయిగా నిలిచి పోయిన అద్భుతమైన ప్రదర్శ నలను గుర్తు చేస్తున్నాయి. కథకు కొత్తదనాన్ని జోడించే పాత్రలో మమితా బైజు కనిపిస్తున్నారు. ఆమె పాత్ర సినిమాలో ఉత్సాహం, చురుకుదనం తీసుకొస్తుందని టీజర్ సూచిస్తోంది. విశ్వనాథ్ సన్స్ చిత్ర సాంకేతిక విలువలు ఉన్న స్థాయిలో ఉండబోతున్నాయని టీజర్ తో స్పష్టమైంది. జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన శక్తివంతమైన నేపథ్య సంగీతం, విజువల్స్‌ను మరింత ఎలివేట్ చేసింది.

# 'తిమ్మరాజుపల్లి టీవీ' 'ఊరు సాంగ్'



న్యూ టాలెంట్ ను ఎంకరేజ్ చేస్తూ హీరో కిరణ్ అబ్బవరం సుమైర స్టూడియోస్ తో కలిసి తన కేఏ ప్రొడక్షన్స్ పై నిర్మిస్తున్న సినిమా 'తిమ్మరాజుపల్లి టీవీ' తేజ వేల్పుచర్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రంతో సాయి తేజ్, వేద జలంధర్ హీరో హీరోయిన్స్ గా పరిచయమవుతున్నారు. 'తిమ్మరాజుపల్లి టీవీ' చిత్రంతో వి.మునిరాజు దర్శకుడిగా పరిచయమవుతున్నారు. విలేజ్ బ్యాక్ డ్రాప్ లో సాగే పీరియాడిక్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా త్వరలోనే గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు 'తిమ్మరాజుపల్లి టీవీ' సినిమా నుంచి 'ఊరు సాంగ్' రిలీజ్ చేశారు. వంశీకాంత్ రేఖన బ్యూటిఫుల్ గా కంపోజ్ చేసిన ఈ పాటకు సనరే సాహిత్యాన్ని అందించారు. మమత రమేష్ పాడారు. 'ఊరు సాంగ్' ఎలా ఉందో చూస్తే కొమ్మ కొమ్మల్లో కోయిల కూయంగ, తెల్లవారే మా పల్లె పచ్చపచ్చంగ, ఎచ్చని ఎలుగు సీరే కట్టె సక్కంగ, ముగ్గుల పూలు పెట్టి మెరిసే అందంగ, గడపల తోరణాలే గంతులు వేసెనుగా, పువులా పరిమళాలే గాలులు వీచెనుగా, ముస్తాభవుతున్నాదీ శివరాతిరి పండక్కి ఊరు, చిన్నా పెద్దల్లోన మొదలయ్యోను జాతర జోరు..అంటూ ఆహ్లాదకరమైన పల్లెటూరిలో జరిగే శివరాత్రి జాతర సందడిని, ఆ పండక్కి ఊరు ప్రజలంతా సన్నద్ధమయ్యే తీరును వర్ణిస్తూ ఆకట్టుకునేలా సాగుతుందీ పాట.

## బాక్సింగ్ ఛాంపియన్‌షిప్: లవ్లీ వర్సిటీకి మహిళలకు రన్నరప్ ట్రోఫీ

**న్యూఢిల్లీ:** అద్భుతమైన బలం, నైపుణ్యం మరియు క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ, లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ మహిళల బాక్సింగ్‌లో శక్తి కేంద్రంగా ఉద్భవించింది, ప్రతిష్టాత్మకమైన ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ మహిళల బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ 2025-26లో మొదటి రన్నరప్ ట్రోఫీని సాధించింది. ఈ ఛాంపియన్‌షిప్‌లో పది పోటీ బరువు విభాగాలలో హై ఆక్టేన్ బౌట్‌లు జరిగాయి, పంజాబ్ విశ్వవిద్యాలయం ఓవరాల్ ఛాంపియన్ టైటిల్‌ను కైవసం చేసుకోగా, గురు కాశీ విశ్వవిద్యాలయం ఓవరాల్‌గా రెండవ రన్నరప్ స్థానాన్ని కైవసం చేసుకుంది. మహిళల లైట్ హెవీ (75-80 కిలోలు) విభాగంలో నైనా



బంగారు పతకాన్ని సాధించగా, మహిళల ఫ్లై (48-51 కిలోలు) విభాగంలో తమన్నా బంగారు పతకాన్ని సాధించింది. మహిళల వెల్టర్ (60-65 కిలోలు) విభాగంలో నిషా రజత పతకాన్ని, మహిళల మిడిల్ (70-75 కిలోలు) విభాగంలో సవితా ఖత్రి కాంస్య పతకాన్ని గెలుచుకుంది.

## ఎన్‌సిఎఎ ఛాంపియన్‌లో.. సెల్వ ప్రభు జాతీయ రికార్డు

**న్యూఢిల్లీ:** అమెరికాలోని ఫాయెట్‌విల్లేలో జరిగిన ఇండోర్ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు చెందిన సెల్వ ప్రభు అద్భుతమైన ప్రదర్శన ఇచ్చి జాతీయ రికార్డు నెలకొల్పాడు. పురుషుల ట్రిపుల్ జంప్‌లో 17.05 మీటర్ల వ్యక్తిగత ఉత్తమ ప్రయత్నంతో రజత పతకాన్ని గెలుచుకున్నాడు. కాన్సాస్ స్టేట్ యూనివర్సిటీకి ప్రాతినిధ్యం వహిస్తున్న 21 ఏళ్ల ఈ జంప్ తన కెరీర్‌లో తొలిసారిగా 17 మీటర్ల మార్కును అధిగమించాడు. 2022లో ప్రపంచ అథ్లెటిక్స్ అండర్ 20 ఛాంపియన్‌షిప్‌లో రజత పతక విజేత మరియు మాజీ అండర్ 20 జాతీయ రికార్డు హోల్డర్ అయిన ప్రభు ప్రదర్శన వేగంగా అభివృద్ధి చెందుతున్న అతని కెరీర్‌లో మరో ప్రధాన మైలురాయిగా నిలిచింది.







## సబలెంకాకు పారిబాస్ కిరీటం

**న్యూఢిల్లీ:** రైబాకినాను ఓడించి సబలెంకా బిఎన్‌పి పారిబాస్ ఓపెన్ టైటిల్ కిరీటాన్ని కైవసం చేసుకుంది. ఫైనల్లో అరినా సబలెంకా తన ఇండియన్ వెల్స్ ప్రత్యర్థిని 3-6, 6-3, 7-6(6) తేడాతో ఓడించి, తొలిసారిగా డెజర్ట్ టైటిల్‌ను గెలుచుకుని, తన కెరీర్‌లో 23వ కిరీటాన్ని కైవసం చేసుకుంది. తొలి సెట్‌లో రైబాకినా ఆధిపత్యం చెలాయించి సబలెంకాను అధిగమించి 4-2 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. టోర్నమెంట్‌లో సబలెంకా ఒక సెట్‌ను కోల్పోవడం ఇదే మొదటిసారి. రెండవ సెట్ అంత సజావుగా ప్రారంభం కాలేదు. సబలెంకా ప్రదర్శన ఆశాజనకంగా లేకపోవడంతో రైబాకినా తొలి గేమ్‌లో ఆమెను బ్రేక్ చేసింది. కానీ నాలుగుసార్లు గ్రాండ్ స్లామ్ ఛాంపియన్ అయిన సబలెంకా ఆటను మలుపు తిప్పి 6-3తో సెట్‌ను కైవసం చేసుకుంది. నిర్ణయాత్మక మ్యాచ్ కూడా సబలెంకా ప్రారంభంలోనే బ్రేక్ వేసి 3-1 ఆధిక్యంలో నిలిచింది. కానీ రైబాకినా మాత్రం తిరిగి 5-5తో సమం చేసి సెట్‌లో మొదటిసారి ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. సబలెంకా వెంటనే స్పందించి టైబ్రేక్‌ను బలవంతం చేయడంతో స్కోరు 6-6కి చేరుకుంది. తదుపరి ఆమె 8-6తో మ్యాచ్‌ను ముగించింది.

# రికార్డుల జాతర

### ఐపిఎల్ -26: బౌలర్ల రికార్డులకు కేరాఫ్ అడ్రస్.. 200 వికెట్ల క్లబ్‌పై కన్నేసిన ముగ్గురు దిగ్గజాలు



**న్యూఢిల్లీ:** క్రికెట్ ప్రేమికులు ఎంతగానో ఎదురు చూస్తున్న ఐపీఎల్ 19వ సీజన్ (2026) ముంగిట ఉంది. ఈ నెల 28 నుంచి టీ20 క్రికెట్ పండుగ షురూ కాబోతోంది. ప్రతి ఏడాది లాగే ఈసారి కూడా ఎన్నో రికార్డులు బద్ధలు కావడానికి సిద్ధంగా ఉన్నాయి. సాధారణంగా ఐపీ ఎల్ అనగానే ఫోర్లు, సిక్సర్ల వర్షం కురిపించే బ్యాటర్లు గుర్తుకొస్తుంటారు. కానీ, ఈ సీజన్ మాత్రం బౌలర్ల రికార్డులకు కేరాఫ్ అడ్రస్‌గా మారనుంది. ఐపీఎల్ చరిత్రలో ఇప్పటివరకు 200 వికెట్ల క్లబ్‌లో చేరిన బౌలర్ ఒక్క యుజ్వేంద్ర చహల్ మాత్రమే. అయితే ఈ 2026 సీజన్‌లో చహల్ సరసన మరో ముగ్గురు దిగ్గజ బౌలర్లు చేరే అవకాశం పుష్కలంగా కనిపిస్తోంది. ఈ అరుదైన మైలురాయికి అత్యంత చేరువలో ఉన్న బౌలర్లలో భువనేశ్వర్ కుమార్ అందరికంటే ముందున్నారు. ప్రస్తుతం డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున ఆడుతున్న భువీ 200 వికెట్ల మార్కును చేరుకోవడానికి కేవలం 2 వికెట్ల దూరంలోనే ఉన్నారు. ఇప్పటివరకు ఆడిన 190 మ్యాచ్‌ల్లో భువనేశ్వర్ 198 వికెట్లు పడగొట్టారు. ఈ సీజన్ మొదటి మ్యాచ్‌లోనే భువీ ఈ రికార్డును తన ఖాతాలో వేసుకున్నా ఆశ్చర్యపోనక్కర్లేదు. ఇద్దరు పర్పుల్ క్యాప్‌లు గెలిచిన ఏకైక భారతీయ బౌలర్‌గా భువీకి ఐపీఎల్‌లో తిరుగులేని రికార్డు ఉంది. ఇక రెండో వ్యక్తి కోల్‌కతా నైట్ రైడర్స్ స్పిన్ మాంత్రికుడు సునీల్ నరైన్. నరైన్ 200 వికెట్ల క్లబ్‌లోకి అడుగుపెట్టాలంటే మరో 8 వికెట్లు తీయాల్సి ఉంది. 189 మ్యాచ్‌లలో 192 వికెట్లు తీసిన నరైన్ ఎకానమీ రేటు విషయంలో కూడా అందరికంటే ముందుంటారు. కేకేఆర్ జట్టులో కీలక బౌలర్‌గా ఉన్న నరైన్, ఈ సీజన్ మధ్యలోపు ఈ ఘనత సాధించే అవకాశం ఉంది. 200 వికెట్లు తీసిన తొలి విదేశీ బౌలర్‌గా చరిత్ర సృష్టించేందుకు నరైన్ తహతహలాడుతున్నారు.

ముంబై ఇండియన్స్ గన్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా కూడా ఈ రేసులో ఉన్నారు. అయితే భువీ, నరైన్‌లతో పోలిస్తే బుమ్రా కొంచెం దూరంలో ఉన్నారు. బుమ్రా 200 వికెట్ల మార్కును తాకడానికి మరో 17 వికెట్లు కావాలి.

ప్రస్తుతం ఆయన ఖాతాలో 145 మ్యాచ్‌లకు గానూ 183 వికెట్లు ఉన్నాయి. బుమ్రా ఉన్న ఫామ్ చూస్తుంటే ఒక సీజన్‌లో 17 వికెట్లు తీయడం అతనికి పెద్ద కష్టమేమీ కాదు. ఈ ముగ్గురూ గనుక 200 వికెట్లు తీస్తే, ఐపీఎల్ చరిత్రలో చహల్ (221 వికెట్లు) తర్వాత ఈ ఘనత సాధించిన బౌలర్లుగా నిలిచిపోతారు.



## నేషనల్ టెన్‌పిన్ ఛాంపియన్‌షిప్‌లో కిషన్, ప్రీమల్‌కు టైటిళ్లు

**న్యూఢిల్లీ:** ఎఆర్‌సి 34వ జాతీయ టెన్‌పిన్ బౌలింగ్ ఛాంపియన్‌షిప్‌లో కిషన్ ఆర్, ప్రీమల్ జె ఛాంపియన్‌లుగా నిలిచారు. కర్ణాటకకు చెందిన కిషన్ ఆర్ పురుషుల విభాగంలో తన రెండవ జాతీయ టైటిల్‌ను సాధించగా, ప్రీమల్ జె తన తొలి మహిళల జాతీయ కిరీటాన్ని కైవసం చేసుకుంది.

మహిళల విభాగంలో కర్ణాటక కోసం 15 సంవత్సరాల నిరీక్షణకు ముగింపు పలికింది. రెండు ఆటలలో సంచిత పిన్‌ఫాల్ ఆధారంగా నిర్ణయించబడిన ఛాంపియన్‌షిప్ మ్యాచ్‌లో టాప్‌సీడ్ కిషన్ ఆర్ ఆకాష్ అశోక్ కుమార్‌ను ఓడించడానికి చక్కటి ప్రదర్శన ఇచ్చాడు. మొదటి గేమ్‌ను 208-191తో గెలుచుకోవడం ద్వారా కిషన్ తొలి ఆధిక్యాన్ని పొందాడు, 17పిన్ ఆధిక్యాన్ని నెలకొల్పాడు. రెండవ గేమ్‌లో అతను మ్యాచ్‌లో అత్యధిక స్కోరు 244తో ఆధిక్యాన్ని పెంచుకున్నాడు. అయితే ఆకాష్ 238 స్కోరు చేసి 452-429 విజయంతో టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. అంతకుముందు పురుషుల స్టెప్‌లాడర్ రౌండ్‌లో, ఆకాష్ అశోక్ కుమార్ 358-308తో షణ్ముగానందను ఓడించి, ఆ తర్వాత ధ్రువ్ సర్దాను 476-374తో ఓడించి ఫైనల్‌కు చేరుకున్నాడు. మహిళల ఛాంపియన్‌షిప్ మ్యాచ్‌లో, నాల్గవ సీడ్ ప్రీమల్ జె తొలి గేమ్‌లో 188 పరుగులు చేసి, తమిళనాడుకు చెందిన సబీనా అథికాపై 168 పరుగులు చేయడం ద్వారా తొలి దశలోనే నియంత్రణ సాధించింది. రెండవ గేమ్ గట్టి పోటీనిచ్చినప్పటికీ, ప్రీమల్ తన ఆధిక్యాన్ని నిలబెట్టుకుంది. 24 పిన్‌ల తేడాతో గెలిచి 332-308 స్కోరుతో టైటిల్‌ను కైవసం చేసుకుంది.

# వారం ప్రారంభంలో లాభాల బోణీ

### సెన్సెక్స్, నిఫ్టీల్లో షేర్ల ర్యాలీ




**ముంబయి, మార్చి 16:** వరుసనష్టాలతో ఊగిసలాడిన సెన్సెక్స్, నిఫ్టీలు వారం ప్రారంభంలో లాభాల్లో ముగిసాయి. ఓపక్క మధ్యప్రాచ్యం ఉద్రిక్తతలు కొనసాగుతున్న ఎంపికచేసిన రంగాల్లో కొనుగోళ్లతో సూచీలు ర్యాలీ తీసాయి. బిఎస్‌ఇ సెన్సెక్స 938.93 పాయింట్లుపెరిగి 75,502.85కి చేరింది. నిఫ్టీ 50 సూచీ కూడా 257.70 పాయింట్లు పెరిగి 23,408.80కి చేరింది. గడచిన మూడు సెషన్లలో సెన్సెక్స్ 4.85శాతం, నిఫ్టీ 4.57శాతంచొప్పున క్షీణించింది. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 2.88శాతం, ఐసిఐసిఐబ్యాంకు 1.49శాతం, రిలయన్స్ 1.05శాతం చ్పొన ర్యాలీతీసాయి. బిఎస్‌ఇ 150 మిడ్‌క్యాప్‌సూచీ 0.42శాతం, స్మాల్‌క్యాప్ 205 సూచీ 0.47శాతం చొప్పున క్షీణించాయి. మార్కెట్లపరంగా బిఎస్‌ఇలో 1470 షేర్లు పెరిగాయి. 2910 షేర్లు క్షీణించాయి. 169 కంపెనీలు మాత్రం స్థిరంగా కొనసాగాయి. విదేశీ కరెన్సీ మార్పిడి కౌంటర్లలో డారుతో భారత్ రూపాయి మారకం విలువలు 92.40 కి చేరింది. అంతకుముందురోజు 92.30వద్ద ముగిసిన సంగతి తెలిసిందే. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు ఏప్రిల్‌రెండోతేదీ సెటిల్‌మెంట్లు 1.93శాతం క్షీణించి రూ.1,55,400కి చేరింది. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్‌ముడిచమురు మేనెల సెటిల్‌మెంట్లలో 73 సెంట్లు పెరిగి 103.87 డాలర్లకు చేరింది. ఇక స్టాక్స్‌పరంగా బంధన్‌బ్యాంకు 7.46శాతం, ఐడిబిఐ బ్యాంకు 16.49శాతం క్షీణించాయి. తేజాస్ నెట్‌వర్క్స్ 5.44శాతం, బాజెల్‌ప్రాజెక్ట్స్ 20శాతంచొప్పున పెరిగాయి. ఓమ్నిటెక్ ఇంజినీరింగ్ 0.66శాతం క్షీణిస్తే విఎటెక్ వాబాగ్ 0.2శాతం పెరిగింది ఇక ఆదానిపవర్ 5.04శాతం, సీమాక్ 3.31శాతం, ఇజ్మో 3.71శాతం, డిఎం హెల్త్‌కేర్ 2.64శాతం, జైడస్ లైఫ్ సైన్సెస్ 2.17శాతం, ఆలెక్కెమ్ ల్యాబ్స్ 0.56శాతం చొప్పున క్షీణించాయి. ఇక ఐపిఒలపరంగా జిఎస్‌పిక్రాప్ సైన్స్ 0.47రెట్లు మాత్రమే బిడ్లు సాధించింది. 16వ తేదీ ప్రారంభం అయి 18న బిడ్ల ప్రక్రియ ముగుస్తుంది. ఇష్యూధర రూ.304 నుంచి రూ.320గా ఉంది. ఇన్నోవిజన్‌కూడా 1.20రెట్లు బిడ్లు సాధించింది. పదిన ప్రారంభం అయిన బిడ్లప్రక్రియ 17న ముగుస్తుంది. ఇష్యూధర రూ.494నుంచి రూ.519గా ఉంది.



## రూ.2575 కోట్లకు వేదాంత డిబెంచర్ల ఇష్యూ

**న్యూఢిల్లీ, మార్చి 16:** వేదాంత గ్రూపు తొలిసారిగా రూ.2575 కోట్లరూపాయలు డిబెంచర్లద్వారా నిధులసమీకరణకు డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది. వేదాంత తన నిధుల సమీకరణ వనరులను మరిన్ని వర్గాలకు విస్తరించడంతో పాటు కంపెనీ మరింత విస్తరణకుగాను ఈ నిధులు వినియోగిస్తామని, ప్రస్తుతం ఉన్న రుణాల చెల్లింపుతోపాటు రుణ వ్యయాలను కూడా తగ్గించుకునేందుకు ఈనిధులు వినియోగిస్తామని వెల్లడించింది. ముందుగా 2,57, 500 అరక్షిత, విముక్తికి ఆస్కారం ఉన్న రేటింగ్ ఉనన లిస్టింగ్ అయిన ఎన్‌సిడి అంటే నాన్ కన్వర్టిబుల్ డిబెంచర్లను జారీచేస్తుంది. ఒక్కొక్కటీ రూ.1లక్ష విలువతో మొత్తం 2575 కోట్లు ప్రైవేటు ప్లేస్‌మెంట్ పద్ధతిలో సమీక రించ నున్నట్లు వేదాంత బిఎస్‌ఇకి ఫైలింగ్ చేసింది. ఇటీవల డెట్ ఇష్యూల్లో వేదాంత ఇన్వెస్టర్ ఆసక్తితో ఉంది. గత ఏడాది అక్టోబరులో 500 మిలియన్ డాలర్ల బాండ్ ఇష్యూ చేస్తే మూడు రెట్లు అమ్మకాలు సాగాయి. ఎన్సిడీ ఆఫర్ దద ఏబిఎ జూన్‌నెలలో 60శాతం కొనుగోళ్లు జరిగాయి. వేదాంత రీసోర్సెస్ తమ రుణభా రాన్ని 4.8 బిలియన్ డాలర్లు తగ్గించుకోగలి గింది. రెండేళ్లక్రితం వరకూ 8.9 బిలియన్ డాలర్లు ఉన్న రుణభారం ఇపుడు 4.8 బిలియన్ డాలర్లకు తగ్గింది.

## డాలర్ వర్సెస్ రూపాయి రూ.92.40

**ముంబయి, మార్చి 16:** డాలరుతో రూపాయి మారకం విలువలు పది పైసలు క్షీణించి రూ. 92.40వద్ద ముగిసింది. సోమవారం విదేశీ కరెన్సీ మార్పిడి మార్కెట్లలో భారత్‌రూపాయి కరెన్సీ విలువలపై ముడిచమురుధరల పెరుగుదల ప్రభావంతోపాటు విదేశీ నిధులు విత్‌డ్రా కూడా ఎక్కువ చూపించింది. అయితే దేశీయ ఈక్విటీ మార్కెట్లలో కొంత రికవరీ కనిపించడంతో రూపాయి క్షీణతకు కట్టడిపడింది. ఇంటర్‌బ్యాంకు ఫారిన్ ఎక్స్ఛేంజి కౌంటర్లలో స్థానిక రూపాయి 92.44వద్దకు పతనం అయింది. ఇంట్రాడేలో 92.47కు కూడా చేరింది క్రమేపీ బలపడి చివరకు 92.40వద్ద ముగిసింది. ముందురోజుకంటే 10పైసలు క్షీణించింది. మారాయ్ అసెట్ షేర్‌ఖాన్ విశ్లేషఖుడు అనూజ్‌చౌదరి మాట్లాడుతూ అమెరికా డాలర్ సూచీలో కొంత నెమ్మదింపు కనిపించింది. హార్ముజ్ జలసంధి పునఃప్రారంభం చేస్తామన్న ట్రంప్‌ప్రకటనలు కూడా డాలర్‌పై చూపించింది. ఇండస్ ఇండ్ సెక్యూరిటీస్ సీనియర్ విశ్లేషకుడు జిగార్ త్రివేది రూపీ రికార్డు దిగువస్థాయిల్లో



కదలాడిందని, ముడిచమురు ధరలు పెరగడం, విదేశీ ఈక్విటీ ఫండ్స్ విత్‌డ్రాలే ఇందుకు కారణమని అన్నారు. దీనికితోడు మార్కెట్లు బలపడి లాభాల దౌడుతీయడం కూడా రూపాయి క్షీణతకు కట్టడి పడినట్లయింది. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు ఈక్విటీల్లో రూ.10,716.64 కోట్లు విత్‌డ్రాచేసినట్లు తేలింది. ఇన్వెస్టర్లు ఫెడ్‌రిజర్వు, యూరోపియన్ సెంట్రల్‌బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ జపాన్, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌ల మానిటరీ పాలసీల నిర్ణయాలపైనా ఎక్కువ ఆసక్తిచూపిస్తున్నారు. రానున్న కాలంలో రూపాయి విలువలు రూ.92.10 నుంచి రూ.92.75 మధ్యలో ఉంటాయని షేర్‌ఖాన్ అనలిస్టు అనూజ్‌చౌదరి అన్నారు.

# నెమ్మదించిన బులియన్ మార్కెట్

### రూ.2950 తగ్గిన తులం బంగారం

### రూ.9 వేలు తగ్గిన కిలో వెండి




**ముంబయి, మార్చి 16:** కరెన్సీ పెట్టుబడులు, బాండ్లవైపు ఇన్వెస్టర్లు మొగ్గుచూపిస్తుండటంతో బంగారం వెండిధరలు సోమవారం స్వల్పంగా తగ్గాయి. వెండిధరలు అయితే ఢిల్లీమార్కెట్‌లో ఏకంగా కిలోకు రూ.9వేలు తగ్గిరూ.2.56 లక్షలుగా నడిచింది. బంగారం ధరలు కూడా రూ. 2950 తగ్గిరూ.1.60లక్షలకు చేరింది. ఆలిండియా సరాఫా అసోసియేషన్ అంచనాల ప్రకారం గ్లోబల్‌ధోరణులు క్షీణించడం, డాలర్ పటిష్టంకావడంతో ఈ ప్రభావం బులియన్‌పై పడిందని చెపుతున్నారు. ముందురోజు కిలో వెండి 2.65, 500గా ఉన్న సంగతి తెలిసిందే. 99.9 కేరట్ల బంగారం రూ.2950 తగ్గి రూ.1,60,250గా కొనసాగిందని చెపుతు న్నారు. అంతర్జాతీయ మార్కెట్లలో బులియన్‌ధరలు కూడా దిగువ స్థాయిలో ఉన్నాయి. స్పాట్ మార్కెట్‌లో ఔన్స్ ఒక్కొంటికి 5వేల డాలర్లుగా ఉంది. వెండిధరలు కూడా ఔన్స్‌కు 80 డాలర్లుగానే నడిచాయి. బంగారం ధరలు 20.94 డాలర్లు క్షీణించి 4,998.31 డాలర్లుగా కొనసాగితే వెండిధరలు కూడా 2.25 శాం క్షీణించి 78.76 డాలర్లుగా ఉందని సరాఫా అసోసియేషన్ ప్రకటించింది. రానున్నకాలంలో బులియన్‌ధరలు కొంతవరకూ అందుబాటులోనే ఉండవచ్చని కయ్‌నత్ చైన్‌వాలా కోటక్ సెక్యూరిటీస్‌ప్రతినిధి చెప్పారు. ఫెడ్‌రిజర్వు పాలకవర్గం ఫెడరల్‌ఓపెన్ మార్కెట్‌కమిటీ పాలసీ మీటింగ్‌కూడా కొంతమేర బులియన్ రంగంపై ప్రభావంచూపిస్తుందని ఫెడ్‌రిజర్వు యథాతథ స్థితిని ప్రకటించవచ్చని అంచనా వేసారు. ఇక వివిధ మార్కెట్లలో కూడా ధరలు వేరువేరుగా ఉన్నాయి. కొన్నిచోట్ల 24 కేరట్ల బంగారం పదిగ్రాములు రూ.1,59, 660గా కొనసాగింది. అలాగే 22 కేరట్లు కడూఆ రూ.1,46,350గాను 18 కేరట్ల బంగారం రూ.1,19,740గాను కొనసాగింది. ఇదిలా ఉంటే వెండిధరలు కూడా కిలో ఒక్కొంటికి రూ.2.76 లక్షలుగా కొనసాగాయి. కొన్నిచోట్ల 9 వేలు తగ్గితే కొన్నిచోట్ల నాలుగువేలే తగ్గినట్లు బులియన్ నిపుణులు చెపుతున్నారు. ముందురోజు అయితే రూ.2.80 లక్షలుగా కొనసాగిన సంగతి తెలిసిందే.

## 27.1 బిలియన్ డాలర్లకు తగ్గిన వాణిజ్యలోటు

**న్యూఢిల్లీ, మార్చి 16:** భారత్ వాణిజ్యలోటు ఫిబ్రవరిలో 27.1 బిలియన్ డాలర్లకు చేరింది. అంతకుముందునెలలో 34.68 బిలియన్ డాలర్లు ఉన్న లోటు ఫిబ్రవరిలో గణనీయంగా తగ్గింది. అమెరికానుంచి భారీస్థాయి సుంకాలనుంచి ఉపశమనం లభించడం, భౌగోళిక ఉద్రిక్తతల ప్రభావం లేకపోవడంతో ఫిబ్రవరిలో లోటు తగ్గింది. వాణిజ్య దిగుమతులు వార్షిక పద్ధతిలో 24శాతం పెరిగి 63.71 బిలియన్ డాలర్లకు చేరింది.ఎగుమతులు కూడా గతనెలలో 36.61 బిలియన్‌డాలర్లుగా ఉన్నట్లు వాణిజ్య మంత్రిత్వ శాఖప్రకటించింది. మొత్తం ఎగుమతులు వార్షిక పద్ధతిలోచూస్తే 11శాతంపెరిగి 76.13 బిలియన్ డాలర్లుచేరితో దిగుమతులు కూడా 22శాతం పరిగి 80.09 బిలియన్ డాలర్లకు పెరిగాయి. ఏప్రిల్‌నుంచి ఫిబ్రవరివరకూ ఉన్న ఎగుమతులు, సేవలరంగ ఎగుమతులు మొత్తం 790.86 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. అంతకుముందు ఏడాది ఇదే కాలంలో 747.58 బిలియన్ డాలర్లతోపోలిస్తే స్వల్పంగా వృద్ధి నమోదు చేసింది. ఇప్పటికీ అమెరికాకే భారత్ ఎగుమతులు అత్యధికంగా కొనసాగుతున్నాయి.

## ఫిబ్రవరిలో నిరుద్యోగిత రేటు 4.9%

**న్యూఢిల్లీ, మార్చి 16:** భారత్ నిరుద్యోగిత గణాంకాలు ఫిబ్రవరిలో 4.9శాతంగా నమోదయ్యాయి. కేంద్ర అర్థగణాంకశాఖ సోమవారం నిరుద్యోగం డేటాను విడుదలచేసింది. గ్రామీణ భారతావనిలో నిరుద్యోగం 4.2శాతంతో స్థిరంగానే కనిపించింది. అర్బన్ నిరుద్యోగిత రేటు మాత్రం ఏడు శాతంనుంచి 6.6శాతానికి క్షీణించింది. 15 ఏళ్ల అంతకుపైబడినవారిలో ఉపాధి అవకాశాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. కార్మికశక్తి భాగస్వామ్యరేటు ఎల్‌ఎఫ్‌పిఆర్ 15 ఏళ్లకుపైబడిన వారి ఉపాధి 55.9శాతంగానే ఉంది. ఇక గ్రామీణ ప్రాంతాలు, పట్టణప్రాంతాల్లో వరుసగా 15 ఏళ్లకుపైబడిన వారు 58.7శాతం, 55.9శాతంగా ఉంది. మహిళా కార్మికశక్తి ఉపాధి లబ్ధి 15 ఏళ్లకుపైబడినవారిశాతం 35.3శాతంగా ఉంది. గ్రామీణ పట్టణప్రాంతాల్లోనూ అలాగే ఉంది.జనవరిలో మహిళల



ఉపాధి గణాంకాలు 5.6శాతంగా ఉంటే ఫిబరబవరిలో 5.1 శాతానికి తగ్గింది. పట్టణప్రాంతాల్లోనే మహిళా ఉపాధి తగ్గుతున్నట్లు కనిపిస్తోంది. మొత్తంగాచూస్తే కార్మిక జనాభా నిష్పత్తి ఫిబరబవరిలో 53.2శాతంగా ఉంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.